# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

నవంబర్
2024

25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 17 సంచిక: 11


సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు


ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
డా॥ టి. గౌరీశంకర్
ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం
డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| తులసీ దామోదరాయ నమః | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 21 |
| భక్తలీలఆశుకుడు | 26 |
| కైవల్యమిచ్చే కార్తీకమాసం | 30 |
| నరకాసుర సంహారం | 32 |
| దీపావళి దానధర్మాల పండుగ | 36 |
| రామాయణ రత్నాకరం | 38 |
| ముకుందమాల | 43 |
| మీ ప్రశ్న మా సమాధానం | 46 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 47 |
| శ్రీకృష్ణ తత్వం | 53 |
| తిరుమల సర్వస్వం | 55 |
| విష్ణు సహస్రనామ మహిమ.. | 59 |
| ప్రదక్షిణ | 61 |
| శ్రీవేంకటేశ్వర తత్వం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## శరణాగతి ప్రార్థన

2024 సంవత్సరం దసరా నాటికి శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్థాపించి 22 సంవత్సరాలు దాటింది. ఈ సేవా పీఠంను తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపతో స్థాపించాము. ప్రతి విజయదశమి నాడు గతములో చేసిన సేవలను విశ్లేషించుకుని, తప్పులను సరిచేసుకొనుచు లక్ష్యసాధన దిశగా మరింత పట్టుదలతో పయనించుట ఈ పీఠం ఆనవాయితీ. ఈ పీఠం ఆధ్వర్యంలో స్వామివారు 2002 సంవత్సరం నుండి 2021 వరకు ప్రసాదించిన ప్రతి సేవ నేటికి కొనసాగుచున్నది. 1.తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపసమర్పణ 2. 'నమో వేంకటేశాయ రథయాత్ర' 3. శ్రీవేంకటేశం మాసపత్రిక 4. భజగోవిందం 5. శ్రీ శ్రీనివాస కళ్యాణాలు అనే సేవలు స్వామి కృపతో నేటికీ కొనసాగుచున్నవి. గత ఆగస్టు 24లోని గోకులాష్టమి రోజు 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ చేశాము. మరియు వచ్చే సంవత్సరం కొరకు 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణకు పుస్తక వితరణ కొనసాగుచున్నది. కోవిడ్ తరువాత కాలము నుండి 'నమో వేంకటేశాయ' రథమును కళ్యాణాల కార్యక్రమములో వాడుచున్నాము. అంతకుముందు 16 సంవత్సరాలు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు మొత్తం 25 రోజుల రథయాత్ర చేసి ఎంతోమంది భక్తుల ఇంటికి తీసుకువెళ్ళేవారిమి. 2007 సంవత్సరం ఏప్రిల్ నెల నుండి శ్రీవేంకటేశం మాసపత్రిక కొనసాగుచున్నది. 2012 నుండి భజగోవిందం అనే కార్యక్రమం సంవత్సరానికి రెండుసార్లు జరుపుచున్నాము. 2021 సంవత్సరములో ప్రారంభించిన మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమములో ఇంతవరకు 70 కళ్యాణాలను స్వామికృపతో చేయగలిగాము.

ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీ ఆజ్ఞ లేనిది ఏ చిన్న పని జరుగదు. మీరు కుంటివాణ్ణి నడిపించగలరు, చెవిటివాణ్ణి వినపడేటట్లు చేయగలరు. గ్రుడ్డివానికి చూపును ప్రసాదించగలరు. సంకల్పమాత్రములో ఈ సృష్టిలోని అన్ని పనులు చేసే సమర్థులు. ఇక మేము, మీరు సృష్టించిన ఈ లోకంలో అత్యంత అల్పులము. పైగా కామ క్రోధాలకు నిలయమైన నేటి కలియుగములో జనాల మధ్య నివసించువారిమి. ప్రయత్నించినప్పటికీ మాలోని వికారాలను తొలగించుకుని మీరు ఆశించు యోగ్యతను సాధించలేని శక్తిహీనులము. వేపచెట్టుకు రోజు పాలు, చక్కెర పానకము పోసినప్పటికీ దాని చేదు స్వభావము మారనట్లు, మీ ఇన్ని అనుగ్రహాల మరియు సేవల ప్రభావము అంతంతనే పని చేస్తున్నది. మీరు ఆశించిన స్థాయికి చేరనందుకు సిగ్గుపడుచున్నాము. ఒక ప్రక్క కాలముతో పాటు వయస్సు పరిగెడుచున్నది. మరోప్రక్క మీరు ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చనందుకు దిగులు కలుగుచున్నది. అందుకనే రక్షించమని శరణు వేడుచున్నాము. మీరు శరణన్న వారిని రక్షించే దయామయులు. పూర్వము అంత తప్పు చేసిన రావణున్ని సహితము శరణంటే రక్షిస్తానని చెప్పినవారు, దయామయులు. ఇక మేము తుచ్ఛ జీవులము, అల్పులము. చరమ శ్లోకాన్ని సహితము ఆచరించలేని అజ్ఞానులము, మీరే దిక్కని, రక్షించమని వేడుకుంటున్నాము. మా ఆపదలు తొలగించి విజయము చేకూర్చి ఆనంద భరితులను చేయ ప్రార్థన. మీరు చేయు ప్రతి పని లోక కళ్యాణార్థమే! ఏది సాధించ దలచి మాకు ఈ సేవాభాగ్యాన్ని ప్రసాదించారో దానిని లోక కళ్యాణార్థము పరిపూర్ణము చేయ ప్రార్థన.

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

# చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ లక్ష్మీనివాస నిరవద్య గుణైక సింధో
సంసార సాగర సముత్తరణైక సేతో
వేదాంత వేద్య నిజవైభవ భక్తభోగ్య
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – లక్ష్మీదేవికి నివాస స్థానమని, దోషరహితుడవని, సద్గుణ నిలయుడవని, సంసార సముద్రమును దాటించు నావ యని, నీ భక్తులకు అనుభవ యోగ్యుడవని – ఈ విధముగా ఉపనిషత్తులచే (వేదాంతముచే) తెలియబడిన మహిమా వైభవము గల శ్రీవేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

శ్లో ॥ ఇత్థం వృషాచలపతే రిహ సుప్రభాతమ్
యే మానవాః ప్రతిదినం పఠితుం ప్రవృత్తాః
తేషాం ప్రభాత సమయే స్మృతి రంగ భాజాం
ప్రజ్ఞాం పరార్థ సులభాం పరమాం ప్రసూతే ॥

తాత్పర్యం – ఈ విధముగా వేంకటేశ్వరునకు సుప్రభాత స్తోత్రమును ఎవరు ప్రతిదినము వేంకటాద్రి క్షేత్రమున చదువుచుందురో వారికి ప్రభాత సమయమున స్మృతి, పరమమైన ప్రజ్ఞ, భక్తి కలిగించి వారిని పరమపదము (మోక్షము) పొందునట్లు చేయును. ఇందు సందేహము లేదు.



# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



దెచ్చి

## భైరవి

సడిఁబెట్టె గటకటా – సంసారము – చూడ
జలధిలోపల యీఁత – సంసారము ||పల్లవి||

1. జమునోరిలో బ్రదుకు – సంసారము – చూడ
చమురు దీసిన దివ్వె – సంసారము,
సమయించుఁ బెనుదెవులు – సంసారము – చూడ
సమరంబులో నునికి – సంసారము ||సడి||

2. సంది గట్టిన తాడు – సంసారము –చూడ
సంది కంతల త్రోవ – సంసారము,
చందురుని జీవనము – సంసారము – చూడ
చందమేవలె నుండు – సంసారము ||సడి||

3. చలువలోపలి వేఁడి – సంసారము – చూడ
జలపూఁతబంగారు – సంసారము,
ఇలలోనఁ దిరువేంక –టేశ నీదాసులకు
చలువలకుఁ గడుఁజలువ – సంసారము ||సడి||



భావము – అయ్యయ్యో! సంసారము కష్టము పెట్టినది. ఆలోచించగా ఇది సముద్రములోని ఈత వంటిది. ఈతచే సముద్రము దాటుట అసాధ్యమైనట్లే సంసారము నుండి ముక్తి నొందుట సాధ్యము గానిపని. సాగరములోని ఈత ప్రమాదకరము. అట్లే సంసారములోని జీవయాత్ర సంకటకరము.

సంసారము యముని నోటిలో బ్రదుకు వంటిది. తననోట జీవించువానిని యముడు ఏ క్షణమునందైన కబళింపవచ్చును. అట్లే సంసారమున నున్నవాడు ఎప్పుడైన ప్రమాదమునకు గురికావచ్చును. సంసారము చమురు దీసిన దీపము వంటిది. ఆ దీపము చక్కగా వెలుగక ఆరిపోవుటకు సిద్ధముగా నున్నట్లే సంసారి సుఖస్థితి నొందక మృత్యుముఖమున బడుటకు సిద్ధముగా నుండును. సంసారము చంపుటకు సిద్ధమైన పెద్ద రోగము వంటిది. క్షయాది రోగములు దినదినమునకు రోగిని క్షీణింపచేసి చివరకు ప్రాణము తీయును. సంసారము కూడ జీవుని శమ దమాది గుణములను హరించి స్వాతంత్ర్యహీనుని చేసి చివరకు మృత్యుముఖమున పడద్రోయును. సంసారము యుద్ధభూమిలో నునికి వంటిది. రణరంగమున నున్నవాడు నలువైపులా శత్రువులచే ముట్టడింపబడి దెబ్బలు తినును. అట్లే సంసారియు కామ క్రోధాద్యరిషడ్వర్గములచే ఆక్రమింపబడి క్షతి నొందును.

మరియు సంసారము రెక్కల క్రింద గట్టిన త్రాటి వంటిది. వక్షఃస్థలమున త్రాటిచే బంధింపబడినవాడు కట్టినవాని కధీనుడై ముందుకు పోజాలడు. అట్లే సంసారగతుడు ముక్తిమార్గమున స్వేచ్ఛగా పయనింపలేడు. సంసారము సందికంతల త్రోవ వంటిది. ఇరుకైన గొందిలతో కూడియున్నచో పయనము మిక్కిలి ప్రయాసకరము. అట్లే సంసార మార్గమున నడుచుట క్లేశావహము. సంసారము చంద్రుని జీవనము వంటిది. చంద్రుని బ్రదుకు వృద్ధి క్షయములతో కూడి నిలకడ లేకుండును. అట్లే సంసారులు కూడ నానావిధములైన ఆయు వ్యయ – సుఖ దుఃఖాది – వృద్ధి క్షయములకు లోనై కుదురుపాటు లేక కష్టపడుచుందురు. కాని పైకి చూచుటకు మాత్రము సంసారము మిక్కిలి చక్కగా నున్నట్లుండును.

సంసారము పచ్చకర్పూరము వలె చలువలోపల వేడితో కూడినది. పైకది చల్లగా సుఖాస్పదముగా కన్పించినను నిజముగా దుఃఖకరమైనదని భావము. మరియు అది పైపూత బంగారు వంటిది. పైకి మెరుగుగా కన్పించినను లోపల విలువ లేనిదని గ్రహింపదగినది.

ఇట్లైనను శ్రీవేంకటేశ్వరుని దాసులకు మాత్రము సంసారము చలువలకు చలువయై సుఖాస్పదమగుచున్నది. అనగా భగవంతుని భజించి తదనుగ్రహమునకు పాత్రులైనవారు సంసారములో నున్నను క్లేశము నొందరని తాత్పర్యము.

# తులసీ దామోదరాయ నమః

– చింతలపాటి శివశంకర శాస్త్రి



"నమామీశ్వరం సచ్చిదానందరూపం
లసత్కుండలం గోకులే భ్రాజమానమ్
యశోదా – భియో లుఖలాద్ధవమానం
పరామృష్టమ్ – అత్యంతతోద్రుత్య గోప్యా"

కృత్తికా నక్షత్రముతో కూడిన పున్నమి గల మాసాన్ని కార్తీక మాసమని అంటారు. కార్తీకం కమనీయం, రమణీయం, మహనీయం, కైవల్యకారకం, హరిహరప్రియం, జగద్రక్షాకరం. శివకేశవులిద్దరూ అద్వైతంగా, అన్యోన్యంగా పూజలందుకుంటూ భక్తులను అనుగ్రహించే మాసం కార్తీక మాసం. ఈ మాసంలో సకల చరాచర సృష్టిలోనూ వారిద్దరూ కలిసి ఉంటారు. నదుల్లో, చెట్లలో, దీపాల్లో, వాయువుల్లో, ఆకాశంలో, పంచభూతాలలో అంతటా శివకేశవాద్వైతం కొలువు దీరి యుంటుంది. కార్తీకంగా, దామోదర, ఊర్జమాసంగా మూడు పేర్లతో పిలిచే ఈ మాసం సమన్వయానికి సంకేతం. నదీ స్నానాలు, దీపదానాలు, దీపతోరణాలు, వనభోజన, దానాలతో మానవ సమాజంలోనూ, మానవులను అనుగ్రహించడానికి దేవతలలోనూ కూడా సమైక్యతను, నిరాడంబరతను, అద్వైతాన్ని అభేదాన్ని కల్పించే కార్తీకం అన్ని మాసాలలోనూ గొప్పది. ఈ మాసం శరదృతువులో వస్తుంది. జీవన గమనంలో మనకు తెలిసికానీ, తెలియకుండా కానీ చేసిన పాపాలను అంతరింప చేస్తుంది కనుక ఈ మాసం మహత్తరమైంది.

కృత్తిక అగ్ని నక్షత్రం. అగ్నిహోత్రారాధనకు ప్రాధాన్యతనిచ్చే యజ్ఞ సంస్కృతి మనది. ''అగ్ని ముఖావై దేవాః'' అని వేదవాక్కు. సర్వ దేవతలను అగ్ని ద్వారానే ఆరాధిస్తారు. అగ్ని నక్షత్రమైన కృత్తికకు వేద ప్రాధాన్యం ఉంది. వైదిక యజ్ఞాలలో 'నక్షత్రేష్టి' అని ప్రధానమైన అంశమున్నది. అది కృత్తికతో ప్రారంభించి వరుసగా నక్షత్ర దేవతలను ఆరాధించే క్రతువు. ''కృత్తికాది భరణ్యంత నక్షత్రేష్ట్యర్చితోదయా'' అని లక్ష్మీ సహస్ర నామాలలోని ముఖ్యనామం.

ఆషాఢ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. దీనికే మరో పేరు శయనైకాదశి. విష్ణుమూర్తి యోగనిద్రకు ఉపక్రమించే రోజిది. లోకపాలనా కర్తవ్యాన్ని 'నారాయణి' అయిన తన ప్రియ సోదరి పార్వతికి అప్పగించి విష్ణువు యోగనిద్రా స్థితిలో నాలుగు నెలల పాటు ఉంటాడు. ఉత్థాన ఏకాదశి అని పిలిచే కార్తీక మాస శుక్ల ఏకాదశినాడు విష్ణువు నాలుగు నెలల యోగనిద్ర చాలించుకుంటాడు. ఉత్థాన ఏకాదశి (లేక)

ప్రబోధిని ఏకాదశినాడే పండరీపుర యాత్ర కూడా ముగుస్తుంది. కార్తీక మాసపు అధిదైవతం అయిన దామోదరుని వివాహం తులసీదేవితో ఈ ఏకాదశి రోజునే వేడుకగా చేస్తారు.

తులసి – భూలోకపు కల్పవృక్షము. విష్ణువుకు ప్రీతిపాత్రమైన తులసి మహిమ మహిమాన్వితమైనది. హిందువుల చేత భక్తి శ్రద్ధలతో పూజలందుకుంటున్న దేవత తులసి.

**"తులసీ స్మరణే నైవ సర్వపాప వినశ్యతి**
**తులసీ స్పర్శనేనైవ నశ్యంతి వ్యాధయే నృణామ్"**

అని ప్రతీతి. కేవలం స్మరించినంత మాత్రముననే సకల పాపాలను ప్రక్షాళనం చేసే, స్మరించినంత మాత్రముననే సర్వ వ్యాధులను నయం చేసే కల్పవృక్షము మరియు చింతామణి. వందనమొనరించగానే రోగ నివారణ గావించునది తులసిమాత.

తులసి ఆవిర్భావానికి సంబంధించిన కథలు వివిధ పురాణాల్లో వర్ణించబడ్డాయి.

ద్వాపర యుగంలో తులసి అనే కృష్ణభక్తురాలుండేది. తులసిపట్ల శ్రీకృష్ణుని అనురాగాన్ని చూసి ఈర్ష్య చెందిన రాధ తులసిని మరో జన్మ ఎత్తుతావని శపించింది. రాధ శాపంతో భయపడి తులసి శ్రీకృష్ణుని శరణు జొచ్చింది. ఆమె పట్ల ప్రసన్నుడైన శ్రీకృష్ణ పరమాత్మ భూలోకంలో పుట్టినప్పటికీ కొంతకాలం తపస్సు ఆచరించిన తరువాత తన అంశలో లీనమవుతావని అనుగ్రహించాడు. శాపకారణంగా తులసి మరోజన్మలో మాధవీ ధర్మధ్వజ రాజ దంపతులకు కుమార్తెగా జన్మించింది. రాజదంపతులు ఆ బాలికను అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. ఆమెకు 'తులసి' అని నామకరణ మొనంగిరి. యుక్తవయస్కురాలైన తులసి మహావిష్ణువు తనకు భర్త కావలెనన్న కోరికతో బదరికావనానికి వెళ్ళి బ్రహ్మను గురించి తపమాచరించింది. ఆమె తపస్సుకు మెచ్చి బ్రహ్మ ఆమె కోరిన వరాన్ని అనుగ్రహించాడు.

'సుదామ' అనే గోపాలుడు కూడా రాధా దేవిచే శపించబడి భూలోకంలో శంఖచూడుడనే రాక్షసునిగా జన్మిస్తాడు. అతడు బ్రహ్మను గురించి తపమాచరించి మెప్పించి కృష్ణ కవచాన్ని వరంగా పొందుతాడు. బ్రహ్మ వరాన్ని అనుగ్రహిస్తూ నీ భార్య శారీరకంగా, మానసికంగా శీలాన్ని కళంక పరుచుకుంటే ఆమె వలన నీకు మరణం తథ్యమని చెబుతాడు. అనంతరం బదరికా వనంలో తులసిని చూచిన శంఖచూడుడు ఆమెను మోహించి గాంధర్వ వివాహం చేసుకుంటాడు. వరగర్వితుడైన శంఖచూడుడు సమస్త లోకాలను జయించి తాపసులను దేవతలను పీడించసాగాడు. భయకంపితులైన దేవతలు త్రిమూర్తులకు మొర పెట్టుకోగా, వారి మొరను ఆలకించిన శివకేశవులు శంఖచూడుని అణచి వేయడానికి పూనుకున్నారు. విష్ణువు వృద్ధుని వేషంలో శంఖచూడుని యాచించి అతని వద్దనున్న కృష్ణ కవచాన్ని గ్రహించి, శంఖచూడుని వేషంలో తులసి దగ్గరకు వెళతాడు. శంఖచూడుని వేషంలో ఉన్న విష్ణువును తన భర్తగా భావించిన తులసి ఆయనకు సపర్యలు చేసి దగ్గరైంది. ఆవిధంగా ఆమెకు వ్రతభంగము జరగడంతో విష్ణువు శంఖచూడుని వధించినాడు. భర్తవేషంలో వచ్చినవాడు భర్త శంఖచూడుడు కాదని తెలుసుకున్న తులసి విష్ణువును శపించింది. తనని శపించిన తులసితో విష్ణువు ఇలా అన్నాడు. తులసీ! నీవు నాకోసం తపస్సు చేశావు. ఈ శరీరాన్ని త్యజించు. త్యజించిన నీ శరీరం గండకీ నదిగా మారిపోతుంది. నీ కేశాలు తులసీదళాలుగా మారి నాకు ప్రీతికరములు అవుతాయి. నేను ఆ గండకీ నదీ తీరమున సాలగ్రామమునై అవతరిస్తాను. జనులకు ఆరాధ్యుడిని అవుతాను అని విష్ణువు తులసిని అనుగ్రహించాడు. తులసి భక్తి ప్రపత్తులతో శ్రీమన్నారాయణునకు నమస్కరించింది.

పద్మ పురాణములోని కథ ననుసరించి తులసి అమృతము నుండి పుట్టింది. దేవదానవులు ఏకాదశి నాడు క్షీరసాగరము మథించగా ద్వాదశి నాడు పూర్తయ్యింది. ఆనాడు అమృతంతో పాటు తులసి కూడా పుట్టింది. విష్ణుపూజకు అర్హురాలైంది. అమృతమును చూచిన విష్ణువుకు ఆనందంతో నేత్రములనుండి ఆనంద బాష్పములు వెలువడి అమృతమునందు పడినవి. వెంటనే తులసి ఆవిర్భవించింది. విష్ణువు లక్ష్మీదేవి, కౌస్తుభముతో పాటు తులసిని కూడా స్వీకరించాడు. అమృతము నుండి పుట్టిన తులసి అన్ని పూజలకు పనికి వస్తుంది. ఏకాదశి నాడు ఉపవాసము చేసి, ద్వాదశి నాడు నన్ను తులసీదళాలతో పూజించి, పారాయణము చేసినవారికి ముక్తి లభిస్తుంది. ధర్మార్థ కామ మోక్షాలు నాలుగింటినీ ద్వాదశి ప్రసాదిస్తుందని శ్రీమన్నారాయణుడే స్వయంగా చెప్పినట్లు పద్మపురాణము పేర్కొంది. తులసిలేని మాలను మహావిష్ణువు యొక్క అర్చనలో ఉపయోగించరాదని శ్రీ వైఖానస, ఆగమశాస్త్ర గ్రంథాలు నిక్కచ్చిగా చెప్పాయి.

సనాతన భారతీయ సంప్రదాయంలో తులసి ప్రాధాన్యం చెప్పనలవి కాదు. స్త్రీలు రోజూ ఉదయం, సాయంత్రం రెండు వేళలా తులసిని పూజిస్తారు. తులసికోట లేని ఇల్లు ఉండదని చెప్పడం అతిశయోక్తి కాదు. తులసికోట చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. సాయంకాలం తులసికోట దగ్గర దీపారాధన చేస్తారు. తులసి మొక్కను సర్వదేవతా స్వరూపంగా నమ్ముతారు. తులసి మూలంలో సకల తీర్థాలు, మధ్యభాగంలో సర్వదేవతలు, అగ్రభాగాన సర్వ వేదాలు కొలువై ఉంటాయి. అలాగే తులసి అగ్రభాగంలో బ్రహ్మదేవుడు, మధ్యభాగంలో మహావిష్ణువు, మూలంలో మహేశ్వరుడు, శాఖల్లో అష్టదిక్పాలకులు నివసిస్తూ ఉంటారని పురాణాలు చెబుతున్నాయి.

తులసికి గుబురుగా వృద్ధి చెందు స్వభావము ఉండుట వలన బృంద యని, మహారణ్యము లాగా పెరుగు స్వభావం కలిగి

యుండుట వలన బృందావనమని పేరు. పూర్వము యోగులకు దివ్యులకు దర్శనభాగ్యము కలిగించినందువలన బృందావనమని ప్రశస్తి. ఉత్థాన ఏకాదశి నాడు యోగనిద్ర విరమించిన విష్ణువు క్షీరాబ్ది ద్వాదశికి తులసి బృందావనానికి విచ్చేస్తాడు. విష్ణుపరంగా కార్తీకం చాలా ప్రసిద్ధి. ఈ మాసానికంతటికీ విష్ణువు దామోదర నామంతో అధిపతిగా ఉన్నాడు. సర్వలోకములను తనలో దాచుకున్న పరతత్త్వమే దామోదరుడు. ఈ మాసాన విష్ణుపూజ విశేష ఫలప్రదం. తులసీవనాలలో స్వామిని ఆరాధించడం ఏకాదశి, ద్వాదశి తిథులలో ప్రత్యేక వ్రత నియమాలతో ఉపాసించడం ఉత్కృష్టమని బహు పురాణాలు చెబుతున్నాయి.

తులసీవనంలో స్వామిని అర్చించే పర్వం ఈ రోజులలోనే క్షీరాబ్ది ద్వాదశిగా వస్తున్నది. దీపావళి అమావాస్య తరువాత కార్తీకమాసంలో పన్నెండోరోజు క్షీరాబ్ది ద్వాదశి. దీనికే చిలుకు



ద్వాదశి అని మరోపేరు. నాలుగు నెలల పాటు నిద్రించిన శ్రీహరి యోగనిద్ర విరమించి తులసీ బృందావనానికి విచ్చేస్తాడు. కనుక ఆరోజున విష్ణువుకు పూజ, తులసిపూజ తప్పక చేయాలి.

దామములుగా అనగా లోకములు, త్రాళ్ళు అని అర్థము. 'దామములను (లోకములను) ఉదరమునందు (తనలో) కలవాడు దామోదరుడు'. సర్వలోకాలను వహించి, పోషించే పరమాత్ముడు నారాయణుడు. ఆ నారాయణుడు శ్రీకృష్ణ పరమాత్మగా అవతరించినప్పుడు తన మాధుర్య లీలలో భాగంగా తల్లి యశోదమ్మ చేత త్రాటి చేత (దామముచే) రోటికి బంధింపబడ్డాడు. శైశవావస్థలో యున్న అల్లరి కృష్ణుడొకనాడు దధిభాండం (పెరుగుకుండ) పగులగొట్టి తల్లి కోపానికి గురయ్యాడు. లాలనము దోషమని, వీనిని దండిస్తే గాని బుద్ధిగా ఉండడని తలచి తల్లి యశోద బెత్తము చేతబట్టి పారిపోవు కృష్ణుని వెంటబడింది. తన్ను పట్టుకోవడానికి వచ్చే తల్లికి అందకుండా అటూ ఇటూ పరుగెత్తుతూ చివరికి దొరికాడు. కొడుకును కొట్టడానికి చేతులు రాక కట్టివేద్దామని తలచి రోటికి కట్టివేసింది. ఆ విధంగా దామము చేత కట్టి బంధింపబడుట చేత దామోదరుడయ్యాడు. అందుకే ఈ మాసంలో ఏ పుణ్యకార్యం చేసినా "కార్తీక దామోదర ప్రీత్యర్థం" అని సంకల్పించడం అనవాయితీగా వస్తోంది.

క్షీరాబ్ది ద్వాదశి నాటి సాయంత్రం తులసి కోట వద్ద శుభ్రం చేసి ముగ్గులతో అలంకరించాలి. కోటకు పసుపు రాసి, దానిపై కుంకుమతో కళ్యాణ తిలకం దిద్దాలి. తులసి మొక్క పక్కనే విష్ణు స్వరూపిణి ఉసిరికొమ్మను ఉంచి అలంకరించి దీపారాధన చేయాలి. తులసి మొక్కకు, ఉసిరి మొక్కకు అష్టోత్తర శతనామాలతో పూజించాలి. తాంబూలం సమర్పించిన తరువాత కర్పూర హారతినివ్వాలి. పుష్ప నివేదన చేసి పన్నెండు వత్తులు లేక మూడు వందల అరవై వత్తులతో దీపారాధన చేసి నివేదన సమర్పించాలి. పూజ తర్వాత దీపదానం చేయడం ప్రశస్తం.

మహారాష్ట్ర ప్రాంతంలో సాయంకాలము మునిమాపువేళ క్షీరాబ్ది ద్వాదశి సందర్భముగా ఇంటినిండా దీపాలను వెలిగిస్తారు. బాణసంచా కాలుస్తారు. శ్రీకృష్ణ విగ్రహానికి, తులసి మొక్కకు నడుమ తెల్లని వస్త్రాన్ని కడతారు. తర్వాత వివాహం తంతు జరుగుతుంది. భక్తి శ్రద్ధలతో పెళ్ళి చేస్తారు. వాళ్ళు ఈ పర్వాన్ని దేవ దీపావళి అని పిలుస్తారు. వివాహ తంతును "తులసీ లగ్న్" అని పిలుస్తారు. దీపాలను వెలిగిస్తారు. దీపకాంతి జగతికి క్రాంతి శాంతి ప్రసాదించి, భ్రాంతిని తొలగిస్తుందని హైందవ సంప్రదాయ విశ్వాసం. దీపాన్ని వెలిగించడం, నమస్కరించడం, స్తుతించడం, ఆ దీపంతో మరో దీపాన్ని వెలిగించడం, ఆ దీపాన్ని కుంకుమ పూలతో పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. నెలంతా వెలిగించే వీలులేనివారు కార్తీక సోమవారాల్లో, దేవాలయాలలో దీపదానం చేయొచ్చని, అదీసాధ్యం కాకపోతే కనీసం పౌర్ణమి నాడైనా దీపప్రకాశనం చేస్తే దివ్యలోక సాయుజ్యం పొందవచ్చని అంటారు. శివకేశవులిద్దరికీ ప్రీతి పాత్రమైంది దీపదానం. అది మోక్షామృత సోపానం.


జీవులందరిలో, జగత్తంతా శివమయం. సత్యం, శాశ్వతం, అనంతం, అప్రమేయమైన, మహత్తరమైన తులసీదామోదరులను అర్చించి, స్తుతించి మన తనువు, వచస్సు పునీతం చేసుకుందాం.

**"సర్వేజనా – సుఖినోభవంతు"**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



20వ భాగము


# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**— గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 20 వ భాగపు లీలల ప్రచురణ. (ఆగస్టు 2007 నుండి ఫిబ్రవరి 2008).



## స్వామి ఆజ్ఞచే చిన్నగుండవెల్లి, సిద్ధిపేటలో నమో వేంకటేశాయ రథం తిరుగుట

మేము నమో వేంకటేశాయ రథమును కేవలం శ్రీవేంకటేశ్వరుని సేవకు మాత్రమే వాడుదుము, అది కూడా గోకులాష్టమి నాడు జరిగే జప సమర్పణ సమయానికే రథమును త్రిప్పుదుము. అంతవరకు మా ఇంట్లోని రథం షెడ్డులో ఉంటుంది. బయటి ప్రపంచానికి చూడ ఈ రథంకు నేను యజమానిని. కాని స్వామివారే దీని యజమాని. నిజానికి మొత్తం రథయాత్ర శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞతోనే జరుగుతుంది. టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాటను నేను స్వామివారి మాటగా భావిస్తాను. ఇప్పుడు సమయం కాని సమయంలో రథమును త్రిప్పమని స్వామివారు ఆజ్ఞ ఇచ్చారు. ఆ లీల ఈవిధముగా ఉంది.

**తేది 12-08-2007 కల :** నేను మా సొంత గ్రామము చిన్నగుండవెల్లిలో ఉన్నాను. ఏదో పని నిమిత్తమని బయటకు వెళ్ళాను. ఇంతలో నమో వేంకటేశాయ రథయాత్రకు సమయమైందనే భావన కలిగింది. ఇది రథయాత్ర సమయము కాదుకదా అని అనుకున్నప్పటికి, స్వామి ఆజ్ఞ కాబట్టి నా పనులను వదిలేసి వెంటనే ఇంటిముఖం పట్టాను. వచ్చే దారిలో మా ప్రక్క ఇంటి నుండి స్వామి భజన వినబడుతోంది. ఆ ప్రక్క ఇంటాయన నన్ను చూచి ఆ... వెళ్ళు... టైమైంది... అని నాతో అన్నాడు. దీని అర్థం రథయాత్రకు టైమైందని భావం. నేను ఇది సమయం కాదు కదా... అని ఆశ్చర్యపోతూ... ఇంటికి పోయాను. ఇంతే కల. ఈ కల ఎందుకు వచ్చింది, ఇప్పుడు రథయాత్ర ఏంటి? అని తెల్లవారి ఆలోచించాను. తరువాత ఈ క్రింది

విధంగా జరిగింది.

ఈ మధ్యనే శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు టి.టి.డి ఈ.ఓగా నియమితులైనారు. వారు సిద్ధిపేట వాస్తవ్యులు. తేది 14-06-2007 నాడు సాయంత్రము హిమాయత్ నగర్ లోని టి.టి.డి హాలులో తరిగొండ వేంగమాంబ సదస్సును వీరు ప్రారంభించారు. దీనికి నేను కూడా వెళ్ళాను. నిజానికి నేను ఆయన్ను పరిచయం చేసుకోవాలని వెళ్ళాను. సభ జరిగిన తరువాత ఒక మిత్రుడు నన్ను శ్రీమాన్ రమణాచారి గారికి పరిచయము చేశాడు. నేను స్వామి భక్తుడనని, ప్రతి సంవత్సరం చాలా పెద్ద యెత్తున స్వామి ఫంక్షన్ చేస్తాడని చెప్పారు. అప్పుడు నా వద్ద ఒక రథం ఉన్నదని దానిని ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి తిరుపతి వరకు త్రిప్పుదునని చెప్పాను. ఇంతలో ఈ.ఓ గారు ఈ రథంను సిద్ధిపేటలో 'కళ్యాణమస్తు' ప్రోగ్రాములో త్రిప్పుమని బలవంతపెట్టాడు. నేను ఆయన మాట కాదనలేక బలవంతాన ఒప్పుకున్నాను. ఈ విధంగా రథయాత్ర సమయము కానప్పటికీ ఈ.ఓ గారు ఆజ్ఞాపించారు కాబట్టి త్రిప్పుటకు ఒప్పుకున్నాను. తేది 01-07-2007 నుండి కళ్యాణమస్తు కార్యక్రమమును ప్రచారము చేయుటకు వీలుగా సిద్ధిపేట నుండి ఈ.ఓ గారు రథయాత్రను స్వయంగా ప్రారంభించారు. ఈ రథయాత్ర ప్రారంభోత్సవంలో ఆ ప్రాంత ఎం.ఎల్.ఎ, ఎం.పి. గారు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. సిద్ధిపేట, చిన్నగుండవెల్లితో పాటు ఆ ప్రాంతంలో ఈ రథం స్వామి ఆజ్ఞచే నాలుగు రోజులు తిరిగింది. ఈవిధంగా టి.టి.డి ఈ.ఓ గారి ఆజ్ఞచే మా నమో వేంకటేశాయ రథం మొదటిసారి చిన్నగుండవెల్లి, సిద్ధిపేట ప్రాంతాలలో తిరిగి ఆ ప్రాంతపు ప్రజలకు స్వామి అనుగ్రహం లభించునట్లు చేసింది.

## వైకుంఠము నుండి జారిపడ్డ 'శ్రీవేంకటేశం'

సంవత్సరం 2007 ఏప్రిల్ ఇష్యూ నుండి స్వామి వారు సూచించినట్లు 'నమో వేంకటేశాయ' అనే తెలుగు మాస పత్రికను ప్రారంభించాము. సరైన సమయంలో పత్రిక వెలువడనందున ఏప్రిల్ 2007 లోనే ఆర్.ఎన్.ఐ వారు ఈ పత్రికను 'డి' బ్లాక్ లో వేశారు. తిరిగి కొత్త పేరు కోసం అప్లై చేసుకొమ్మన్నారు. నేను ఈ పత్రికను గత నాలుగు నెలల నుండి అదే పేరుపైన ప్రచురిస్తూ తిరిగి ఇదే పేరు కోసం అప్లై చేశాను. ఏప్రిల్ 2007 లో అప్లై చేస్తే జూన్ నెల వరకు ఏ విషయం తెలియలేదు. అడుగడుగునా ఆటంకాలు ఏర్పడ్డవి. నేను మాత్రం నాకు ఇదే టైటిల్ కావాలని పట్టు పట్టాను. రికమెండేషన్ పెట్టాను. తెలిసిన వారితో చెప్పించాను. కాని నాకు 'శ్రీవేంకటేశం' అనే టైటిల్ వచ్చిందని అనధికారికంగా తెలిసింది. చాలా చింతించాను. స్వామివారిని తీవ్రంగా ప్రార్థించాను. ఎందుకంటే నా కారణంగా స్వామివారు స్మరించబడాలనే కోరిక నాలో బలంగా ఉన్నది.



వైకుంఠం నుండి జారి పడ్డ శ్రీవేంకటేశం

ఈ నమో వేంకటేశాయ అనే పేరును చూడగానే భక్తుల మదిలో అనుకోకుండా స్వామి నామం ఉచ్చరించబడునని భావించి ఈ పేరుకై ప్రాకులాడాను. విశ్వప్రయత్నం చేసినప్పటికీ లభించనందున అలసిపోయాను. చివరికి నాకు మీ సేవ చేయుటకు తగిన అర్హత లేదు, నేను మీ పూర్తి భక్తుడిని కాదు, అని ప్రార్థించి ఇక మీ దయ అని ముగించి ఇంటికి పోయాను.

ఈ రాత్రి చక్కని కల కన్నాను. అందులో వైకుంఠము నుండి జారవిడిచిన ఒక వస్తువు, ఎన్నో ఆర్చుల గుండా లేదా లోకాల గుండా ఈదుకుంటూ మా 'నమో వేంకటేశాయ' పత్రిక టైటిల్ పై పడ్డది. ఈ అద్భుతమైన లీల ఈవిధంగా ఉంది.

**తేది 11-07-2007 కల :** ఈనాటి కల విచిత్రంగా ఉంది. అది ఒక దేవలోకం, వైకుంఠం లేక ఇంద్రలోకం లాంటిది. ఆ లోకంలో ధగధగా మెరిసే ఒక బంగారు ఆర్చి కనబడ్డది. ఈ ఆర్చి మధ్య నుండి ఎవ్వరో కంప్యూటర్ కీబోర్డ్ క్లిక్ చేయగా 'నమో వేంకటేశాయ' అనే బంగారు అక్షరాలతో ఉన్న పదం, ఆ లోకం నుండి జారవిడువగ అది ఇలాంటి మరో ఐదారు లోకాలలోని ఒక్కొక్క బంగారు ఆర్చుల గుండా ఈదుకుంటూ భూమి మీదికి బంగారు కాంతితో వచ్చింది. ఈ భూమిమీద, మా ఆఫీసులో ఒక వ్యక్తి కంప్యూటర్ కీబోర్డును క్లిక్ చేయగా నమోవేంకటేశాయ మాసపత్రిక టైటిల్ పై తళ తళ మెరిసే కాంతితో పడ్డది. కల చెదిరింది. దీన్ని చూచి స్వామివారు నాకోసం మళ్ళీ 'నమో


వేంకటేశాయ' అను టైటిల్ ను పంపుచున్నారనుకున్నాను. కాని ఈరోజు మధ్యాహ్నము 'శ్రీవేంకటేశం' అనే టైటిల్ వచ్చినట్లు ఆర్.ఎన్ . ఐ నుండి ఉత్తరం వచ్చింది. నమో వేంకటేశాయ టైటి ల్ రానందుకు చాలా విచారించాను. నా మనస్సు ఈ 'న మో వేంకటేశాయ' తప్ప మరే పేరును ఇష్టపడలేదు. అందుకని నమో వేంకటేశాయ కోసం మరికొన్ని రోజులు తీవ్రంగా ప్రయత్నించసాగాను. ఈ పత్రికను మొదట్లో నేను సకాలంలో మొదలు పెట్టని కారణంగా తరువాత కాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను.

## సురేఖను ప్రత్యేకంగా అనుగ్రహించుట

మేము తయారు చేసిన 'నమో వేంకటేశాయ' రథానికి నా భార్య సురేఖ తన నగలను వెచ్చించి నాలుగు వైపులా ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి మూర్తులకు బంగారు తాపడం చేయించింది. దీనికి సంతోషించిన శ్రీవేంకటేశ్వరుడు సురేఖను ప్రత్యేకంగా ఎన్నోసార్లు అనుగ్రహించాడు. ఆ లీలలు ఈవిధంగా ఉన్నవి.

ఈసారి ఐదవ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ తేది 04-09-2007 గోకులాష్టమి నాడు ఉన్నది. దీనికోసం రథయాత్రను తేది 05-08-2007 నుండి ప్రారంభించాలని నిర్ణయించాము. రథం ప్రారంభానికి 7 రోజుల ముందునుండి వ్రాయించిన జపానికి మా ఇంటిలో ప్రత్యేక పూజలు చేయుట ఆనవాయితీ. ఈ పూజలను తేది 29-07-2007 నుండి 05-08-2007 వరకు జరుప నిర్ణయించాము.

సాధారణంగా సురేఖకు నమో వేంకటేశాయ రథం తిరిగే రోజులు సమీపిస్తుండగ ఒక నాగుపాము పడగ విప్పి ప్రాకుచున్నట్లుగా, మిగతా రోజులలో ఆ పాము పడుకొని ఉన్నట్లు కలగంటుంది. మా ఇంటిలో పూజలు నిర్వహించు సమయాన పడుకున్న ఆ పాములో కదలికలు మొదలవుతాయి. కాని ఈసారి అందుకు పది రోజుల ముందు నుండే ఆ పాము పడగ విప్పి ఉండుటను సురేఖ గమనించింది. మరియు ఆ పడగలో శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా దర్శించింది. స్వామివారు ఈ లీలను పలుసార్లు దర్శింపచేసి ఆమెను ఆనందంలో ముంచెత్తారు.



**తేది 19-07-2007 కల :** ఈనాటి కలలో ఉత్తరం వైపు ఉన్న మా ఇంటి ద్వారము ప్రక్క మూలకు ఒక రుంగ చుట్టుకుని పడుకున్న నాగుపాము పడగవిప్పి కొంతవరకు భూమి నుండి పైకి లేచి సురేఖను చూస్తున్నదట. ఆ సమయాన ఆమె పై అంతస్తు నుండి మెట్ల ద్వారా క్రిందికి వస్తున్నదట. కొంతసేపు అలాగే ఎలాంటి భయము లేక ఆ పామును సురేఖ చూచిందట. ఈరోజు ఇంతే కల. దీనిని విన్న నేను నాకు తెలిసినంతలో దీని అర్థమును ఆమెకు ఈవిధంగా వివరించాను. పాము అంటే ఆ స్వామికి శయనమని, ఆదిశేషుడని , మా రథం కూడా ఆ స్వామికి ఆదిశేషునిలాంటిదని భయపడకుమని అన్నాను. ఆమె కూడా రథం త్రిప్పే సమయం ఆసన్నమైంది కావున ఈ విధంగా కనిపించిందని అనుకున్నది. తృప్తి చెందింది. కాని తిరిగి రెండు రోజులకు ఇదే కల పునరావృతమైంది. అప్పుడు సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు ఆమెకు ప్రత్యేక పద్ధతిలో దర్శనమిచ్చాడు. ఆ లీల ఈవిధంగా ఉంది.


**తేది 22-07-2007 కల :** ఈ కలలో స్వామివారు విచిత్ర రూపమును, విచిత్ర అభిప్రాయమును తెలియజేశారు. ఈ రాత్రి కలలో పాము పడగ సైడ్ వ్యూ కనబడిందట. అంటే ఈమె ఆ పడగకు రెండు వైపుల చూడగలుగుచున్నది. మరియు ఆ పడగ ఒకసారి ఒకప్రక్క మరియొకసారి రెండవప్రక్క స్పష్టంగా కనబడుచున్నదట. ఇంతలో ఆ పాము పడగ ప్రక్కన శ్రీవేంకటేశ్వరుడు, (తల వరకు మాత్రమే) అభిషేకం తరువాత ఉండే రూపంగా కనబడ్డాడట. ఈమెకు ఒకసారి పాము పడగ మరొకసారి స్వామి ముఖము కనబడుచున్నదట. ఇలా కొన్నిసార్లు దర్శనమిచ్చిన తరువాత ఈ పాము పడగపై స్వామి ముఖము ఓవర్ ఇంఫోజ్ అగుచున్నదట. అప్పుడు పడగ పైనున్న "U" ఆకారపు మచ్చ స్వామి గడ్డముపై మచ్చతో ఏకీభవిస్తున్నదట. ఈవిధంగా దాదాపు 3-4 సార్లు స్పష్టంగా 'చూడు' అన్నట్లు ఓవర్ ఇంఫోజ్ అయిందట. ఇంతే కల. దీని అర్థం ఏమిటంటే ఆమెకు స్వామివారు పాము రూపంలో కనబడుచున్నారని అర్థం. పాము ఆదిశేషుడు కాదు, సాక్షాత్ స్వామి వారేనని అర్థం. ఇది చూచి సురేఖ చాలా సంతోషించింది.

## దొంగ అని గగ్గోలు పెట్టిన స్వామివారు

తేది 05-08-2007 నుండి నమో వేంకటేశాయ రథయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో స్వామివారు ఒక అద్భుతమైన లీలను, మార్గదర్శనం చేసే విధంగా చూపారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

మేము రథయాత్రకు కొన్ని నియమాలను ఏర్పరచుకున్నాము. వాటికి ఎప్పుడైనా విరుద్ధంగా వెళితే స్వామివారు ఒప్పుకునేవారు కాదు. వెంటనే తన వ్యతిరేకతను తెలిపేవారు. అలాంటి సందర్భం ఒకటి ఇప్పుడు జరిగింది.

రథయాత్ర సందర్భంగా మేము డబ్బులను ఆశించేవాళ్ళం కాదు. పత్రం పుష్పం ఫలం తోయం అర్పించి స్వామివారిని సేవించుకొమ్మని చెప్పేవాళ్ళం. హుండీ పెట్టేవాళ్ళం కాదు. కాని కొందరు భక్తులు క్రతువుతో పాటు డబ్బులను కూడా శంఖులలో సమర్పించేవారు. ఈవిధంగా సమర్పించిన డబ్బులను మాత్రం ఖర్చులకు ఉపయోగించేవారిమి. కాని ఎవరైనా భక్తులు ముడుపులు సమర్పిస్తే మాత్రం వాటిని తిరుపతి స్వామివారి హుండీలో సమర్పించేవాళ్ళం. ఈ విధంగా నిబంధనను విధించుకుని రథయాత్ర చేసేవారిమి. ఈసారి కూడా ఇదేవిధంగా చేస్తున్నాము. కాని ఈసారి మా ఆర్థిక పరిస్థితి చాలా నీచస్థితికి దిగజారింది. బంగారం కుదువపెట్టి ఆ డబ్బుతో స్వామిసేవ చేస్తున్నాము. ఈ విషయం మా డ్రైవర్ కలీంకు బాగా తెలుసు. ఒకరోజు ఈ రథం నాచారం, మల్లాపూర్ ప్రాంతాలలో తిరిగింది. ఈ సందర్భంగా ఒక భక్తుడు రూ.1,100లను ఒక పసుపుబట్టలో ఎప్పుడో కట్టిన ముడుపును సమర్పించాడు. మా ఇంట్లో క్రతువులు, డబ్బులు, ముడుపులు వేరుచేయు సమయాన ఈ ముడుపు విచ్చుకుపోయి డబ్బులు బయటకు వచ్చాయి. దీనిని చూచిన మా




**నన్ను దొంగగ చూపుచు పూజారి అరచుట**

కలీం ఈ డబ్బులను మా ఖర్చులకు ఉపయోగించుకుందాము, ఇది కూడా స్వామి ఖర్చే కదా అన్నాడు. కష్టాల్లో ఉన్నాను కాబట్టి దీనివైపు మొగ్గు చూపాను. కాని స్వామివారు ఈ రాత్రి ఒక కల ద్వారా జ్ఞానోదయం చేశారు.

**తేది 20-08-2007 కల :** ఈ కల నానిపోయింది. అర్థం చేసుకున్నంతలో వివరిస్తున్నాను. నేను స్వామి దర్శనార్థం ఒక శ్రీవేంకటేశ్వర ఆలయానికి పోయాను. ఆ ఆలయంలో ఒక్క భ క్తుడు కూడా లేదు. కేవలం నేను మరియు పంతులుగారే ఉన్నాము. నేను లోనికి వెళ్ళి దర్శనము కంటే ముందు ఈ పూజారితో ఏదో విషయమై మాట్లాడాను. ఇంతలో ఈ పూజారి అత్యంత కోపముతో గుడి బయటకు వెళ్ళి తన డబ్బులు లాక్కుంటున్నాడని లబోదిబో మొత్తుకున్నాడు. దీనితో పదిమంది జమ అయ్యారు. నన్ను దొంగగా చూపాడు. నేను భయపడిపోయాను. కల చెదిరింది. ఈ డబ్బులు వాడుకుంటే మరింత నష్టపోదుననే భావం కూడా వెనువెంటనే ఏర్పడ్డది. దీనితో జ్ఞానోదయము చెంది ఆ ముడుపుకు మరికొన్ని పైసలను కలిపి స్వామివారికి సమర్పించాము. క్షమించమని వేడుకున్నాము.

ఈ యాత్రలో మేము తేది 25-08-2007 నుండి తేది 02-09-2007 వరకు బయటి ప్రాంతాలు తిరుగుటకు హైదరాబాద్ నుండి బయలుదేరాము. ఈ 7 రోజులు సురేఖ ఆ పామును విపరీతమైన కాంతితో, తేజముతో ప్రాకుట చూచింది. ఈ సంవత్సరము తాను తన బంగారాన్ని వాడి రథాన్ని తేజోవంతము చేసింది కాబట్టి అత్యంత తేజోవంతంగా ఈ పాము కాదు, శ్రీవేంకటేశ్వరుడు తిరుగుచు కనబడ్డాడు. సురేఖ ఎంతో ఆనందించింది.

## పంచమ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

తేది 03-09-2007 నాడు సాయంత్రం మేము వ్రాయించిన పంచమ పర్యాయంగా 7 కోట్ల జపమును అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. స్వామివారి పాదాలకు అభిషేకించి ప్రత్యేక పూజలు చేయునప్పుడు సాక్షాత్ మూలమూర్తే నా ముందు నిలిచినట్లు, ఆయన పాదాలనే కడిగిన అనుభూతి పొందాను. జపం వ్రాసినవారి కోరికలను తీర్చమని ప్రార్థించాను. ఆ తరువాత తేది 04-09-2007 గోకులాష్టమి రోజు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము ముందు జప హోమాదులు మరియు స్వామివారి మహామంత్రాన్ని అనుసంధానిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేశాము. ఇప్పుడు కూడా శ్రీవేంకటేశ్వరుడు జప కుప్పపైన నిలబడి ఉండగా ఆయన పాదాలను చూస్తూ పూజ చేశాను. నాకు మాత్రమే కనబడే ఈ లీల ప్రతి జప సమర్పణ సందర్భంగా తిరుపతిలో కనబడుతుంది. ఈ.ఓ శ్రీమాన్ రమణాచారి గారు యజ్ఞ పూర్ణాహుతి కావించిన తరువాత, ఈ జపం వ్రాసినవారి కోర్కెలను స్వామివారు పూరించాలని ప్రార్థించి, జపమును స్వామివారికి సమర్పించారు. మరియు 6వ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించారు. ఆ తరువాత అక్కడున్న ప్రతి భక్తుడు తలా కొంత జపమును స్వామివారికి స్థూపంలో సమర్పించారు. ఆ తరువాత కొండకు పోయాము. తెల్లవారి స్వామిని దర్శించుకుని తిరిగి హైదరాబాద్ రావడంతో జప సమర్పణ కార్యక్రమము పూర్తైంది. హైదరాబాద్ లో 6వ పర్యాయము 7 కోట్ల జప పుస్తక పంపిణీ ప్రారంభించాము.

## చెప్పినట్లు వింటాననుట

లోకంలో భగవంతునితో పాటు దుష్టశక్తులు కూడా ఉంటాయి. అవి మనలను భగవంతుని వైపు నుండి మరల్చుటకు విశ్వ ప్రయత్నం చేస్తుంటాయి. వాటి ప్రభావానికి తట్టుకొని నిలబడినప్పుడు విజయం సాధించగలం. బహుశా అలాంటి దుష్టశక్తుల ప్రభావంతో నేను స్వామినుండి దూరం పోయి నష్టపోయాను. అలాంటి లీల ఒకటి ఇప్పుడు జరిగింది.

నేను ఈవిధంగా ఆత్మ పరిశీలన చేసుకున్నాను. స్వామివారు కల్పించిన కలలకు అనుగుణంగా నడుచుకోవాలి. కాని అది నచ్చలేదని, దానికి విరుద్ధంగా ప్రయత్నిస్తే భంగపాటు, అవమానముతో పాటు ఆ ప్రయత్నంలో సఫలము కాలేము. కాని ఆ వచ్చిన కలకు అనుగుణంగా నడుచుకున్నచో, అది లాభదాయకమైనా లేదా నష్టపూరితమైనా మనశ్శాంతి లభిస్తుంది. దీనిని నేను గత ఐదారు సంవత్సరముల నుండి అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

నాకు మాసపత్రిక టైటిల్ 'నమో వేంకటేశాయ'కు బదులు 'శ్రీవేంకటేశం' వచ్చింది. కాని నాకు శ్రీవేంకటేశం వద్దని, నమో వేంకటేశాయ మాత్రమే కావాలని, దాని కోసం డబ్బు, సమయం చాలా వృధా చేశాను. చివరికి ఏమీ చేయలేక పోయాను. ఒక ఐదు నెలలు రాత్రింబవళ్ళు స్వామివారిని ఇదే విషయమై తీవ్రంగా ప్రార్థించాను. నాకు తెలిసిన అన్ని రకాలుగా ప్రార్థించినప్పటికీ లాభం లేకపోయింది. ఎలాగైనా స్వామివారి మాసపత్రిక నడపాలనే పట్టుదల నాలో పరాకాష్ఠకు చేరింది. చివరికి ఇప్పుడు ఈ శ్రీవేంకటేశం టైటిల్ తో తీద్దామన్నా తీయలేని పరిస్థితి కలిగింది. చివరికి నా తప్పులను ఒప్పుకుని, క్షమాపణలను వేడుకున్నాను. నా సొంత భావాలతో సంబంధము లేకుండా మీరు చెప్పినట్లు చేస్తానని ప్రార్థించాను. అనుగ్రహించమన్నాను.

**తేది 10-10-2007 కల :** ఈ రాత్రి కలలో నేను ఒక పశువుల మందలో ఉన్నాను. ఆ పశువులు పారిపోకుండా చుట్టూ తడకల ఫెన్సింగ్ తో పాటు దానికి ఒక పణగడి అమర్చబడింది. అందులో చాలా పశువులు ముఖ్యంగా వందల కొద్దీ ఆవులు ఉన్నవి. ఇంతలో ఒక మంత్రగత్తె బయటినుండి నడుచుకుంటూ వచ్చి పణగడి గుండా లోనికి రావటానికి ప్రయత్నించింది. ఆ మంత్రగత్తెను లోనికి రానివ్వకుండుటకై పశువులను

కట్టి వేయుటకు వాడే తలుగు తీసుకుని మంత్రించి కొట్టినట్లు 'ఓం నమో వేంకటేశాయ' అని గట్టిగా పలుకుచు ఈ తలుగును ప్రక్కనున్న రాయిపై పలుమార్లు కొట్టాను. ఉద్దేశ్యం ఏమిటంటే.. స్వామి మంత్ర ప్రభావముచే ఆ మంత్రగత్తె లోనికి రాకూడదని, మమ్ములను పాడు చేయకూడదని, స్వామి సేవ నుండి, స్వామి నుండి దూరం చేయకూడదని, ఇలా స్వామిని స్మరించాను.

## నెత్తికి బురద అంటునని చెప్పట

గతంలో ఇష్టానుసారంగా నడుచుకొనుట వలన చాలా వ్యవహారాలలో దెబ్బ తిన్నాను. ఆర్థికంగా చాలా నష్టపోయాను. ఇప్పటినుండి ప్రతి వ్యవహారాన్ని స్వామి వారికి చెప్పి చేయాలనుకున్నాను. కొన్ని వద్దన్నారు. ప్రత్యేకంగా అప్పటికే కొన్ని డబ్బులు వెచ్చించిన ఒక వ్యవహారం గురించి అడిగాను. అప్పుడు స్వామి వారు ఈ విధంగా చెప్పారు.

**తేది 12-10-2007 కల :** అది ఒక పెద్ద కుటుంబం. వారు మా రథమును వారింటికి ఆహ్వానించారు. రథం వారి ఇంటి వద్ద ఉన్నప్పుడు ఎంతోమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడ కొందరు నన్ను గుర్తుపట్టారు. చివరికి రథం రోడ్డుపై ఉండగా నేను వారి మొదటి అంతస్తుకు పోయి వారితో మాట్లాడాను. వారు చాలామంది ఏదో చర్చించుకుంటున్నారు. బహుశా నేను తిరుపతికి వెళ్ళు దారిలో తిరిగి తిరిగి వీరింటికి పోయాను. దుమ్ముతో నిండిన చింపిరి తలతో ఉన్నాను. పిదప నేను వారి ఇంట్లో స్నానమునకు వెళ్ళి తలకు షాంపు పెట్టుకున్నాను. ఈ షాంపూ నురుగు నాకు స్పష్టంగా కనబడింది. ఇంతలో వారింట్లో ఏదో గొడవైంది. ఫలితంగా వారు ఈ యాత్రను విరమించుకున్నారు. చివరికి నాకు స్నానం చేయుటకు నీరు ఇవ్వలేదు, నీటిని కట్టేశారు. అదే స్థితిలో అంటే షాంపూ పెట్టుకుని నేను మా ఇంటికి రావలసి వచ్చింది. ఇంతే కల. దీనర్థం ఈ వ్యవహారం లోనికి వెళ్ళకుమని, వెళ్ళినచో నెత్తికి బురద అంటునని చెప్పారు.

ఈ వ్యవహారంలో అప్పటికే నేను కొంత మొత్తం పెట్టాను. కాని వారి తీయటి మాటలు చూచి, డబ్బు ఆశతో మరికొంత పెట్టాను. చివరికి మొత్తం మునిగాను.

## స్వామి ఆలయం ప్రక్కన ఇల్లు కట్టుకోవచ్చని చెప్పట

సాధారణంగా శ్రీవేంకటేశ్వరుని ఆలయం ప్రక్కన ఇల్లు ఉండకూడదంటారు. కాని మాకు మాత్రం తప్పులేదని, మేము వేరు, ఇతరులు వేరని ఈ కలలో సూచించారు. ఇది మా సురేఖకు వచ్చిన కల.

**తేది 19-10-2007 కల:** ఇది నా భార్య సురేఖకు వచ్చింది. అది మా ఇల్లట. ప్రస్తుతపు హైదరాబాద్ లోనిది లేదా ఊరిలోనికి కాకుండా ఒక క్రొత్త స్థలములో ఉన్నది. మా ఇంటి ప్రక్కనే శ్రీవేంకటేశ్వరుని ఆలయం కట్టబడి ఉన్నదట. ఇంతలో ఎవ్వరో కొందరు, ఏమి? ఇలా ఇంటి ప్రక్కన గుడి ఉన్నది? ఇలా ఉండరాదని అన్నారట. ఇంతలో ఎవరో ఒకరు, అశరీరవాణి, ఆ... వీరికి ఏమీ కాదు, వీరి ఇంటికి ఈవిధంగా ఉండవచ్చు, తప్పులేదు, వీరు వేరు మనము వేరు అన్నటుల అన్నారట. సురేఖకు మా ఇంటి ప్రక్కన ఆ దేవదేవుని ఆలయము స్పష్టంగా కనబడ్డదట. ఇంతే కల.

ఆ రోజు దీని అర్థమును గ్రహించలేదు. కాని దీని నిజమైన అర్థం ఇలా ఉంది : నన్ను స్వామివారు హరినామ క్షేత్రములో ఇల్లు కట్టుకుని ఉండుమని చెప్పారు. అప్పుడు మా ఇల్లు మరియు స్వామి ఆలయం ప్రక్క ప్రక్కనే ఉండును కాబట్టి ఈ విషయం చెప్పారని భావించాను. మరియు సురేఖకు పట్టింపులు, అనుమానాలు ఎక్కువ కాబట్టి ఈ విషయం ఆమెతో చెప్పారని అనుకున్నాను.

## మా పుత్రులను స్వామి సేవలో వినియోగించుకొనుట

స్వామివారు నన్ను, నా భార్యనే కాకుండా మా కుటుంబంలోని అందరినీ వారి సేవకై, లేదా యోగ్యత సాధించుటకు ఏదో రకంగా వినియోగించుకుంటారు. స్వామివారి గురించి మాతోపాటు మా కుమారుడు కూడా తపించిపోవు ఒక సన్నివేశాన్ని స్వామివారు ఇలా చూపారు.

**తేది 23-10-2007 కల :** ఈ కలలో నేను, నా భార్య సురేఖతో పాటు మా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్ కలిసి స్వామి దర్శనార్థం కొండపైకి పోయాము. అప్పుడు అక్కడ స్వామివారి ఊరేగింపు జరుగుచున్నది. మేము ముగ్గురము స్వామివారి దర్శనార్థం స్వామి పుష్కరిణి ముందు నుంచి శ్రీ వరాహస్వామి గెస్ట్ హౌస్ వైపుకు వెళ్ళాము. ఆ మాడవీధి ముగిసిన పిదప రాళ్ళతో కూడిన మట్టిబాట ఉన్నది. దాని ప్రక్కన మల్లెపూలు అమ్ముకునే వారి దుకాణం ఉన్నది. ఆ దుకాణంలో చాలా మల్లెదండలు కట్టి వ్రేలాడదీయబడి ఉన్నవి. దాని ప్రక్కన ఒక రాయి కూర్చుండుటకు అనుకూలంగా ఉంది. ఇంతలో మనము ఈ రాయిపైన కూర్చుందాము డాడీ, మనకు దేవుడు కనబడగలడని మా వేదాంత్ అన్నాడు. దాని ప్రకారం మేము అక్కడ కూర్చున్నాము, మరియు స్వామి రాకకోసం వేచి చూస్తున్నాము. ఇంతే కల.

దీని ప్రకారం స్వామివారు మా పుత్రులను కూడా ఏదోరకంగా తన సేవలో వినియోగించుకుంటారని అర్థం.

## హరినామ క్షేత్ర బీజం పడుట

ఇంతవరకు స్వామివారు నాలో చాలా మార్పు కలిగించారు.

నేను స్వామికోసం , ఆయన కృపా కటాక్షాలు సర్వులకు అందించే విధంగా జీవించుటే నా పరమ ధర్మం అనేవిధంగా మారిపోయాను. బహుశా ఈ నా మానసిక స్థితిని గ్రహించిన తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఆయన యొక్క అసలైన లక్ష్యమును అంటే హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుట అనే బీజమును నా హృదయంలో మొదటిసారి నాటారు. స్వామివారు సాధించాలనుకున్న దానిని ముందు చిన్నగా నా హృదయంలో నాటుతారు. తరువాత కొంతకాలానికి ఆ దిశగా మరిన్ని లీలలను కల్పించి, దానిని సాధించి తీరాలనే పట్టుదలను నాలో కలిగిస్తారు. మొత్తం మీద హరినామ క్షేత్రం కోసం నా హృదయంలో నేడు మొదటి బీజం పడ్డది. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 27-10-2007 కల :** ఇది ఒక హృదయాంతరంగ భావం. మొట్టమొదటి సారి నా హృదయంలో నా స్వామి గురించి వచ్చిన కోరిక "తిరుమల ఆలయ ప్రతిబింబమును హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నిర్మించాలనిపించింది. దీనికి స్వామివారి నుండి అనుమతి మరియు నిర్మించుటకు శక్తిని పొందాలనే బలమైన కోరిక కలిగింది". ఇది నా జీవితం తరువాత కూడా నా కారణంగా నా స్వామివారిని ప్రజలు స్మరించుటకు ఉపయోగపడునని భావించాను. ఈ కోరికను తీర్చుమని వేడుకున్నాను. కాని కొద్ది రోజులలోనే అన్నింటిలాగా దీనిని కూడా మరచిపోయాను.

## 'శ్రీవేంకటేశం' గురించి స్వామివారి మరియు అమ్మవారి లీలలు

గతంలో నేను 'నమోవేంకటేశాయ' పత్రిక టైటిల్ ను తిరిగి పొందుటకు ఆర్.ఎన్.ఐ వారికి అప్లై చేశాను. కాని నాకు నమో వేంకటేశాయ కాకుండా శ్రీవేంకటేశం లభించింది. కాని శ్రీవేంకటేశం వద్దని, నమో వేంకటేశాయనే కావాలని పట్టు పట్టి మళ్ళీ అడిగాను, కానీ లభించలేదు. చివరికి స్వామి ఆజ్ఞగా శ్రీవేంకటేశమును ఒప్పుకున్నాను. ఇప్పుడు పోలీసు వారు నా ప్రవర్తనకు విరక్తి చెంది ఆర్.ఎన్.ఐ వారికి ఉత్తరము వ్రాశారు. దీనిని శ్రీవేంకటేశ్వరుడు ఈవిధంగా చూపాడు.

**తేది 29-10-2007 కల :** ఈ కలలో ఒక హృదయాంతర భావం కలిగింది. శ్రీవేంకటేశ్వర స్వామివారు నాకు ఒక ఉత్తరమును పంపుచున్నారట. ఇందులో ఆయన గురించిన కొన్ని విషయాలు ఉన్నాయట. వారు ఆ ఉత్తరమును జారవిడువగా... అది ఇప్పుడు మధ్యలో ఉన్నది, రేపో ఎల్లుండో నాకు చేరగలదు. ఇదీ విషయం. అనుకున్నట్లే తేది 29-10-2007 సోమవారం నాడు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డిపార్టుమెంట్ నుండి ఒక ఉత్తరం వచ్చింది. వీరు ఆర్.ఎన్.ఐ వారికి ఈ ఉత్తరాన్ని పంపి నాకు ఒక కాపీని పంపారు. అందులో ఏమున్నదంటే... "మీరు శ్రీ పి.సాయిరెడ్డికి 'నమో వేంకటేశాయ' కాకుండా 'శ్రీవేంకటేశం' టైటిల్ ను ఇచ్చారు. ఆయన తనకు నమో వేంకటేశాయనే కావాలని మళ్ళీ కోరాడు. కాని ఇప్పుడు ఈయన 'శ్రీవేంకటేశం'ను ఒప్పుకుంటున్నారు. మమ్మల్ని ఇప్పుడు ఏమి చేయమంటారు? ఇంతవరకు మీనుండి ఎలాంటి జవాబు రాలేదు. కావున మేము ఏమి చేయాలో ఒక ఉత్తరం వ్రాయండి" అని ఉంది.

ఈవిధంగా నా తప్పు తెలుసుకుని స్వామి ప్రసాదించిన శ్రీవేంకటేశం పేరుతోనే పత్రికను నడపదలుచుకున్నప్పటికీ ముందు తిరస్కరించిన కారణంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాను. ప్రతిక సేవను ప్రసాదించుమని మీరు చెప్పినట్లు వింటానని పదే పదే విన్నవించాను. ఒక దశలో "మీరు నేను తృప్తి చెందేవరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు. ఇంతవరకు నేను తృప్తి చెందలేదు" కాబట్టి ఈ సేవను ప్రసాదించమన్నాను. ఈ సేవను తిరిగి పొందుటకు తపించిపోయాను. ఇలా నా మానసిక స్థితికి సంభవించిన ప్రతి ఘటనను కల రూపంలో స్వామివారు చూపెట్టారు.

నాకు చాలా తక్కువ సందర్భాలలో అమ్మవారి అనుగ్రహము లభించింది. ఆమె అనుగ్రహము ఒక ప్రత్యేకమైన పద్ధతిలో నేడు ఈ క్రిందివిధంగా లభించింది.

**తేది 02-11-2007 కల :** ఈ కలలో ఒక కోనేటి ప్రక్కన ఒక చిన్నదైన అమ్మవారి గుడి ఉన్నది. అందులో అమ్మవారు నల్లని ముఖ చ్ఛాయతో అత్యంత ఆకర్షణీయంగా ఉన్నారు. చక్కని వస్త్రాలంకరణ కలిగి పూలచే అలంకరింపబడి ఉంది. నాకు ఆ గుడిలోని అమ్మవారు కనబడ్డారు. పిదప నేను స్నానానికని మెట్లు దిగాను. ఇంతలో ఆ ప్రాంతపు పొలిటికల్ లీడర్ తన సహచరులతో అక్కడికి వచ్చాడు. వారికి నేను తెలుసు, ఏదో విషయమై అందులో ఒకడు "సాయిరెడ్డి పూజ కావించారు" అని వారితో అన్నాడు. ఇంతే కల. బహుశా నేను మాసపత్రికను తిరిగి ప్రసాదించుమని అయ్యవారితో పాటు అమ్మవారిని ప్రార్థించాను. అందుకు అమ్మవారు కరుణించినట్లు నాకు ఈ లీలను చూపారని భావించాను.

## అయ్యవారు కూడా ఈ క్రింది విధంగా కరుణించారు

**తేది 18-12-2007 కల :** ఈనాటి కలలో నాకు చాలా పరిచయమున్నటువంటి కాలనీ ఒకటి కనబడింది. అందులో కొన్ని శ్రీవైష్ణవుల ఇళ్ళు కనబడ్డాయి. ఒక ఇల్లు మరీ ఎక్కువగా 'తిరునిలయం' అని వ్రాసినటువంటిది కనబడ్డది. అందులో శ్రీవైష్ణవులు నివాసం ఉన్నారట, మరియు వారితో పాటు ఆ వైష్ణవస్వామి కూడా ఉన్నారట.

దీని అర్థం ఏమిటో తెలియదు. బహుశా స్వామివారు నా

శ్రీవేంకటేశం మాసపత్రిక సేవ లభించాలనే నా తాపత్రయానికి అనుగ్రహిస్తున్నట్లు కావచ్చును.

ఆర్.ఎన్.ఐ నెంబర్ లేకనే మేము గత 9 నెలల నుండి 'నమో వేంకటేశాయ' మాస పత్రికను ప్రచురిస్తున్నాము. ఫలితంగా పోస్టు చేయుటకు ఎక్కువ (పుస్తకానికి రు.9) ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక దశలో చాలా నీరసించిపోయాను. స్వామివారు కలలో చెప్పితే తప్ప వచ్చే నెల నుండి పత్రికను ఆర్.ఎన్.ఐ నెంబర్ వచ్చేవరకు కొనసాగించ వద్దనుకున్నాను. స్వామివారితో ఈ విషయం చెప్పి ప్రార్థించాను. చివరికి ఢిల్లీ వారు ఒప్పుకున్నట్లు లెటర్ వచ్చింది మరియు తేది 20-12-2007 నాడు పోలీస్ డిపార్టుమెంటులో శ్రీవేంకటేశం కోసం క్రొత్తగా డిక్లరేషన్ ఇచ్చాను. ఇప్పుడు జనవరి-2008 నుండి శ్రీవేంకటేశం అనే పేరుతో పత్రిక ప్రచురించవచ్చును. ఈ సందర్భంగా రెండు కలలు వచ్చాయి. ఒకటి నా భార్యకు మరోటి నాకు. అవి ఇలాగ ఉన్నవి.

**తేది 27-12-2007 కల : సురేఖ కల :** గత కొన్ని రోజుల నుండి సురేఖ ఉదయం 5 గంటలకే నిద్రలేచి స్వామివారికి ఒక పదకొండు రోజుల కొరకు మా కష్టాలు తీరాలని ప్రత్యేక పూజలు చేస్తోంది. ఈరోజు కూడా ఉదయమే లేచి స్నానము ముగించుకుని పూజ నిర్వహించి పూజ గది బయటకు వచ్చి కుడిప్రక్కకు అనుకోకుండా చూచెనట. అక్కడ మా ఇంట్లో ఉన్న మెట్లపైన తిరుపతిలో అభిషేకము తరువాత స్వామివారు ఏవిధంగా ఉందురో అదే ప్రకారం శ్రీవేంకటేశ్వరుడు నిలబడి ఉన్నారట. ఒక్కక్షణం సురేఖ ఆయనను చూడగానే ఆయన మాయమైపోయారట. అప్పుడు ఆమె ఆనందానికి హద్దు లేదు.

ఈవిధంగా స్వామివారి అనుగ్రహం సురేఖకు లభించింది. ఇక నేను కన్న కల ఈవిధంగా ఉంది.

**తేది 25-12-2007 కల :** ఏదో ఒక బజారులో శివభక్తుడు లేదా శివునికి సంబంధించిన వ్యక్తి భీష్ముని లాగా మరణస్థితిలో ఉన్నాడట. అక్కడికి ఎవరూ వెళ్ళకూడదని ఎవరో ఆజ్ఞ వేశారట. కావున ఎవరూ వెళ్ళుట లేదు. నాకు దీనిని చూచి కొంచెం బాధ కలిగింది. నేను వెళ్ళి ఆయనకు ఆహారం అందివ్వాలనుకున్నాను. ఇంతలో సినీయాక్టర్ శారద లాంటి ఒకరు వచ్చి శివోహం, శివోహం అని అన్నది. ఆమె పలుకులు నేను ప్రచురిస్తున్న పత్రికపై పడుచున్నవి. మరియు జనవరి 2008 సంచిక మొదటి పేజీ కోసమై నేను సేకరించిన స్వామివారి ఫోటో నాకు ఈ కలలో మెరిసినట్లు కనబడ్డది.

బహుశా పత్రిక కోసం నీ తపన ఫలించింది. భగవంతుని కృపతో ఇప్పటి నుండి శ్రీవేంకటేశం ప్రతిక చక్కగా జరుగునని సూచించాడు. మరియు ఈ పత్రికలో ప్రచురించు ప్రతి వ్యాసము సాక్షాత్ భగవంతుని నుండి వచ్చిందన్నట్లు భావించి ప్రచురించమని చెప్పాడని భావించాను.

## సాధువుగా మారి భాగవతుల మధ్య జీవించమనుట

మరో రెండు రోజులకు మరో చిత్రమైన కల కన్నాను. ఇందులో వందల కొలది కొండముచ్చులు నా వద్దకు వచ్చాయి. నన్ను ప్రత్యేకంగా చూచాయి. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 26-12-2007 కల :** ఈ కలలో ఒక మంచి ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన, చెట్లతో చల్లని గాలులతో నిండియున్న ప్రదేశము కనబడ్డది. అందులో ఒక ప్రక్క ఒక పవిత్రమైన కొలను, దాని ప్రక్కన రెండు చిన్న ఇళ్ళు ఉన్నవి. రెండు రూములే ఉన్న ఈ ఇంటిలోనికి నేను వెళ్ళాను. మొదటి రూం దాటి రెండవ రూం లోనికి వెళ్ళాను. అక్కడ ఎవ్వరూ లేరు. ఆ రూం కొంచెం గుండ్రంగా ఉంది. ఈ ఇంటాయన రామేశ్వరం వెళ్ళాడని కళ్ళాపి చల్లుచున్న ప్రక్కావిడ చెప్పింది. ఈ రూం నుండి ఆ కోనేటి నీరు స్పష్టంగా కనబడుచున్నవి. నేను వెళ్ళి ఆ కోనేరు లోని నీటిని తాకాను. ఇప్పుడు ఈ రూం ఒక గుడిసెలాగ మారిపోయింది. ఇంతలో నేను బయటికి వచ్చి, తిరిగి పోవుటకు నిర్ణయించుకున్నాను. అప్పుడు ఆ బయట చాలా కొండముచ్చులు ప్రతి మూడు నాలుగు అడుగులకు ఒకటి చొప్పున కూర్చున్నవి. వందల సంఖ్యలో ఉన్నవి. వాటి ముఖాలు మహా నల్లగా కనబడ్డవి. నేను పోవుదారి పొడవునా దాదాపు 150 గజముల వరకు అవి కూర్చున్నవి. నేను వాటి మధ్యనుండి భయముతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వెళ్ళాను. అవి నన్ను చూచినవి కాని ఏమనలేదు. ఇంతే కల. ఈ కల అర్థము ఇలా ఉంది.


ఇప్పటినుండి అంటే మాసపత్రిక ప్రారంభించిన తరువాత నేను ఒక సాధువుగా మారిపోయి, భాగవతుల మధ్యలో నివసించాలనే అర్థంగా భావించాను.

## శ్రీవేంకటేశం మాసపత్రిక ప్రారంభం

'నమో వేంకటేశాయ' పేరుతో మాస పత్రికను 9 నెలలు ప్రచురించిన తరువాత తేది 01-01-2008 నాడు శ్రీవేంకటేశం మాసపత్రిక మొదటి సంచిక విడుదల చేశాము. ఇప్పటి నుండి ప్రతి మాసము ఇదే పేరుతో పత్రిక విడుదల కాగలదు. స్వామివారికి, అమ్మవారికి మ్రొక్కి వారి ఆశీర్వాదములు తీసుకొని ఈ సంచికను నిరాడంబరముగా విడుదల చేశాము.

ఇంతవరకు స్వామివారు నాకు ఈ క్రింది సేవలను ప్రసాదించారు.

(1) 2002 సంవత్సరములో తిరుపతిలో తన మహామంత్ర స్థూపమును నిర్మింపచేశారు. (2) 2002 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠను స్థాపింపచేసి ప్రతి




**నన్ను భాగవతుల మధ్యన నివసించుమనుట**

సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ సేవను ప్రసాదించారు. (3) 2004 సంవత్సరంలో నమో వేంకటేశాయ రథమును నిర్మింపచేసి ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర నిర్వహించేటట్లు చేశారు. (4) 2007 సంవత్సరంలో శ్రీవేంకటేశం మాసపత్రికను స్థాపింపచేశారు. ప్రతి సేవ అత్యంత సమర్థవంతంగా జరుగుచున్నది. భగవంతునితో పాటు సాధ్యమైనంతవరకు ప్రతి భక్తుణ్ణి సంతృప్తి పరచుటే నా లక్ష్యంగా పని చేస్తున్నాను. ఇప్పుడు సంవత్సరం మొత్తం స్వామిసేవ లభించింది. ఇప్పటినుండి శ్రీవేంకటేశ్వరుడు నా దిశను మార్చే ప్రయత్నం చేశాడు. గతంలో సాధన చేయమన్నాడు. ఇప్పుడు సేవను చేస్తూ యోగ్యత సాధించుకొమ్మనే హృదయాంతర భావం పదే పదే రాసాగింది.

గతంలో శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీలో చేర్పించారు. బహుశా ఇన్ని సంవత్సరాల స్వామివారి శిక్షణలో ఉత్తీర్ణుణ్ణి అయినాను. ఇప్పుడు స్వామివారు నన్ను ఆధ్యాత్మిక మాస్టర్ డిగ్రీలో అదే ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించారు. చక్కగా చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుణ్ణి అగుట నా లక్ష్యంగా దిశా నిర్దేశం చేశారు. ఆ రోజు నేను వ్రాసుకున్న ఆత్మ పరిశీలన ఈ విధంగా ఉంది.

ఈ రోజు భీష్మ ఏకాదశి, స్వామివారు గుర్తుకు వచ్చారు. చాలా రోజుల నుండి ఆయన్ను కాని ఆయన లీలలను కాని చూడని కారణంగా మనస్సు బాధగా ఉంది. స్వామివారితో పోట్లాటకు దిగినచో నాకే ముప్పు. స్వామివారిని కేవలం భక్తి, వినయం, దాస్యంతో మాత్రమే సాధించుకోగలమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఆయనకు పూర్తిగా శరణాగతుణ్ణి కావాలని భావించాను, మనస్సులో అదే ఆలోచన పెట్టుకున్నాను. ఆయన కల్పించిన పరిస్థితులను ప్రసాదంగా స్వీకరిస్తూ ఆయన సేవను చేయాలని తలంచాను. నాకు ఆయన ఏమైనా లీలలు చూపినచో వాటిని కేవలం నా భార్యకు తప్ప ఇతరులెవరికీ చెప్పవద్దని

నిర్ణయించుకున్నాను. మాకు దగ్గరలో ఉన్న నాచారం, హెచ్.ఎం.టి నగర్ లో, స్వామివారి ఆలయానికి వెళ్ళి నా మనస్సులోని పై భావాలను స్వామివారికి విన్నవించాను. నేడు స్వామివారిని కనబడమని, ఈ సేవకునిపై దయ చూపమని వేడుకున్నాను.

స్వామివారు తగిన యోగ్యత సాధించుటే లక్ష్యంగా నన్ను ఎన్నుకుని రకరకాల లీలలను చూపించారు. నిజానికి నేను ఒక అథమ శ్రేణి వ్యక్తిని కావడం వలన స్వామివారి లీలలను అర్థం చేసుకోలేకపోయాను. అందుకని నేను సులభంగా గ్రహించగలిగేటట్లు నా విద్యావస్థనే ఎన్నుకొని, దాని ద్వారా ఎప్పటికప్పుడు నేను ఏ స్థాయిలో ఉన్నానో చూపించేవారు. స్వామివారు మననుండి ఏ విషయాన్ని తీసివేయాలనుకుంటారో దానిపై మరింత వ్యామోహం కలిగే విధంగా చేస్తారు. నా ఇంటర్ తరువాత రెండు సంవత్సరములు ఊరిలో వ్యవసాయము చేయుట వలన మా ఆర్థిక పరిస్థితి చూచి చలించిపోయాను. ఇంజనీరింగ్ చేసినప్పటికీ వ్యాపారము చేయాలనే భావం అప్పుడే ఏర్పడ్డది. చివరికి 1981-85 వరకు ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీని చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడనైనాను. ఆ తరువాత నా జీవనోపాధికి చాలా కష్టపడ్డాను. ప్రొఫెసర్ బద్రుద్దీన్ అని మా ఇంజనీరింగ్ గురువుగారి ప్రోత్సాహంతో ఆయనతో కలిసి బిల్డింగ్ కన్సల్టేషన్ నేర్చుకొనుచు, ఒక రీసెర్చ్ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పని చేశాను. ఆ తరువాత 1987 లో అదే కళాశాలలో పార్ట్ టైములో 3 సంవత్సరాల నిడివి గల స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ లో సీటు లభించింది. ఇందులో మొదటి 3 సెమిస్టర్స్ చక్కగా ఉత్తీర్ణుణ్ణి అయ్యాను. ఈలోగా నేను కన్స్ట్రక్షన్ వ్యాపారములో చేరాను. డబ్బులు వస్తున్నవి కాబట్టి నా మనస్సు వ్యాపారము నందే లీనమై ఉండెడిది. ఈ డిగ్రీ కేవలం నా పేరు ప్రక్కన తగిలించుకొనుటకు తప్ప నాకెందుకనే భావం ఏర్పడ్డది. కాబట్టి కళాశాలకు వెళ్ళేవాణ్ణి కాదు. పరీక్షలు వ్రాసేవాణ్ణి కాదు. రేపు పరీక్ష అనగా గుర్తుకొచ్చేది. ఇలా 1990 ఆగస్టులో పాస్ కావలసిన వాణ్ణి 1992 ఆగస్టులో పాస్ ఐనాను. ఇలా స్వామివారు నేను చదివిన ఇంజనీరింగ్ కళాశాలను, ముఖ్యంగా నా ఇంజనీరింగ్ మాస్టర్ డిగ్రీని ఉపయోగించుకుని నాకు శిక్షణ ఇచ్చుట ప్రారంభించారు. స్వామివారి శిక్షణ ఆధ్యాత్మిక విద్య ఐనప్పటికీ నేను బహు చక్కగా అర్థం చేసుకొనుటకు వీలుగా నా గతంలోని విద్యను మరియు మా ఆర్థిక వ్యవస్థను ఎన్నుకున్నాడని భావించాను. ఆ తరువాత యోగ్యతకు, ఈ మాస్టర్ డిగ్రీకి సంబంధం పెట్టి నేను ఏ స్థాయిలో ఉన్నానో, విద్యాభ్యాసం ఎలా జరుగుచున్నదో చూపించేవారు. ఈరోజు ఒక కల కన్నాను. ఆ కల ఈవిధంగా ఉంది.

**తేది 18-02-2008 కల :** నేను బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణుణ్ణి అయ్యానంట. మాస్టర్ డిగ్రీలో చేరుటకు మా ఇంజనీరింగ్ కళాశాలలో అప్లై చేశానట, కాని నాకు మొదటి లిస్టులో సీట్ లభించలేదు. వెయిటింగ్ లిస్ట్ కోసం వేచి చూస్తున్నాను. అయితే ఈ రోజు ఒక పనిమీద ఈ కళాశాలకు వెళ్ళాను. అక్కడ టీవీ లాగా ఒక తెల్లని స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆ కళాశాల అడ్మిషన్ విషయమై సీటు లభించిన విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్స్ ఈ స్క్రీన్ పై ప్రకటిస్తారు. నేను ఈ స్క్రీన్ చూసే సమయాన ఎం.టెక్ కోర్సు యొక్క వెయిటింగ్ లిస్ట్ ప్రకటించారు. అది ఎలా అంటే ఈ హాల్ టికెట్ నెంబర్ నుండి ఈ నెంబర్ వరకు ఉన్నవారికి సీటు లభించునని ఉంది. నా నెంబర్ 56967, నిజానికి నా తరువాత మరో ఇద్దరి వరకు సీటు దొరికింది. నా నెంబర్ 56967 అని తెలుసుకొని అది నిజమేనా అనే అనుమానముతో ఇంటికి ఫోన్ చేసి ఇదే నెంబరని తెలుసుకుని మురిసిపోయాను. కల చెదిరింది.

దీనర్థం స్వామివారి కృపతో వారి శిక్షణలో ఇంతవరకు ఆధ్యాత్మిక బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశాను. ఇక మాస్టర్ డిగ్రీ చేయాలి. నాకు వెయిటింగ్ లిస్టులో సీట్ లభించింది. ఈ మాస్టర్ డిగ్రీని బాగుగా చదివి, స్వామి ఆశీర్వాదముచే ఉత్తీర్ణుణ్ణి కావలసిందని దిశా నిర్దేశం చేశారు. ఒకవేళ బాగా చదవకపోతే తప్పిపోయే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు.

## చెడును వదిలి మంచిని మాత్రమే పట్టుకొనుమనుట

ఇప్పుడు స్వామివారు మరో దిశా నిర్దేశం చేశారు. లోకంలో మంచి చెడ్డలు కలిసి ఉంటాయి, నీవు చెడును వదిలి మంచిని మాత్రమే పట్టుకొమ్మని ఈ క్రింద తెలిపిన లీల ద్వారా చూపెట్టారు.

తేది 22-02-2008 కల : నేను ఒక పవిత్ర క్షేత్రమునకు భార్యా పిల్లలతో వెళ్ళాను. అక్కడ నాకు కొన్ని శిథిలమైన శిల్పాలు, ఏనుగులు, పులుల ప్రతిమలు కనబడ్డాయి. వాటితో పాటు రావి, మర్రిచెట్ల క్రింద ఉండే పుట్టలు, నాగుపాము శిల్పాలు, దేవతా శిల్పాలు కనబడ్డవి. ఆ తరువాత అక్కడి నుండి శ్రీవేంకటేశ్వరుని ఒకానొక క్షేత్రమునకు పోయాను. కాని అక్కడ కొంత అపవిత్రతను చూచాను. ఒక మాంసపు ఎముక కనబడ్డది. దానివద్ద నున్న వ్యక్తి ఒక కత్తి పట్టుకుని దానితో ఆడుచున్నాడు. ఆయన నన్ను చూచి భయముచే ఆ ఆటను ఆపాడు. ఇంతలో నేను ఒక బస్సు ఎక్కుటకు బస్ స్టాండుకు వెళ్ళాను. అందులో చాలామంది ఉన్నారు, అందులోని ఒక ముస్లిం మాట్లాడుచు, మాంసపు ముక్కలను అందరికీ పంచిపెట్టుమని చెప్పాడు. ఇది ఈ కలలోని మొదటి సన్నివేశం.

ఇక రెండవ సన్నివేశంలో నన్ను కొన్ని సంవత్సరాల ముందు చూచిన ఇద్దరు పాత మిత్రులు ఇదే బస్ స్టాండులో కనబడ్డారు. వారు శ్రీవారి పరమ భక్తులు. నన్ను చూచి ఏమి చేస్తున్నావు? స్వామి సేవ ఏమైనా చేస్తున్నావా? అనే భావముతో అడిగారు.

దానికి నేను ప్రతి సంవత్సరము 7 కోట్ల జపమును వ్రాయించి స్వామివారికి సమర్పిస్తున్నానని తెలిపాను. వారు నన్ను ఎంతో ఆప్యాయముతో పలకరించారు. వారు రిటైర్ అయిన వ్యక్తుల లాగా ఉన్నారు. అప్పుడు సురేఖ అక్కడ ఒక హోటల్ లో భోజనం చేస్తోంది. మేము అందరం టిఫిన్ చేశాము. ఆ స్థలం శ్రీవారి క్షేత్రమే. కల చెదిరింది.

దీనర్థం, లోకంలో మంచి చెడ్డలు కలిసి ఉంటాయి. అవి నీ దారిలో, నీతోనే ఉంటాయి జాగ్రత్త అని హెచ్చరిస్తూ మంచిని అనుసరించమని సూచించాడు. ఈ విధమైన దిశా నిర్దేశం చేశాడు.

## స్వామివారి చతురత

స్వామివారు నాకు ఎన్నో సేవలను ప్రసాదించారు. ప్రతి సేవను ఒక మెరుపులాగా మొదట్లో నా మనస్సులో జనింప చేస్తాడు. ఆ తరువాత కొంత కాలానికి ఈ సేవ గురించి మరిన్ని లీలలను కలిగించేవారు. నేను వెనక్కి తగ్గితే స్వామివారు ముందుకు వచ్చేవారు, నేను ముందుకు వస్తే స్వామివారు వెనక్కి తగ్గేవారు. ఈవిధంగా కొన్ని లీలలు జరిగిన పిదప నా చుట్టూ ఉన్న పరిస్థితులు కూడా ఈ సేవను చేసితీరాలనే విధంగా మారుచుండేవి. ఫలితంగా ఈ సేవను ప్రసాదించమని అత్యంత ఆర్తితో ప్రార్థించేవాడిని. మీరు నేను ఈ జీవితంలో తృప్తి చెందేవరకు సేవాభాగ్యాన్ని ప్రసాదిస్తానని మాట ఇచ్చారు, ఇంతవరకు నేను తృప్తి చెందలేదు. ఇప్పుడు ఈ సేవను ప్రసాదించండని అత్యంత ఆర్తితో తపించిపోయే విధంగా ప్రార్థించేవాడిని. అప్పుడు ఈ సేవను ప్రసాదించేవారు. మరియు ఇలా చెప్పేవారు, “చూడు నీవు ప్రసాదించమంటేనే నీకు ఈ సేవను ప్రసాదించాను. దీనిని అత్యంత సమర్థతతో నిర్వహించే బాధ్యత నీదే” అని చెప్పేవారు. నాకు ప్రసాదించిన (1) స్థూప నిర్మాణం (2) జప సమర్పణ సేవ (3) నమో వేంకటేశాయ రథం (4) శ్రీవేంకటేశం మాసపత్రిక. ఈ నాలుగు కూడా ఇదే పద్ధతిలో ప్రసాదించి వీటి నిర్వహణ బాధ్యతను నాపైననే పెట్టాడు. ఇది స్వామివారి చతురతకు నిదర్శనము.

తిరుమల ఆలయ ప్రతిరూపమును హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నిర్మించి, నా కారణంగా స్వామివారిని తరతరాలుగా స్మరింపచేయాలనే భావం కూడా ఇదేవిధంగా మొదటిసారి ఏర్పడ్డది. తరువాతి రోజులలో దీనిగురించి మరిన్ని లీలలను కలిగించి దీనిని సాధించుటే స్వామి లక్ష్యం, ఆ లక్ష్యాన్ని నెరవేర్చుటే నా కర్తవ్యంగా దిశా నిర్దేశం చేశారు. వీటిని తరువాత భాగాలలో తెలుసుకుందాం.

**నా దశ :** స్వామి ఆజ్ఞచే చిన్నగుండవెల్లి ప్రాంతములో నమో వేంకటేశాయ రథం మొదటిసారి తిరిగింది. స్వామివారు శ్రీవేంకటేశం అనే పత్రిక టైటిల్ ను ప్రసాదించారు. సురేఖను ప్రత్యేకంగా అనుగ్రహించారు. హరినామ క్షేత్రం కోసం బీజం వేశారు. సాధువు లాగా మారి భాగవతుల మధ్యన జీవించుమన్నారు. ఆధ్యాత్మిక మాస్టర్ డిగ్రీలో చేర్పించి సాధన చేసి ఉత్తీర్ణుణ్ణి కమ్మన్నారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,

హైదరాబాద్. ఫోన్: 040-27175050



తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

**దిశానిర్దేశము**



స్వామివారి 700 దివ్యలీలలు

మొదటి సంపుటము

తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.

12 భాగాలు కల

పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)

ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.

ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)

website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## జామదగ్న్యుడు

‘‘మునులారా! ఆవిధంగా బ్రహ్మాదేవుడు, ఇంద్రాది సురలు త్రిపుర సంహారి అయిన పరమేశ్వరుని కృపా కటాక్షంతో కష్టాల నుంచి విముక్తులైనారని నిన్న చెప్పాను కదా! మరొక్క ముఖ్య విషయం కూడా చెబుతాను. అది జమదగ్ని మహర్షి పుత్రుడైన పరశురాముడిని పరమశివుడు అనుగ్రహించి పుత్రతుల్యుడిగా అస్త్ర శస్త్రాలను ప్రసాదించిన విషయం శ్రద్ధగా విని శివభక్తిని అలవరచుకొని తపశ్చర్యలో విజయవంతులు కండి’’ అని సూతమహర్షి చెప్పగానే పంచాక్షరీ మంత్రాన్ని జపించసాగారు మునులంతా.

పరశురాముడు శివుడి గురించి అఖండ తపస్సు చేశాడు. ఆ భక్తుని అనిర్వచనీయమైన తపస్సుకు మెచ్చిన శంకరుడు ప్రత్యక్షమై ‘‘ఏం వరం కావాలో కోరుకోమని ప్రసన్నుడైనాడు. ‘పార్వతీ ప్రాణనాథా! నీ దగ్గర ఉన్న దివ్యాస్త్రాలను నాకు ప్రసాదించి, నన్ను మహావీరుని చేయి. ఇదే నా కోరిక. అనుగ్రహించు పశుపతీ!’ అని పరశురాముడు కోరాడు. దానికి శివుడు ‘‘భక్తా! ఆ దివ్యాస్త్రాలు అశుచులైనవారిని దహించి వేస్తాయి. నీవు కనుక పరమశుచివైతే అప్పుడు నీకా మహాస్త్రాలు లభిస్తాయి. నీవు తప్పక మహావీరుడౌతావ’’ని ఆదరంతో పలికాడు. దానికి వినయవంతుడైన జమదగ్నిపుత్రుడు ‘‘స్వామీ! నేనెప్పుడు నీవు చెప్పిన దానికి అర్హుడనౌతానో అప్పుడే నీవనుగ్రహింతువు గాక! నీకు శుశ్రూషలు (సేవలు) చేసే వరాన్ని ప్రసాదించు’’ అని కోరగానే కరుణాళువైన శంకరుడు ఆ వరాన్ని ప్రసాదించాడు. పరశురాముడు నియమ నిష్ఠలతో శివుని అర్చిస్తూ, నైవేద్యాదులను సమర్పిస్తూ అనేకానేక సంవత్సరాలు అత్యంత భక్తితో ఆరాధించాడు. భక్తాగ్రగణ్యుడైన పరశురాముని చూసి ఆనందించిన శంభుడు గౌరీదేవికి ఆతనిని చూపి తన మనోభావాన్ని వ్యక్తం చేశాడు.

“రాముడు విమల వ్రత చ
ర్యా మహితుడు నాకు భక్తు”డని పలుమాఱుం
దా ముద్దు సేసి మృదువచ
నామృత సంసిక్తు జేయు నా సమయమునన్”

**-297 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

‘‘గౌరీ! ఈ రాముడు నాకు పరమభక్తుడు. నిర్మల



బుద్ధితో నా వ్రతాన్ని ఆచరించే ఘనుడు. నా వాత్సల్యాన్ని పొందిన మహితాత్ముడు'' అని ఎన్నోసార్లు పరశురాముని మృదువచనాలతో ఆదరిస్తున్న సమయంలో రాక్షసుల చేత అమితంగా బాధపడ్డ దేవతలు శివుని వద్దకు తమను అసురుల బారినుండి కాపాడమని ప్రార్థించారు. అప్పుడు శివుడు పర శురాముని చూసి ''దానవులను వధించి సురలను రక్షించమని ఆదేశించడంతో పరశురాముడు శివుడికి సాష్టాంగ నమస్కారం చేసి వినమితోత్తమాంగుడై ''దేవా! మహేశా! నేను ఏ అస్త్రాలను నేర్వలేదు. అటువంటప్పుడు మహాబలవంతులు, సకల అస్త్రాలలో పారీణులు అయిన దానవులను సంహరించి దేవతలను ఎప్పుడు రక్షించగలను?'' అని అడగగానే శివుడాతనిని చూసి ''భక్తా! నా తలంపును నీమీదే ప్రసరిస్తాను. అందువలన శత్రువులను నీవు అతి సులభంగా గెలవగలవు. సురలను రక్షించనూ రక్షించగలుగుతావు. తరవాత నీ కోరికా సిద్ధిస్తుంది. వెంటనే వెళ్ళు ఏమాత్రం ఆలస్యం చేయకు'' అని చెప్పాడు.

"అనవుడు నట్లకాక యని యా జమదగ్ని సుతుండు ధీరతం
జని సముదగ్రులైన సురశత్రులఁ దీవ్రత రాయుధోత్కరం
బున వధియించి వారి బలుపోటుల నొచ్చిన మేని తోడ వ
చ్చినఁ బురవైరి నిర్వ్రణుని జేసె కరంబున నంటియాతనిన్"

**-ప 302 – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

శివుడి ఆజ్ఞను శిరసా వహించిన పరశురాముడు ధైర్యం వహించినవాడై, తన తీవ్రాతి తీవ్రమైన ఆయుధ సమూహంతో ఉగ్రులైన రాక్షసులను వధియించి, వారి దెబ్బలకు బాధతో నిండిన శరీరంతో శంకరుని చేరాడు. పురవైరి వెంటనే భక్తుని శిరస్సు పైన తన హస్తాన్ని ఉంచి, శరీరాన్ని స్పృశించి అతనికి గాయాలు లేకుండా చేసి రక్షించాడు. దానితో రాముని శరీరం ప్రకాశించింది. రుద్రుడాతనిని చల్లగా చూస్తూ – ''జమదగ్ని తనయా! వెనుకంజ వేయకుండా నీవు శత్రువులను ఎదుర్కొంటే – నీ శరీరానికి పదునైన ఆయుధాలు తగిలినా నీకు ఏమాత్రం బాధ కలగదు. నిర్మల చరిత్ర గల నీపైన ఎవరైనా తలపడినా, వారిని చితకబాది, వారి గర్వాన్ని హరించు. అంతేకాదు నీవు కోరిన వరాన్ని స్వీకరించటానికి నీకిదే సరైన సమయం'' అని అంటూ –

"కొను"మని దివ్యంబగు న
స్త్ర నికాయము శస్త్ర చయము దద్దయు దయ ని
చ్చిన నవి యాతడు సాష్టాం
గ నమస్కారంబు సేసి కైకొనియె నృపా!"

**-306 ప – ప్రథమాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

దివ్యమైన అస్త్ర సమూహాన్ని (మంత్రపూర్వకంగా ప్రయోగించేవి), శస్త్ర సంపుటిని (బాణ పరంపరను) మిక్కిలి దయతో తీసుకోమని ఇచ్చాడు. వెంటనే పార్వతీపతికి పరశురాముడు సాష్టాంగ నమస్కారం చేసి ఆ దేవదేవుడొసగిన ప్రీతితో నిండిన వరాన్న స్వీకరించాడు. ఆ తరువాత లోకగురువైన హరుని చేత అనుజ్ఞ పొందినవాడై పరశురాముడు – నిజస్థానమైన ఆశ్రమానికి తరలివెళ్ళాడు'' అని సూతమహర్షి పరశురాముడొనర్చిన తపోమహిమను, తత్ఫలితంగా శివుడు చూపిన వాత్సల్యాన్ని కూలంకషంగా తెలియజెప్పాడు.

మునులను చూసి సూతమహర్షి ''తపస్సు యొక్క గొప్పదనాన్ని అర్థం చేసుకొని మీరు కూడా అంతటి తపస్సు చేస్తే, త్రిమూర్తుల సేవలతో వారి అనుగ్రహాన్ని పొందితే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముచ్చురూ ఎప్పుడూ మిమ్మల్ని ఆదరిస్తూనే

"జమదగ్ని తనయా! వెనుకంజ వేయకుండా నీవు శత్రువులను ఎదుర్కొంటే – నీ శరీరానికి పదునైన ఆయుధాలు తగిలినా నీకు ఏమాత్రం బాధ కలగదు. నిర్మల చరిత్ర గల నీపైన ఎవరైనా తలపడినా, వారిని చితకబాది, వారి గర్వాన్ని హరించు. అంతేకాదు నీవు కోరిన వరాన్ని స్వీకరించటానికి నీకిదే సరైన సమయం"

ఉంటారు '' అని వారిని స్తోత్ర పాఠాలతో కరుణామయులను చేశాడు. శౌనకాది మునులందరూ సూతమహర్షి చెప్పిన విధానాన్ని అనుసరిస్తూ ఆయన వెంట ఆశ్రమాలకు బయలుదేరారు.

## హంస కాకీయోపాఖ్యానము

సూతమహర్షి ఈనాడు ఏ విషయాన్ని చెబుతాడో వినాలనే కుతూహలంతో మునులందరూ త్వరత్వరగా ఆ పవిత్ర ప్రాంగణాన్ని చేరుకొన్నారు. అప్పటికే వేదికనలంకరించి ఉన్న సూతుని చూసి అత్యంత భక్తిభావంతో మునులాయనకు సాష్టాంగ ప్రణమిల్లి కూర్చున్నారు. సూతమహర్షి వారినందరినీ వాత్సల్యంతో చూసి ఆశీర్వదించి చెప్పటం ప్రారంభించాడు.

''ఇంతవరకూ దేవతల గురించి, మహర్షి శ్రేష్ఠుల గురించి, రాజుల గురించి, సన్మార్గ గాములైన మానవుల గురించి, ధర్మప్రవక్తల గురించి అనేకానేక విషయాలు చెప్పుకొన్నాము. నీతి వర్తనులైన పశు పక్ష్యాదుల గురించి కూడా తెలుసుకొన్నాము. అవినీతి దూరగులైన వారి సత్ప్రవర్తన విధానాలు కూడా అవగతం చేసుకొన్నాము. దుష్టమార్గానుయాయులైన రాక్షసాదుల దుశ్చర్యలను గమనించి వాటిని హతం చేసి తీరాలన్న విషయాన్ని అర్థం చేసుకొన్నాము. ఈరోజు అహంకార పూరితులు, గర్విష్ఠులై అపమార్గంలో వర్తించి, తమ నాశనాన్ని తామే తెచ్చుకొనే అవివేకుల గురించి వివరంగా తెలుసుకొని మంచి చెడుల తారతమ్యాన్ని గ్రహించి, ఎలా నడుచుకోవాలో చెప్పుకొందాం'' అన్న సూతుని 'అలాగే' అన్నట్లు చూశారు మునులందరూ. మళ్ళీ చెప్సాగాడు సూతమహర్షి.

''సముద్రంలో ఒక గొప్ప ద్వీపముంది. ఆ ద్వీపానికి 'ధర్మవర్తి' అనేవాడు రాజు. ఆ ద్వీపంలోని ఒక నగరంలో యజ్ఞ యాగాదులు చేస్తూ ధర్మమూర్తి అని అనిపించుకొన్న వైశ్యశ్రేష్ఠుడున్నాడు. శాంతి దాంతి గుణాలతో ఒప్పారుతూ దయకు మూర్తీభవించాడా అన్నట్లున్న ఆ వైశ్యుడు దానశీలిగా కూడా పేరుపొందాడు. ధనధాన్యాలతో విరాజిల్లుతూ, పుత్రులతో ఆనందవార్ధిలో సుఖంగా జీవిస్తున్నాడు. అటువంటి ఆ వైశ్యశిఖామణి ఇంటికి ఒక కాకి వచ్చి చేరింది. ఆ వైశ్యుని కొడుకు కాకిని చూసి ముచ్చటపడి రోజూ దానికి ఎంగిలి కూడు పెడుతూ మురిపెంగా పెంచసాగాడు. అలా పెరిగిన ఆ కాకి తానే అన్ని పక్షుల కన్నా మిక్కిలి బలం గల దానినని గర్వించింది. ఆ గర్వంతో ఏ పక్షీ తనను మించలేదని అనుకొంటూ, పక్షులనన్నిటినీ తృణీకరిస్తూ రకరకాల పద్ధతులలో క్రీడిస్తూ సంతోషిస్తుండేది. ఒకనాడు గరుత్మంతునితో సరిసమానమైన రెక్కలబలం గల హంసలు కొన్ని ఆ సముద్రం పక్కగా రాసాగాయి. ఆ హంసలను చూసిన వైశ్యకుమారులకు ఒక ఆలోచన కలిగింది. కాకికి హంసలను చూపించి –

**''పులుగులలో నీవెక్కుడు :**
**విలసద్గతి నంచలిట్లు వినువీథిఁ గరం**
**బెల మింజనియెడు వీనిం**
**గలసి పఱచి గెలువవలదె గతుల బహులతన్?''**

**-ప.56 – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

'ఓ వాయసమా! పక్షులన్నిటిలోనూ నీవు చాలా గొప్ప బలం గల దానివి. ఆకాశంలో ఆ పక్షుల్ని చూడు ఎలా విహరిస్తూ వెలుగులు చిమ్ముతున్నాయో! అవి హంసలే కదూ! వాటి ఆటలు చూడు. ఎంత వేడుక కొల్పుతున్నాయో! వాటితో సమానంగా నీవు రకరకాల గమనాలను చూపిస్తూ, వినువీధి కెగిరి వాటిని కలిసి, వాటితో పాటు పరుగెత్తి వాటిని గెలవవద్దా. నీ గెలుపు చూసి మేము ఆనందింపవద్దా'' అని కాకికి, హంసకు గల తారతమ్యాన్ని అర్థం చేసుకోలేని అల్పబుద్ధులైన వైశ్యకుమారులు కాకిని వెళ్ళమన్నారు. వారి తిండి తిన్న ఆ కాకి మూర్ఖంతో తానంతటి గొప్పదానినే అని భావించి హంసల దగ్గరకు వెళ్ళింది. ఆ హంసలలో గొప్ప శక్తి గల హంస ఏదని విచారించి, తనకు నచ్చిన హంస వద్దకు వెళ్ళి 'ఇద్దరం పరుగెడుదాం రా. మన ఇద్దరిలో ఎవరు గెలుస్తారో చూద్దాం' అని తొందరపెడుతున్న ఆ కాకిని చూసి హంసలన్నీ ఫక్కున నవ్వాయి. 'ఓ వాయసమా! మమ్మల్ని ఎవరనుకొంటున్నావు? ఏమనుకొంటున్నావు?

**''మానస సరసి వసింతు మ**
**హీన బలము జవము పక్షులెల్లను బొగడం**
**గానెందు తిరుగుదుము: ద**
**వ్వైనను ఖేదంబులేదు హంసలమగుటన్''**

**-58 ప – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

''మేము మానస సరోవరంలో నివసించేవాళ్ళం. మాకున్న బలమూ, మేము చూపే వేగమూ అనితర సాధ్యమైనవి. పక్షులన్నీ పొగుడుతుండే గొప్ప శక్తి మాది. ఎక్కడ పడితే అక్కడ తిరుగుతుంటాము. ఎంత దూరప్రదేశమైనా వెళ్ళగలము. మేము హంసలం కావటం వల్ల దూరమైనా మాకు దుఃఖం కలగదు. మా శక్తి అటువంటిది. జవసత్వాలు గల ఇన్ని హంసలుండగా, అన్నిటిలోకీ బలశాలి అయిన హంసను నీతో పరుగెత్తటంలో పోటీ పడటానికి రమ్మని పిలిచావు. అది నీ అవివేకం కాదా! అమాయకత్వం కాదా! అసలు ఓ కాకీ! లోకంలో ఇంతవరకెప్పుడైనా హంసలతో పోటీపడిన కాకులున్నాయా? చాలు, చాలు. నీవు నీ స్థానానికి వెళ్ళి సుఖంగా జీవించు'' అని చెప్పిన హంసలను చూసి కాకి గర్వంతో పలకసాగింది.

''ఓ హంసలారా! నా మాట కూడా వినండి. నేను నూట ఒక్క (101 విధాలుగా) విధాలలో ఎగరగలను. పైకి ఎగిరి కిందకు దిగి రాగలను. ప్రతి ఒక్క గతిలోను (విధానం లోనూ) నూరు యోజనాల దూరం (నూరు ఆమడల దూరం) వెళ్ళగలను. అంటే

పైకి నూరు ఆమడల దూరం ఎగిరి మళ్ళీ క్రిందికి నూరు ఆమడల దూరం దిగి రాగలనని తెలుసుకోండి. అంతేకాక, రకరకాల అందమైన పద్ధతులలో వంకర టింకరగా తిరుగుతాను. గుండ్రంగానూ తిరగగలను. మీరు కోరే విధంగా పరుగెత్తుతూ ఎటువంటి విన్యాసాన్నైనా చూపిస్తూ, మీలోని ఎంతటి ఉత్తమ హంసనైనా గెలుస్తాను. నా గెలుపు చూసి మిగిలిన హంసలన్నీ భయపడవలసిందే. అదే సమయంలో మా కాకులన్నీ పొంగిపోతయ్, చూడండి'' అని ధీమాగా పలికిన కాకిని చూసి తనకు పోటీకి పిలిచిన హంస ఆ కాకిని పోటీకి పిలిచింది.

"నూఱు గతుల నీవు వాఱుదే నన్నియు
నెఱుగఁ బులుగు లెల్లనెట్లు వాఱు
నదరి యాకసమున నిదు బాట నట్ల పా
ఱుదము రమ్ము జలధి చదల ననిన"

**-63 ప – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

''వాయసమా! నీవు నూరు విధాలుగా పరుగెత్తగలనని చెప్పావు. సరే. ఈ పక్షులన్నీ నీవు ఆకాశంలో ఏవిధంగా నూరు పద్ధతులలో పరుగెత్తగలవో చూసేటట్లే నీవూ నేనూ ఈ సముద్రంపైన గల ఆకాశంలో చక్కగా పోటీపడి పరుగెత్తుదాం, రా, చూసి సంతోషిస్తాయి'' అన్న హంస మాటలు విన్న కాకులన్నీ ఉత్సాహంతో ఒక్కసారిగా పైకెగిరి క్రిందికి వచ్చి హంసను ఎగతాళి చేశాయి. ''రాజహంసమా! నీ మాటలు మాకు నవ్వు తెప్పిస్తున్నాయి. ఎందుకంటావేమో! విను. నూరు పద్ధతులలో తిరగగల ఈ వాయసంతో కేవలం ఒక్క విధానంలో మాత్రమే నడవగల (ప్రయాణించగల) నీవు పోటీ పడుతున్నావంటే నీకవమానం తప్పదు'' అన్న కాకుల అపహాస్య వాక్కులు విన్న ఆ హంస మారుమాటాడక వాటిని అధిగమించి (దాటి) సముద్రంపైని ఆకాశంలోకి ఒక్క ఉదుటున పరుగెత్తింది. హంస ఎగరటం చూసిన కాకి దానిని దాటి పరుగెత్తాలన్న కోరికతో తానూ ఒక్క ఎగురు ఎగిరి హంసను సమీపించింది. కాకిని చూసిన హంస అలసట చెందకుండా నెమ్మదిగా వెళ్ళసాగింది. కాని, కాకి మాత్రం తన గొప్ప చూపాలనే ఆదుర్దాతో తాను నేర్చిన క్రీడలన్నీ చూపిస్తూ పరుగెత్తుతోంది. రకరకాల గతులతో (నడకలతో) కాకి అత్యుత్సాహంతో,వేగంగా పరుగెత్తుతుండటంతో బాగా ఆయాసం కలిగి అలిసిపోయింది. అయినా పరుగు మానలేదు.

"ఎలమిఁ గడిచిపోవు, పిలుచుఁ గ్రమ్మరి వచ్చి
ముక్కు ముక్కు మీద మోపు, చుట్టు
నేచి తిరుగు నీక లీకలతో రాయు
నొరయు చిత్రగతుల మురియు నవ్వు"

**-ప.66 – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

వేగంతో పరుగెత్తుతున్న ఆ కాకి హంసను దాటిపోతోంది ఒక్కొక్కసారి. హంస కనపడకపోవటంతో వెనుకకు తిరిగివచ్చి, 'నాతో సమానంగా పరుగెత్తు. తొందరగా రా' అంటూ హంస ముక్కు మీద తన ముక్కు పెట్టి నొక్కేది. వీర విజృంభణతో హంస చుట్టూ తిరుగుతుండేది. తన ఈ కలను హంస ఈ కలకు రాసి దానిని బాధ పెడుతుండేది. చిత్ర విచిత్రమైన నడకలతో దానిని నెట్టుకుంటూ ముందు కరిగి కాని తన బలానికి తానే మురిసిపోతుండేది. అంతటితో ఆగక దానిని చూసి నవ్వుతుండేది.

మునులారా! కాకి అహంభావం ఎంత దూరం వెళ్ళిందో చూశారా? చివరకు తన గతి ఏమవుతుందో ఏమో అన్న ఆలోచన లేకుండా హంస ఎందుకూ పనికిరాని పక్షి అని భావించింది'' అని సూతమహర్షి అనడంతో మునులందరూ ఆయన వంక ఆశ్చర్యంగా చూశారు.

''గురువుగారూ! కాకికి అంత గర్వమా? ఆశ్చర్యంగా ఉంది'' అన్న మునులను చూశాడు సూతుడు.

''అవును నాయనలారా! అప్పుడేమయిందంటే – ఇంతకు ముందు చెప్పినట్లు ఆ కాకి అనేక పద్ధతులలో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ హంస ముందు భాగాన, వెనుక భాగాన, చుట్టుపక్కల తిరుగుతుండటాన్ని చూసి, మిక్కిలి సంతోషించిన కాకులన్నీ హుషారుతో పెద్దగా అరుస్తూ, హంసలను గేలి చేస్తూ, నవ్వుతూ చెట్లపైన ఎగిరి గంతులు వేస్తూ, తమ జాతి విజయాన్ని తెలియజేయసాగాయి. 'హంస, కాకి చేతిలో ఓడిపోతోంది. పక్షులారా! చూడమని పెద్దగా అరుస్తూ పలుకుతుండగా, ఆ కాకుల ఆర్భాటంతోకూడినకలకలాన్ని విని, హంస ఉత్సాహాన్ని తెచ్చుకొని పరుగెత్తింది. ముందు నిట్ట నిలువుగా పైకి ఎగిరింది. వెనక పరుగెత్తిన విధంగా పడమటి దిక్కుకు తిరిగి

"రాజహంసమా!
నీ మాటలు మాకు నవ్వు
తెప్పిస్తున్నాయి. ఎందుకంటావేమో!
విను. నూరు పద్ధతులలో తిరగగల
ఈ వాయసంతో కేవలం ఒక్క విధానంలో
మాత్రమే నడవగల (ప్రయాణించగల) నీవు పోటీ
పడుతున్నావంటే నీకవమానం తప్పదు" అన్న
కాకుల అపహాస్య వాక్కులు విన్న ఆ హంస
మారుమాటాడక వాటిని అధిగమించి (దాటి)
సముద్రంపైని ఆకాశంలోకి ఒక్క
ఉదుటున పరుగెత్తింది.

మిక్కిలి వేగంతో ఎగరసాగింది. హంస పరుగెత్తుతున్న విధానాన్ని చూ సిన కాకి కూడ హంస వెంబడి అదేవిధంగా పరుగెత్తింది. కాని హంస వేగాన్ని అందుకోలేకపోయింది. హంసను దాటి పరుగెత్తడానికి కాకి బలం చాలలేదు. శరీరాన్ని గట్టిగా బిగబట్టి ఎలాగైనా హంసను ఓడించాలనే పట్టుదలతో వేగాన్ని పెంచింది కాకి. ఆ విధంగా పరుగెత్తి పరుగెత్తి కాకి పూర్తిగా అలసిపోయింది. అదే సమయంలో హంస అంతవరకు ఊరుకున్నదల్లా తన శీఘ్ర గమన చాతుర్యాన్ని ప్రదర్శించింది. అతి వేగంతో పరుగెత్తుతూ, కాకి తనతో పాటు సమవేగంతో పరుగెత్తలేకపోయిన దానిగా చేసి, శక్తిహీనురాలిగా చూసి ఆనందించింది హంస. అప్పటికి కాకి పరిస్థితి అనూహ్యంగా మారింది.

**"నేరక తొడరితి కాల్మొన**
**భూరుహములు లతలు గిరులు పొదలేమియు లే**
**వారయ బహు సత్త్వమయము**
**వారిధిడిగి సోకి నపుడ వలయుం బొలియన్"**

**-70 ప – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

"అయ్యో! హంస బలం తెలుసుకోలేక దానితో పోటీకి రమ్మని అహంకారంతో పిలిచానే! నాకా శక్తి క్షీణించింది. ఇప్పుడెలా దానిని గెలవగలను? నా స్థితి చూస్తుంటే అగమ్యగోచరంగా ఉంది. కాలు మోపి, విశ్రాంతి తీసుకోవటానికి దారిలో ఎక్కడా చెట్లూ, లతలూ, కొండలూ, పొదలూ ఏమీ లేవు. సముద్ర జలంపైన దిగుదామా అంటే ఆ నీటిలో నివసిస్తున్న జంతువులు నన్ను పొట్టన పెట్టుకోక మానవు" అని అనుకొంటూ కాకి దిగులు చెందింది. ఒక్కసారిగా ఎక్కడ లేని భయం ముంచుకు రావటంతో అంతులేని దాహంతో వశం తప్పి కాకి క్రిందకు జారిపోతుండటం చూసింది హంస.

**"నీవనేక గతుల నేర్తిది యేగతిఁ**
**జనుట చెపుమ వాయసంబ! యేను**
**గడవ నరిగి పిలువగా నేల తడసెద?**
**వెఱక లేటికిట్టులెడల విడువ?"**

**-72 ప – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

"ఓ వాయసమా! నిన్ను అతిక్రమించి వెళ్ళి నిన్ను పిలిచినా, నీవు సమాధానం చెప్పటం లేదు. నాతో సమానంగా రాలేక ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? నీ రెక్కలను ఇరువైపులా చాచి దిగిపోతున్నావు. రెక్కలు విరిగిపోతే ఎట్లా తిరగగలవు? మరో విషయం నీవు నేర్చిన నూరు పద్ధతులలో ఇది ఏ విధమైన నడకో చెప్తూతావా?" అని హంస అడిగింది. కాని దానికి సమాధానం చెప్పలేక, సముద్రంలోని నీళ్ళు ఎగిరి ఎగిరి పడుతూ తన అవయవాలను తాకుతుంటే ఆ బాధకు తట్టుకోలేక ఎగరలేకపోయింది. నీటిలో పడి భయంతో గిల గిల కొట్టుకుంటున్న కాకిని చూసి హంస జాలితో 'కాకీ! ఎన్ని ప్రగల్భాలయినా పలుకవచ్చు. కాని అన్నమాట నిలబెట్టుకోవటం అందరికీ సాధ్యం కాదు. నీ సంగతే చూడు. గొప్పలు చెప్పావు. నన్ను గెలుస్తానన్నావు. నీటిలో పడి పైకి లేవలేకపోతున్నావు. ఇప్పుడు మరి నన్ను గెలవగలవా? చెప్పు" అని అనటంతో హంసతో తన బాధను, గర్వాన్ని చెప్పుకోసాగింది.

"అవును రాజహంసమా! నా బలం చూసుకొని గర్వించాను. అహంకారంతో అనకూడని మాటలు ఎన్నో అన్నాను. చివరకు పొగరుతో విహంగనాథుడైన గరుత్మంతునే గెలవగలనని తలపోసేదానిని. నా శక్తి ఏమిటో, నా సామర్థ్యం ఎంతటిదో ఇప్పుడు తెలుసుకొన్నాను. దయదలచి నన్ను కాపాడు. నీవు తప్ప నన్ను రక్షించగల వారెవరూ లేరు. మళ్ళీ నన్ను మా కాకులలో కలపటం నీకు న్యాయం కదా!" అని మిక్కిలి బాధతో తన ముక్కు తెరచి 'కావు కావు'మని అరుస్తూ నీటిలో మునిగిపోతున్న కాకిని చూసి కరుణకు లోనయింది హంస.

**"వెరవునఁ దత్తనువుందన**
**చరణంబుల నీటికి యెత్తి చావుడిపి బల**
**స్ఫురణంబు మెఱయ వీపున**
**ధరియించుచు వచ్చెఁ బక్షి తతులు నుతింపన్"**

**-80 ప – ద్వితీయాశ్వాసము – కర్ణపర్వము – మహాభారతము**

హంస, కాకిని తన కాళ్ళతో గట్టిగా పట్టుకొని, నీటిలో పడకుండా పైకెత్తి, దాని ప్రాణాలను కాపాడింది. వెంటనే తన బలాన్నంతటినీ వినియోగించి దానిని, తన వీపుమీదికి చేర్చింది. ఆవిధంగా కాకిని తన వీపుపైకి ఎక్కించుకొని ఎగురుతూ వచ్చి దానిని కాకులతో కలిపి, తన బాధ్యత నెరవేర్చినందుకు ఎంతగానో సంతోషిస్తున్న హంసను చూసి కాకులే కాక, అక్కడ ఉన్న పక్షులన్నీ ఇది రాజహంస కనుక ఇంత ఘనకార్యం సాధించిందని పొగిడాయి. కాకి ఉండే స్వస్థానంలో దానిని దించి హంస దానికి నీతిని బోధించింది. కాకులన్నీ వింటుండగా "ఓ వాయసమా! ఇక ముందు ఎప్పుడూ ఇటువంటి తెలివి తక్కువ పనులు చేసి, ఆపద పాలు కాకు" అని చెప్పి రాజహంస తన సహచరాలైన మిగిలిన హంసలతో కలిసి తన నెలవుకు వెళ్ళిపోయింది.

"మునులారా! హంస చేసిన నీతిబోధను ఆకళింపు చేసుకొని, ప్రతివారూ తమకన్నా అధికులు, బలంగలవాళ్ళు, శక్తిమంతులు అయిన వారితో పోటీపడి, మృత్యువును కొని తెచ్చుకోరాదు". ఈ ఉపాఖ్యానాన్ని మద్రదేశాధీశ్వరుడైన శల్యుడు – రథికుడైన కర్ణుడికి చెప్పి – కాకి ఏవిధంగా హంసను పోలజాలకపోయిందో, అదేవిధంగా, నీవు అర్జునుని గెలవజాలవని చెబుతూ ప్రధాన కథకు అన్వయించాడు. ప్రతి ఉప కథా ఏదో ఒక పద్ధతిని అనుసరిస్తూ ప్రధాన కథకు ఉపబలకంగా ఉంటుంది.

★★★

# భక్త లీలాశుకుడు

- గోనుగుంట మురళీకృష్ణ

ఊరికి దూరంగా పచ్చనిచెట్ల మధ్య ఉంది ఆ ఇల్లు. ఊరి నుంచీ ఇక్కడకు రావాలంటే నదిని దాటిరావాలి. నది నీటిమీద నుంచీ గాలి వీచినప్పుడు ఆ ఇంటిలోని వారికి వింజామరలు వీచినట్లు ఉంటుంది. చల్లటిగాలి హాయి గొలుపుతుంది. చుట్టూఉన్న చెట్లమీది పూలపరిమళంతో కలసిన గాలులు ఎల్లవేళలా హాయి గొలుపుతూ ఉంటుంది. నది ఒడ్డున పడవవాడు మనుషుల్ని ఆ ఒడ్డు నుంచీ ఇక్కడకు, ఇక్కడనుంచీ మళ్ళీ అవతల తీరానికీ చేరుస్తూ ఉంటాడు. చీకటిపడిన తర్వాత పడవకు లంగరు వేసి ఊరిలోకి వెళ్ళిపోతాడు.

ఆ ఇంటి యజమాని పేరు లీలాశుకుడు. అతడితో పాటు భార్య, తండ్రి కూడా ఉంటూఉంటారు. లీలాశుకుడు మహాపండితుడు. ఆ ఇంటికి వచ్చేపోయే వారితో నిత్యం సాహితీ గోష్ఠులు జరుగుతూ ఉంటాయి. ఎంతోమంది వచ్చినా విసుగులేకుండా అందరికీ అతిధి మర్యాదలు చేస్తూ ఉంటుంది అతడి భార్య. సిరీ, సంపద, పాడిపంటలతో, అనుకూలవతి అయిన భార్యతో, మంచి చెడు చెప్పటానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రితో ఆనందకరమైన జీవనం గడుపుతున్నాడు లీలాశుకుడు. అతడంటే ఊరివారందకీ మర్యాద, గౌరవం. ఊరిపెద్దగా గౌరవిస్తూ ఉంటారు.

నదికి ఆవలివైపు గల ఊరిలో పల్లపువీధిలో విలాసిని అనే వేశ్య తల్లితో, అమ్మమ్మతో కలసి నివసిస్తూంది. ఆమె అందానికి రంభ, నాట్యానికి ఊర్వశి. ఊరి మగవాళ్ళు ఎంతోమంది ఆమె దృష్టిలో పడాలని ప్రయత్నిస్తూ విఫలమై పోతుంటారు. ఎందుకంటే సాదాసీదా మగవాళ్ళ వంక తలెత్తి అయినా చూడదు విలాసిని. అందగాడు, ఐశ్వర్యవంతుడు అయి ఉండాలి ఆమెకు. అప్పుడే అతడివంక చూస్తుంది, మాట్లాడుతుంది.

అలాంటి విలాసిని కన్ను లీలాశుకుడి మీద పడింది. అతడితో పరిచయం చేసుకోవాలనీ, కొంతకాలం గడపాలనీ చిరకాలవాంఛ ఆమెకి. కానీ ఆ కోరిక నెరవేరటం లేదు. ఎందుకంటే లీలాశుకుడు పరస్త్రీ వంక కన్నెత్తి అయినా చూడడు. విప్రనారాయణుడి కంటే నైష్ఠికుడు, ఋష్యశృంగుడి కంటే పరస్త్రీ పరాన్ముఖుడేమీ కాదుగా! అంతటివారే వయ్యారి వాలుచూపులకు దాసోహమన్నారు. ఇక ఇతడెంత? అనుకుంది విలాసిని. పండితుడిని పాండిత్యంతోనే ఆకట్టుకోవాలి. అందుకని తాళపత్రం మీద ఒక శ్లోకం రాసి, అర్థం తెలుసుకుని రమ్మని పనివాడి చేతికి ఇచ్చిపంపింది విలాసిని.

పనివాడు లీలాశుకుడి ఇంటిముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"ఎవరు నువ్వు?"

"మా అమ్మగారు ఇది మీకు ఇచ్చి అర్థం తెలుసుకుని రమ్మన్నారండీ!"

"ఎవరు మీ అమ్మగారు?"

"విలాసిని. దేవాలయాల్లో నాట్యం చేస్తుంది. ఆమె సౌందర్యం చూడటానికి రెండు కళ్ళూ చాలవని అందరూ అనుకుంటారు"

"చదివింది చాలు. ఏదీ ఆ తాళపత్రం?" అందుకున్నాడు లీలాశుకుడు.

**"వృక్షాగ్రవాసీ నచ పక్షిరాజః;**
**చర్మాంగధారీ నచ సోమయాజీ!**
**త్రినేత్రధారీ నచ శూలపాణిః**
**జలం ధరిత్రీ న ఘటో న మేఘః !!"**

"చెట్టు పైన నివసిస్తుంది గానీ పక్షి కాదు, చర్మం ధరిస్తుంది గానీ ఋత్విజుడు కాదు (పూర్వం యజ్ఞం నిర్వహించే సోమయాజులు గజచర్మం వంటివి ధరించేవారు), మూడు కళ్ళు ఉంటాయి గానీ శివుడు కాదు, నీటిని ధరిస్తుంది గానీ కుండ కాదు, మేఘం కాదు అని అర్థం. దీని జవాబు కొబ్బరికాయ" చెప్పాడు.

"ఇంతేనాండీ! ఇప్పుడే వెళ్లి అమ్మగారికి చెబుతాను" వెళ్ళిపోయాడు పనివాడు.

విలాసినిని మొదటసారి దేవాలయంలో నృత్య ప్రదర్శన ఇచ్చేటప్పుడు చూసాడు లీలాశుకుడు. ఆమె అతిలోక సౌందర్యానికి అబ్బురపడిపోయాడు. తన సౌందర్యానికి లోబడిన వారిని చిటికెన వేలుతో తిప్పినంత సులభంగా ఆడించగలదు విలాసిని. మొదట ఆమె వినయానికి, సౌందర్యానికి ముగ్ధుడై ఆమె ఇంటికి వెళ్ళాడు లీలాశుకుడు. రాకపోకలు ఎక్కువైనాయి. క్రమక్రమంగా ఆమెకి కానుకలు ఇవ్వటానికి ఇంట్లో ఉన్న డబ్బంతా తరిగిపోసాగింది. లీలాశుకుడి ప్రవర్తనలో వచ్చిన మార్పులు గమనిస్తూనే ఉన్నారు అతడి భార్య, తండ్రి.

ఒకరోజు కొడుకు రాగానే తండ్రి "నాయనా! ఈ మధ్య

బొత్తిగా నల్లపూస అయ్యావు. కంటికి కనిపించటమే లేదు. ఎప్పటికో వస్తావు. వచ్చినంత వేగంగా వెళ్ళిపోతావు. ఎట్లారా నాయనా! నీ భార్య ముఖం చూడు. నీ కోసం భోజనం మానుకుని కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తూ ఉంటుంది. ఇల్లాలి కంటి నీరు ఇంటికి శుభం కాదు".


"అబ్బబ్బ మొదలు పెట్టారూ! అందుకే నాకు ఇంటికి రావాలంటే చిరాకు. నాకోసం ఎదురు చూడవద్దని ఆమెకి ఎన్నోసార్లు చెప్పాను." అన్నాడు.

"మామగారూ! మీ కఠినోక్తులతో వారి మనసు నొప్పించకండి. మీరు రండి భోజనం చేద్దురు గానీ!" భర్త చేయి పట్టుకుని వంట గదిలోకి తీసుకుపోయింది రాధ.

"భోజనానికేం గానీ, నీ చంద్రహారం ఏదీ!"

"దేనికి?"

"ఎందుకో చెబితే గానీ ఇవ్వవా?"



"సంతోషంగా ఇస్తాను. కానీ మీరు తీసుకుని ఏం చేసుకుంటారు? ఆ వేశ్యకి ఇవ్వటానికేనా! నేనంటే మీకెందుకు మొహం మొత్తింది? అందం లేదా, విద్య లేదా, వినయం లేదా! చెప్పండి. ఆమెలో ఉన్నదేమిటి? నాలో లేనిదేమిటి? నేనంటే మీకు ఎందుకు విముఖత్వం కలిగింది?"

"చెప్పమంటావా! భార్యవి కావటమే!" పెట్టెలో నగ తీసుకుని వెళ్ళిపోయాడు లీలాశుకుడు.

మ్రాన్పడిపోయింది రాధ.

లీలాశుకుడు పూర్తిగా వేశ్యావ్యామోహంలో మునిగిపోయాడు. ఇప్పుడు అతడికి ఆమె తోడిదే లోకం. రాత్రీపగలు ఇక్కడే ఉంటున్నాడు. ఆమె కోరికలు తీర్చటానికి ఇంట్లో ఉన్న నగానట్రా, తాతల కాలంనుంచీ వచ్చిన భూములు, ఆస్తులు మొత్తం కాళ్ళువచ్చి నడచివచ్చినట్లు విలాసిని సొంతం అయ్యాయి. తండ్రిని, భార్యను పట్టించుకోవటమే మానేశాడు. అతడికోసం కలవరించి, కలవరించి దిగులుతో మంచంపట్టాడు తండ్రి. భార్య మొహంలో నవ్వు ఏనాడో మాయమైనది. ఆమెని కదిలిస్తే కన్నీరు కట్టలు తెంచుకుంటుంది.

ఆరోజు ఆకాశం దట్టంగా మబ్బుపట్టి ఉంది. వాన కుంభవృష్టి కురిపిస్తూంది. గాలికి చెట్లతలలు విరబోసుకున్న దయ్యాల తలల్లా ఊగిపోతున్నాయి. ఉండుండి కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లు మెరుపులు మెరుస్తున్నాయి. లీలాశుకుడి తండ్రి చిక్కిశల్యమై మంచంలో ఉన్నాడు. ఆయన పరిస్థితి ఇప్పుడో ఇంకాసేపటిలోనో అన్నట్లు ఉంది.

"ఇరుగులేదు, పొరుగులేదు, కారడవిలో కాపురం. ఆ పైన అర్ధరాత్రి. ఈయనకి వర్తమానం పంపించాను. ఇంతవరకూ రాలేదు. ఈ రాత్రి ఎలా గడుస్తుందో!" బయటకు చూస్తూ అనుకుంది రాధ. ఇంతలో లీలాశుకుడు వస్తున్నట్లుగా చీకటిలో తెల్లటి అంగీ కనిపించింది. ఆమెకి కొంచెం ధైర్యం వచ్చింది.

"అత్యవసరం అని వర్తమానం పంపించావేమిటి? ఏం కొంపలు అంటుకుపోయాయి?" వస్తూనే ధుమధుమలాడుతూ అన్నాడు.

"మీ నాన్నగారి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నది. ఆయన మూసిన కన్ను తెరవటం లేదు"

"అందుకు నేనేం చేస్తాను? నువ్వు కబురు పంపించాల్సింది వైద్యుడికి, నాకు కాదు"

"అదేమిటండీ అలా అంటారు? మీ పుత్రధర్మం నెరవేర్చరా? మామగారు కన్ను తెరిచినప్పుడల్లా మీ కోసమే కలవరిస్తున్నారు. ఇలా రండి" చెయ్యి పట్టుకుని పక్క గదిలోకి తీసుకువెళ్ళింది.

ఆయన తల దగ్గర కూర్చుని "మామగారూ! మీ అబ్బాయి వచ్చారు. మీ కోసమే వచ్చారు. కళ్ళుతెరిచి చూడండి" చెవి దగ్గర పెద్దగా చెప్పింది. ఆయన కనుగుడ్లు కదిలాయి. కళ్ళలోనుంచీ నీరు చెంపల మీదకు జారింది. అత్యంత కష్టం మీద కళ్ళు తెరిచారు. కానీ ఆ చూపులో స్థిరంలేదు. మళ్ళీ కళ్ళు మూతలు పడిపోయాయి. ఆయన తల పక్కకు వాలిపోయింది. "మామగారూ!" ఘొల్లుమంది రాధ. లీలాశుకుడు తండ్రి ముఖం వంక నిర్వికారంగా చూశాడు.

ఎక్కడో "ఢాం" అని పిడుగుపడింది. ఉరుములు ఉరిమాయి. "ఉరుములు అంటే విలాసినికి భయం. నేను వెళ్ళాలి" వెళ్ళబోయాడు.... "ఎక్కడికి వెళతారు?" తలెత్తింది రాధ. "మీరు వెళ్ళటానికి వీల్లేదు"

"నన్ను వదులు. నేను వెళ్ళాలి" విదిలించుకున్నాడు.

"వద్దండీ! వెళ్ళద్దు. నట్టింట్లో శవం పెట్టుకుని నేను వంటరిగా ఉండలేను. నాకు భయం వేస్తూంది." అతడిని గట్టిగా పట్టుకోబోతుంటే విదిలించుకుని బయటికి వెళ్ళిపోయాడు. రాధ జుట్టుముడి ఊడిపోయినా, చీర జారిపోతున్నా అతడి వెనకే వానలో పరుగెత్తింది.

అర్ధరాత్రి అయింది. తన శయ్యామందిరంలో విలాసిని పడకమీద దిండుకు ఆనుకుని కూర్చుని ఉంది. బయట వర్షం భయంకరంగా కురుస్తూంది. ఉండుండి ఉరుములు ఉరుముతున్నాయి. విలాసినికి నిద్ర పట్టటం లేదు. మనసంతా

ఎందుకో దిగులుగా ఉంది. ఏదైనా అశుభం జరగబోతున్నది అనే సూచనగా ఆమెకి అప్పుడప్పుడు ఇలాగే అనిపిస్తుంది. నిద్ర లేకుండానే ఆ రాత్రి గడచిపోతుంది. ఇప్పుడు కూడా ఆలోచిస్తూ కూర్చుని ఉంది. పక్క గదిలోనుంచీ అమ్మమ్మ గురక వినిపిస్తూంది.

ఇంతలో తలుపులు దబదబ బాదినట్లు శబ్దం వినిపించింది. లేచి తలుపు తెరిచింది. లీలాశుకుడు నిలువెల్లా తడిచిపోయి నిలబడి ఉన్నాడు. అతడి వాలకం చూసి తెల్లబోయింది. "ఇదేమిటి ఈ వేళప్పుడు వచ్చారు?" మాట్లాడుతూనే ఉంది, "విలాసినీ, ఉన్నావా! నీకోసమే తహతహలాడుతూ వచ్చాను" అంటూ కౌగలించుకోబోయాడు. ఆమె చేతులు అడ్డుపెట్టి " ఆగండి. అంగీ నిండా ఆ రక్తం ఏమిటి?" అడిగింది.

"రక్తమా! అవును. వీధి తలుపు తట్టాను. ఎవరూ తలుపు తీయలేదు. నువ్వు మేడమీద గదిలో ఉంటావని నాకు తెలుసుగా! పెరటివైపు గోడఎక్కి వచ్చాను. గోడమీద నుంచీ ఏదో మెత్తగా వేలాడుతుంటే దాన్ని పట్టుకుని ఎక్కాను."



"ఏదీ చూద్దాం. పదండి" దీపం తీసుకుని పెరటివైపు వచ్చింది. లీలాశుకుడు వెనకే నడిచాడు. వాన తగ్గినా ఇంకా సన్నటి చినుకులు పడుతూనే ఉన్నాయి. గోడమీద పెద్ద పాము వేలాడుతూ కనిపించింది. దాన్ని చూసి కెవ్వు మంది విలాసిని. "దీన్ని పట్టుకునేనా వచ్చారు? ఎంత సాహసం చేశారు?" అన్నది.

"ఇది తెలియక చేసిన సాహసం. తెలిసి చేసిన సాహసం మరొకటి ఉంది. నది దాటటానికి బల్లకట్టు లేదు. ఎవరిదో స్త్రీ శవం కనిపించింది. దాన్ని ఆధారం చేసుకుని నది ఈది వచ్చాను. నాకింత ఉపకారం చేసిన ఆ శరీరాన్ని జలచరాలు భక్షించకుండా ఒడ్డుకు చేర్చాను. చూద్దువుగాని పద!" అన్నాడు.

ఇద్దరూ నది దగ్గరకు వచ్చారు. దీపం వెలుగులో ఆ శవం ముఖం చూడగానే "రాధా! నువ్వా!" అంటూ గట్టిగా అరిచాడు.

"మీకీమె తెలుసా!" అడిగింది.

"నాభార్య." లీలాశుకుడిని ఆవహించిన మత్తు వదిలినట్లయింది. "రాధా! ఒంటరిగా ఉండలేనని నాతో పాటే వచ్చావా!" అంటూ కన్నీళ్లు పెట్టుకుని జరిగినదంతా చెప్పాడు.

"నాకోసం మరణించిన తండ్రిని, అగ్నిసాక్షిగా తాళికట్టిన ఇల్లాలిని వదలివచ్చారా! ఛీ! ఏముంది ఈ శరీరంలో? రక్తమాంసాలతో నిండిన తోలుతిత్తి ఇది. ఒక్కపూట స్నానం చేయకపోతే కంపు కొట్టిపోతుంది. ఈ తుచ్ఛమైన శరీరం కోసం కామాంధులై కన్నతండ్రిని, భార్యను చంపుకున్నారా! మిమ్మల్ని చూస్తే అసహ్యం వేస్తూంది. ఈ శ్రద్ధ భగవంతుడిపై చూపిస్తే పుణ్యం అయినా లభిస్తుంది. ఛీ! వెళ్ళండి అవతలికి!" అసహ్యించుకుంటూ వెళ్ళిపోయింది విలాసిని.

విలాసిని ఇంటికి వచ్చి తలారా స్నానం చేసింది. శుభ్రమైన వస్త్రాలు కట్టుకుంది. శ్రీకృష్ణుడి విగ్రహం ముందు మోకరిల్లి ఇలా ప్రార్థిస్తూ ఉంది.

**"పాపిని, భ్రష్టురాల నతి బానిసనై బహు నీచవృత్తిలో**
**రేపులు మాపులుంబడి చరించిన మాటయె నిక్కువమ్మికం**
**పాపపు దారి త్రొక్కను భవచ్చరణాబ్ది యుగంబు సాక్షిగా**
**నా పయి ప్రేమనిల్పి యదునందన కృష్ణ! తరింపజేయవే!"**

(పాపాత్మురాలిని, భ్రష్టురాలిని, డబ్బుకు బానిసగా మారి అత్యంత నీచమైన వేశ్యావృత్తిలో ఉదయం, సాయంత్రం అనకుండా అందులోనే మునిగితేలిన మాట నిజం. నీ పాదాల సాక్షిగా ఇంకెప్పటికీ ఆ పాపపు దారిలో వెళ్ళను స్వామీ! ఈ దాసురాలి మీద దయదలచి నన్ను తరింపజేయి కృష్ణా!).

అని ప్రార్థిస్తూ కళ్ళుమూసుకుంది. కళ్ళవెంట వెచ్చటి కన్నీరు కారింది.

లీలాశుకుడు ఇంట్లో వంటరిగా ఉన్నాడు. మనసంతా శూన్యంగా ఉన్నది. తండ్రి గది ఖాళీగా కనిపిస్తుంటే కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లుంది. ఏవీ ఆ ఓదార్పు మాటలు? తనని దగ్గరకు తీసుకున్న చేతులు ఏవీ! ఏవీ ఆ తెల్ల మీసాలు?... ఎదురుగా దండెం మీద రాధ చీరెలు వేలాడుతూ ఉన్నాయి. తనకోసం ఏడ్చి ఏడ్చి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయింది ప్రియసతి. తండ్రి చెబుతూనే ఉన్నాడు ఇల్లాలు కంటనీరు శుభం కలిగించదని! ఇలా అనుకున్నాడు లీలా శుకుడు.

**"చదివితి సమస్త శాస్త్రముల్ చదివి యేమి**
**ఫలము? తుదకిట్లు చెడుదారిబడి చరించి**
**జనకు నిల్లాలిని గూడ జంపు కొంటి!**
**తరుగబోనట్టి ఘోరపాతకము గంటి"**

(అన్ని శాస్త్రాలూ చదువుకున్నాను గానీ ఏం లాభం? చెడ్డదారిలో వెళ్లి చివరకు తండ్రిని, ఇల్లాలిని చంపుకున్నాను. ఎన్నటికీ తరగని మహాపాపంలో పడిపోయాను)

ఇంతకంటే దురవస్థ ఏమున్నది? భార్య ఎన్నోసార్లు హెచ్చరించినా పెడచెవిని బెట్టాడు తను. బంధువులు, స్నేహితులు ఎన్నోవిధాల చెప్పిచూసి, తుదకు అందరూ దూరమయ్యారు.

**"పరమ విశుద్ధమై ప్రఖ్యాతి వడసిన**
**కులమెల్ల నా చేత మలినమయ్యె**
**కనిపెంచి శ్రీమంతు గావించిన**
**మహానుభావుండు తండ్రి జీవంబు విడిచె**
**నను దైవముగ మదినమ్మి సేవించిన**
**యాలి నాకై గుండె ప్రీలి చచ్చె**

కడు ప్రయాసము మీద గడియించు కొన్నట్టి
మర్యాద తుదముట్ట మాసిపోయె
ప్రాణధనముగ నెంచి కాపాడుకొన్న
శీల మామూలకంబుగా శిథిలమయ్యె
సర్వ విధముల నిట్లు భ్రష్టతను గాంచి
ఎట్టు లీ జీవితము భరియించు వాడ?"

(పరమ పవిత్రమైనదిగా పేరుపొందిన వంశం నా మూలంగా మాసిపోయింది. నన్ను కని, పెంచి తన సంపదనంతా నాకు ఇచ్చిన తండ్రి ప్రాణం విడిచాడు. నన్నే దైవంగా నమ్మి కొలిచిన నా భార్య నాకోసం గుండె పగిలి మరణించింది. ఇన్నాళ్ళూ ఎంతో కష్టపడి సంపాదించుకున్న మర్యాద అంతా మంటకలిసి పోయింది. ప్రాణం కన్నా మానమే ముఖ్యం అనుకునే కులంలో పుట్టిన నేను మానహీనుడిగా అయ్యాను. ఈ విధంగా సర్వవిధాలా భ్రష్టుడనైన నేను ఈ జీవితాన్ని ఏ విధంగా భరించగలను?)

ఇంత చేసింది ఎవరికోసం? విలాసిని కోసం! చివరికి ఆమె ఏమన్నది? నువ్వంటే నాకు అసహ్యం అన్నది. ఈ శ్రద్ధ దేవుడిమీద చూపించమంది. నిజమే! దేవుడి మీద చూపిస్తే తన దుఃఖానికి దారి దొరుకుతుందేమో! అనుకుంటూ విరక్తితో ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు లీలాశుకుడు. ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. కాలు తీసుకువెళ్ళిన వైపు వెళ్ళాడు. రోజుల తరబడి తిరిగితిరిగి ఒక చెట్టుకింద కూర్చున్నాడు. అటువైపుగా ఒక యోగి వచ్చాడు.

"నాయనా! లీలాశుకా!" అని పిలిచాడు.

"నా పేరు మీకెలా తెలుసు స్వామీ!"

"నాకు అంతా తెలుసు. నన్ను సోమగిరి యోగీంద్రుడు అని అంటారు. ఇక్కడ సమీపంలో గల సిద్ధమఠం నా నెలవు. నీకు తరణోపాయం చూపిస్తాను. నా ఆశ్రమానికి రా!" పిలిచాడు.

లీలాశుకుడు ఆయన వెంట వెళ్ళాడు. వెళ్ళిన తర్వాత "ఇలా శరీరం శుష్కింప జేసుకుంటే మోక్షం లభించదు. ముందు సుస్నానం చేసి, ఫలహారం తీసుకుని రా! నీకు శ్రీకృష్ణ మంత్రం ఉపదేశిస్తాను" అన్నాడు సోమగిరి యోగీంద్రుడు.

సోమగిరి యోగీంద్రుడి చేత మంత్రోపదేశం పొందిననాటి నుంచీ లీలాశుకుడి జీవితమే మారిపోయింది. గడచిన జీవితమంతా మైలబట్ట విడిచినట్లు విడిచిపెట్టాడు. శ్రీకృష్ణ ధ్యానంతో మనసు క్షాళన చేసుకున్నాడు. పునర్జన్మ ఎత్తినట్లు అనిపించింది. ఆయన నోటివెంట శ్రీకృష్ణ నామస్మరణమే ఎల్లప్పుడూ వినిపిస్తూ ఉంటుంది. ఆరోజు కూడా శ్రీకృష్ణ మూర్తి వంక తదేక ధ్యానంతో ఇలా ప్రార్థిస్తూ ఉన్నాడు.

"హే గోపాలక! హే కృపాజలనిధే! హే సింధు కన్యాపతే!
హే కంసాంతక! హే గజేంద్ర కరుణా పారీణ! హే మాధవ!
హే రామానుజ! హే జగత్రయ గురో! హే పుండరీకాక్ష మాం
హే గోపీజననాథ! పాలయ పరం జానామి న త్వాం వినా!"

(ఓ గోపాల కృష్ణా! ఓ దయా సముద్రుడా! ఓ సముద్రునికి కుమార్తె అయిన లక్ష్మీదేవికి భర్త అయిన వాడా! ఓ కంసుడి పాలిట యముడైన వాడా! ఓ గజరాజు పట్ల కరుణ చూపించిన వాడా! ఓ మాధవుడా! ఓ బలరాముని తమ్ముడా! ఓ ముల్లోకాలకు గురువైన వాడా! ఓ తెల్లతామరల వంటి నేత్రాలు కలవాడా! నిన్ను తప్ప ఇంకొకరిని నేను ఎరుగను, నన్ను రక్షించు దేవా!)

"కస్తూరి తిలకం లలాట ఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణం
సర్వాంగే హరిచందనం చ కలయం కంఠే చ ముక్తావళిం
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః"

(నుదుటన కస్తూరిబొట్టు, వక్షస్థలం మీద కౌస్తుభమణి, ముక్కున కొత్త ముత్యము, చేతిలో పిల్లనగ్రోవి, హస్తాలకు కంకణాలు, శరీరంలో ప్రతి అవయవమునకు శ్రీచందనం దాల్చినవాడు, కంఠంలో ముత్యాలహారం ధరించిన వాడు, గోపికలతో కూడియున్నవాడు, గోపాలురందరిలోను శిరోరత్నమైన వాడును, సర్వోత్కృష్టుడు అయిన హరిని ధ్యానించుచున్నాను)

"శృంగార రస సర్వస్వం శిఖి పింఛ విభూషణం!
అంగీకృత నరాకారమాశ్రయే భువనాశ్రయం !"

(శృంగార రసం యొక్క సారాంశమైన వాడును, నెమలి పింఛం అలంకారంగా కలవాడును, మానవరూపం ధరించిన వాడును, లోకమునకు ఆధారము అయిన వాడును అయిన శ్రీకృష్ణుని ఆశ్రయించుచున్నాను.)

"లక్ష్మీ కళత్రం లలితాబ్జ నేత్రం
పూర్ణేందు వక్త్రం పురుహూత మిత్రం
కారుణ్య పాత్రం కమనీయ గాత్రం
వందే పవిత్రం వాసుదేవ పుత్రం"

(లక్ష్మీదేవి భార్యగా గలవాడు, అందమైన తామరరేకుల వంటి కన్నులు గలవాడు, నిండు చంద్రుని వంటి ముఖము గలవాడు, దేవేంద్రునికి స్నేహితుడు, దయకు నిలయమైన వాడు, మనోజ్ఞమైన శరీరం కలవాడు, కడు పావనమైన వాడు, వసుదేవుని కుమారుడు అయిన శ్రీకృష్ణునికి నమస్కరించుచున్నాను)

ఈ విధంగా శ్రీకృష్ణుని స్తుతిస్తూ అనేక శ్లోకాలు రచించాడు లీలాశుకుడు. ఈ కావ్యానికి "శ్రీకృష్ణ కర్ణామృతం" అని పేరు. ఇందులో మూడు అశ్వాసాలు ఉన్నాయి. మొదటి అశ్వాసంలో శ్రీకృష్ణుని మనోజ్ఞమైన సౌందర్యాన్ని వర్ణిస్తూ సాక్షాత్కరించమని ప్రార్థించాడు. రెండవ అశ్వాసంలో శ్రీకృష్ణ లీలలు వర్ణించాడు. మూడవ అశ్వాసంలో శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ చేసే అనేక శ్లోకాలు ఉన్నాయి.

చివరకు శ్రీకృష్ణ సాక్షాత్కారం పొంది ముక్తిపొందిన మహాభక్తుడు లీలాశుకుడు.



# కైవల్యమిచ్చే కార్తీకమాసం

- డా|| దేవులపల్లి పద్మజ

శివకేశవులిరువురికీ ప్రీతికరమైన సేవలనందించి, అనుగ్రహం పొందడానికి అనుకూలమైన మాసం కార్తికమాసం. మాసం పూర్తిగా భగవద్ కైంకర్యానికే ప్రాధాన్యమిచ్చే సంప్రదాయం అనుసరించే పరంపర భారతీయులది. కేవలం జలం మాత్రమైనా అభిషేకించి శివపార్వతుల నుండి వరాలను సులభంగా పొందవచ్చని, అభిషేకప్రియునికి మాసవ్రతం ఆచరిస్తారు. అయితే కేశవుని కూడా ఈ కార్తికంలో ఆరాధిస్తే అనంతపుణ్యఫలం అంటారు. కార్తికమాసానికి సమానమైన మాసమేదీ లేదు, సత్యయుగంతో సమానమైన యుగమేదీ లేదు, వేదములతో సమానమైన శాస్త్రమేదీ లేదు, గంగానది వంటి పవిత్రమైన నది మరొకటి లేదు.

**న కార్తికసమో మాసో న కృతేన సమం యుగమ్**
**న వేదసదృశం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్**

చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో, ఆనక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. కృత్తికా నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించుట వలన ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. ప్రతిఏటా దీపావళి వెళ్లిన మర్నాటి నుంచి కార్తీక మాసం ప్రారంభం అవుతుంది. వెన్నెల శోభలతో అలరారే శరత్ ఋతువులో వచ్చే రెండవ నెల కార్తీకమాసము.

పూర్వం నైమిశారణ్య ఆశ్రమములో శౌనకాది మహామునులకు సూతమహాముని కార్తీకమాస వ్రతము వైభవమును వివరించినట్లు మనకు పురాణాల ద్వారా తెలుస్తోంది. కార్తీకమాసము మానవులకు ఇహమును ఈతిబాధలు తొలగించి పరమును మోక్షము కలిగించునని తెలియచేస్తాడు. ఈ మాసంలో శుద్ధ విదియ నాడు సోదరి చేతివంట భగినీ హస్తభోజనము చేసి యధాశక్తి వారికి కానుకలు సమర్పించుటంతో పాటు, సమీప వనంలో బంధువులు, స్నేహితులతో కలిసి ఉసిరిచెట్టును పూజించి, సాత్విక ఆహారంతో వనభోజనాలు చేస్తూ వుండటం మంచిది. అందువల్ల మన జీవన గమనంలో మంచి ఆహ్లాదంతో పాటు అన్నదాన ఫలితం, సమాజములో సఖ్యత సమకూరుతుంది.

శ్రీ మహావిష్ణువు పాలకడలిలో ఆదిశేషుని పాన్పుపైన ఆషాడ శుద్ధ ఏకాదశినాడు తన యోగ నిద్రను ప్రారంభించి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశినాడు కనులు తెరచి యోగ నిద్ర నుండి మేల్కొనటం

జరుగుతుంది. అందుకే కార్తీక శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశి అని వ్యవహరిస్తారు. ఈ రోజు ఎంతో పవిత్రమైనది. ఈ రోజున విష్ణువునకు ప్రీతికరమైన విష్ణుసహస్రనామ పారాయణము, గోవింద నామ సంకీర్తన చేయాలి.

కార్తీక మాస శుద్ధ ద్వాదశినాడు శ్రీ మహాలక్ష్మీ సమేతుడైన శ్రీ మహావిష్ణువు తులసీ ధాత్రివనంలో ఉంటాడని చెప్తారు. ఈ ద్వాదశిని క్షీరాబ్ధి ద్వాదశి అంటారు అంటే, పూర్వం కృతయుగంలో దేవదానవులు పాలసముద్ర మథనం చేసిన రోజు. కనుక దీనికి క్షీరాబ్ధి ద్వాదశి అను పేరు వచ్చింది. పాల సముద్రాన్ని చిలికారు కనుక చిల్కు ద్వాదశి అని కూడా అంటారు. విష్ణువు దామోదర నామంతో పిలవబడతాడు. తులసి చెంత హరిపూజ పుణ్యప్రదం. నిత్యము క్షీరసముద్రములో శయనించే శ్రీమహావిష్ణువు ఈ రోజు దేవతలతో కలసి బృందావనమునకు వస్తారు. ఈ రోజు విష్ణువును పూజించినవారి మహాపాతకములన్నియు నశించిపోతాయి. బృందావన సన్నిధి యందు దీపదాన విశేషము చెప్పనలవికానిది.

ఈ మాసములో మధ్యరోజైన పౌర్ణమి అత్యంత శుభప్రదమైనది. కార్తీక పూర్ణిమ నాడు శంకరుడు త్రిపురాసురుణ్ణి వధించిన రోజు. అందువలన ఈరోజును త్రిపుర పూర్ణిమ అనికూడా పిలుస్తారు. కార్తీకమాసం నెలరోజులు చేసే పూజలన్నింటి కంటే కార్తీకపౌర్ణమి నాడు చేసే పూజకు ఫలితము అధికముగా వుంటుంది. కార్తీక పౌర్ణమి నాడు చేసే పౌర్ణమి అరుదైన పర్వదినంగా పేర్కొనవచ్చును. ఈరోజు శివాలయంలో ఈశ్వరునికి నవరసాలతో, పంచామృతాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. తదనంతరం లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చనలను నిర్వహిస్తారు. ధాత్రీపూజను కూడా చేస్తారు. తులసి మొక్కకి, ఉసిరి చెట్టుకి వివాహం చేసినట్లయితే లక్ష్మీనారాయణుల ఆశీర్వచనం లభిస్తుంది. ఉసిరి చెట్టు లభ్యం కాకపోతే కనీసం ఉసిరి కొమ్మనైనా తులసి కోటలో వుంచి పూజిస్తే మంచిది.

కార్తీక శుద్ధ పౌర్ణమి సాయంత్రము సంధ్యాసమయంలో శివాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. ఎండు గడ్డితో తాడును తయారుచేసి ఆలయం ముంగిట తోరణంగా అమర్చి దానిని ఆవునేతి దీపంతో వెలిగిస్తారు. పార్వతీపరమేశ్వరులను పల్లకీలోనుంచి ఈ తోరణం నుండి మూడుసార్లు ఊరేగిస్తారు. ఆ పల్లకీని అనుసరించి భక్తులందరూ ముక్తకంఠంతో శివనామ జపం చేస్తూ ప్రదక్షిణలు చేస్తారు. అనేక జన్మలనుండి చేసిన పాపాలన్నీ పటాపంచలయి, ఆనందము కలుగుతుందని శాస్త్రవచనం. ఈ పౌర్ణమి రోజు అరుణాచల క్షేత్రములో అఖండ జ్యోతి వెలిగిస్తారు. ప్రాముఖ్యత గలిగిన ఈ జ్యోతి దర్శనానికి అనేక రాష్ట్రాలనుండి భక్తులు వస్తారు.

ఈ మాసవారాలలో సోమవారానికి ప్రత్యేకత ఉంది. సోమవారానికి చంద్రుడు అధిపతి. దేవతలలో ప్రథముడైన అగ్ని నక్షత్రాలలో మొదటిదైన కృత్తికకు అధిపతిగా ఉండటం, చంద్రుడు పూర్ణుడై ఈ నక్షత్రం మీద ఉండటం వల్ల మాసంలోని సోమవారాలకు విశిష్టత కలిగింది. చంద్రుని వారమైన ఈ సోమవారం శివునికి ఎంతో ప్రీతికరమైనది. శైవభక్తులు ఈ మాసంలో ముఖ్యంగా సోమవారాలలో భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో శివుణ్ణి ఆరాధిస్తారు. ఈ సోమవార వ్రతవిధి ఆరు రకాలుగు ఉంటుంది. అవి – ఉపవాసము, ఏకభుక్తము, నక్తము, అయాచితము, స్నానము, తిలదానము.

శివకేశవులకు ప్రీతికరమైన మాసం కాబట్టి ఈ మాసంలో చేసే పూజలు వారిరువురి అనుగ్రహం కలిగిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో శివార్చన చేసినవారికి గ్రహదోషాలు, ఈతిబాధలు ఉండవు. శివాలయములో ప్రార్థన, లింగార్చన, బిల్వార్చన వంటి పుణ్య కార్యములు ఆచరించుట ఈ మాసంలో విశేష ఫలాన్ని ప్రసాదిస్తాయి. ఏక భుక్తము లేక కొన్ని విశేష దినములలో ఉపవాసములు, నిత్యము తులసి దగ్గర దీప ప్రజ్వలన, యథాశక్తి దాన ధర్మములు, దీప దానము మున్నగునవి అత్యంత శుభప్రదములు. ఈ మాసం వివిధ వ్రతాలకు శుభప్రదమైంది. ఈ నెల రోజులు హరిహరులకు విశేషార్చనలు చేస్తూ "కార్తీకనత్తాళ్" అనుసరించి తరిస్తారు.

"హరిః ఓం నమస్తే అస్తు భగవన్విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాలాగ్నికాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః" అనే రుద్ర నమకం మంత్రభాగం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. శివాలయములు, జ్యోతిర్లింగ క్షేత్రములు భక్తులతో నిండిపోతాయి.

కార్తీక పురాణ పఠనము ఎంతో ప్రసిద్ధి చెందినది. రోజుకొక్క అధ్యాయము పఠించి, దానిలోని ఆంతర్యమును గ్రహించి, ఆచరించినవారి జన్మ ధన్యతచెందుతుంది. ఈ పురాణ పఠనములో మనకు ఎన్నో విలువైన విషయాలు తెలుస్తాయి. దీపదాన మహాత్మ్యము, దీపప్రజ్వల విధివిధానములు, వనభోజన ప్రాశస్త్యము, అర్చన విధివిధానములు, ఎందరో భక్తుల జీవిత గాథలు, నదీస్నాన విశేషములు మున్నగునవి మానవులకు మార్గనిర్దేశము చేస్తాయి.

అత్యంత ఫలప్రదమైన ఈ కార్తీక మాసమును భక్తి శ్రద్ధలతో ఆచరించి మన సంప్రదాయ విధివిధానాలను ముందు తరాలకు పదిలపరచి లోకక్షేమానికి కృషిచేద్దాం. మన హిందూ పండుగలలో, ఉత్సవాలలో ఆధ్యాత్మిక తత్త్వంతో పాటు లోక కల్యాణము, ప్రకృతి పరిరక్షణ వంటి విజ్ఞాన విషయాలు కూడా దాగివుంటాయి.

★★★

# నరకాసుర సంహారం

– ఎస్.ధర్మారావు



శ్రీహరి ఉగ్రమూర్తిగా ఉన్నప్పుడు భూదేవి ఆయనను అసురవేళ సమయంలో పొందగా పుట్టినవాడు నరకుడు. అసుర స్వభావము కలిగినవాడై సర్వదేవతల మీద వైరం పెంచుకొని వారిని వేధించసాగాడు. అందుచే ఇంద్రుడు నరకుని బారినుండి దేవతలను రక్షించవలసినదని శ్రీకృష్ణుని ప్రార్థించాడు. సరే అని శ్రీకృష్ణుడు నరకాసుర సంహారానికి సన్నద్ధుడైనాడు. సత్యభామ ఈ విషయం తెలుసుకొని శ్రీకృష్ణునితో పాటు తానూ యుద్ధానికి వస్తానని హఠం చేసింది. అలా వెంబడిస్తున్న సత్యభామకు శ్రీకృష్ణుడు యుద్ధము యదార్థ స్థితిని ఇలా వివరించాడు.

సీ. సమద పుష్పంధయ ఝుంకారములు కావు
    భీషణ కుంభీంద్ర బృంహితములు
వాయు నిర్గత పద్మ వనరేణువులు కావు
    తురగరింఖా ముఖోద్ధూత రజము
లాకీర్ణ జలతరు గాసారములు గావు
    శత్రుధనుర్ముక్త సాయకములు
కలహంస సారస కాసారములు గావు
    దనుజేంద్ర సైన్య కదంబకములు
తే.గీ కమల కల్హార కుసుమ సంఘములు గావు
చటుల రిపు శూల ఖడ్గాది సాధనములు
కన్య! నీవేడ రణరంగగమనమేడ
వత్తు వేగమ నిలువుము వలదు వలదు

యుద్ధరంగంలోని దృశ్యాలు చాలా భీతావహంగా ఉంటాయని రావద్దని చెప్పినను ఆమె ప్రాణనాథా! నీ భుజస్కంధాలనే దుర్గంలో సురక్షితురాలవైన నన్ను దైత్య దానవాది శత్రువులు ఎందరైనా ఏమి చేయగలరు? అని అతనిని సమ్మతింప చేసి ఆయనతో పాటు గరుడ వాహనంపై బయలుదేరింది. నరకాసురుని రాజధాని చాలా బందోబస్తు కలిగిన నగరం. దానిపేరు "ప్రాగ్జ్యోతిషపురం". దాని చుట్టూ గిరిదుర్గం ఉంది. వేగంగా ప్రవహించే నదులున్నాయి.

ఎల్లప్పుడూ కార్చిచ్చు మండుతూ ఉండే అడవులు దానిని చుట్టుకొని ఉన్నాయి. దానిని మించి ఎందరో యోధానుయోధులు ఆ నగరం చుట్టూ పహారా తిరుగుతూ ఉంటారు. ఆ పైగా ఎలాంటి వారినైనా బంధించివేసే మురారి సుతుల పాశాలు ఉన్నాయి. ఇన్నింటిని దాటి దానిలో ప్రవేశించడం సాధ్యం కాదు. గరుడ వాహనంపై ఎక్కి ఈ ఆవరణాలన్నీ అవలీలగా దాటారు సత్యభామ, శ్రీకృష్ణులు. శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని పూరించగా – శత్రు భయంకరమైన ఆ శబ్దమును విని – గాఢ నిద్ర చాలించి నీలిగి లేచిన మురాసురుడు వచ్చి శ్రీకృష్ణుని ఎదుర్కొని గరుడునిపై శూలమును విసిరాడు. ఆ శూలాన్ని

ఒడిసి పట్టుకొని చెరకు ముక్కలా విరిచేశాడు. వెంటనే సుదర్శన చక్రముతో మురుని శిరస్సును ఖండించాడు.

మురాసురుని మరణం విన్న నరకుడు తన సేనానులు తామ్రుడూ, అంతరిక్షుడూ, శ్రవణుడూ, విభావసుడూ, నభస్వంతుడు, అరుణుడు అనే ఆరుగురు మురుని కుమారులను శ్రీకృష్ణుని పైకి పంపించాడు. వారినందరినీ శ్రీకృష్ణుడు అవలీలగా ఖండించివేశాడు. అపుడు గత్యంతరం లేక లోక భయంకర రూపంతో నరకాసురుడే స్వయంగా యుద్ధానికి వచ్చాడు. వచ్చి గరుత్మంతుని మూపుపై మెరుపుతో కూడిన నీలమేఘం మాదిరిగా ఉన్న సత్యభామతో ముచ్చటలాడుచున్న శ్రీహరిని చూచి తన యోధుల మరణానికి క్రోధించి తన గజబలాన్ని శత్రువుల మీదికి పురికొల్పాడు. అపుడు సత్యభామ హఠాత్తుగా లేచి –

**శా ॥ వేణిం జొల్లము వెట్టి సంఘటిత నీవీ బంధయై భూషణ**
**శ్రేణిం దాల్చి ముఖేందు మండల మరీచీ జాలముల్ పర్వగా**
**బాణిం బయ్యెద జక్కగా దురిమి శుంభద్వీర సంరంభయై**
**యేణీలోచన లేచినిల్చెదన ప్రాణేశాగ్ర భాగంబునన్**

వేణి గట్టిగా ముడివేసుకున్నది. చీర చక్కగా సవరించుకుని నగలు సరిదిద్దుకుని యుద్ధం చేయాలని సరదా పడుతూ ఉంటే 'అబలా' అంటూ శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

**కం. లేమా దనుజుల గెలవగ**
**లేమా నీవేల గడగి లేచితివిటు రా**
**లే మాను మానవే నిన్**
**లేమా విల్లందుకొనుము లీలంగేలన్**

అని ఆమె వీర వేషానికి ముగ్ధుడై మందహాసంతో తన వింటిని ఆమెకు అందించాడు. ఆ వింటితో పాటు నూత్నబలం ఆమెలోకి ప్రవహించింది. ఆమె రెట్టించిన ఉత్సాహంతో ధనుస్సును ఎక్కుపెట్టి నారిని మ్రోగించింది. వెనువెంటనే రాక్షస స్త్రీల మంగళసూత్రాలు తెగిపోయాయి. నరకుని గజబలాలు డీల్లపడి మూర్ఛ చెందాయి. భర్తకు శ్రమ లేకుండా తానే రాక్షస బలాన్నంతటినీ రూపు మాపాలనే ఉత్సాహంతో తాను అబలననీ, శత్రువులు ఘోర రాక్షసులని కూడా మరచిపోయింది. ఆమె చేసిన ధనుష్టంకారంతో ఆమె చేతి కంకణాల గలగలలు శ్రుతి కలిపాయి. మణికుండలాలు చెక్కుటద్దాల కాంతులు కలిసిపోయాయి. వింటిలో బాణం సంధించడం, వింటిని నారిని లాగడం ఎవరికీ తెలియనంత వేగంగా వీర శృంగార రసాలు మూర్తి దాల్చిన స్త్రీ రూపమా అనేటట్లు ఆమె యుద్ధం చేసి చూచేవారిని ఆశ్చర్యపరిచింది.

ఆ రూపంలోని సత్యభామను చూస్తుంటే శ్రీకృష్ణుని మనస్సు సతీ ప్రేమతో ఆమె శ్రమపడుతుందని జాలితో ఆమెను మెచ్చుకొని అపూర్వమైన ఆనందానుభూతిని పొంది శ్రీకృష్ణుడిలా ఆశ్చర్యంతో చూస్తూ ఉండగా ఆమె వింటినారి మ్రోతలా ఉరుములుగా, దేవతలు సారస పక్షులుగా చేతి విల్లు ఇంద్రధనుస్సుగా శ్రీకృష్ణుడే మేఘంగా తాను శంపాలతగా (మెరుపుతీగ) శరాలే వర్షధారలుగా ఆ వర్షంలో మునిగిపోతున్న కార్చిచ్చుగా, వర్షాకాలమును కల్పించింది. ఇలా కొంతసేపు ఆమె యుద్ధం చేసేసరికి సత్యభామ ఎదుట నిలువలేక రాక్షస సైన్యం నరకాసురుని మరుగుకుపోయింది. అపుడు శ్రీకృష్ణుడు సత్యభామను ప్రశంసించి ఆమెను విశ్రాంతి తీసుకొనుమని ఆమె చేతిలోని విల్లు అందుకున్నాడు.

శతఘ్ని అనే దివ్యాస్త్రాన్ని శ్రీకృష్ణుడు రాక్షసునిపై ప్రయోగించగానే దానినుండి అనేక శరాలు, గదలు, శూలాలు, చక్రాలు వంటివి ఎన్నో పుట్టి శత్రుసేనలోని ఏనుగులను, రాక్షస వీరుల శరీరాలను ఖండ ఖండాలు చేయగా హతశేషులు ఆర్తనాదాలు చేస్తూ తలోదిక్కుకు పారిపోయారు. గరుత్మంతుడు కూడా సత్యభామను, కృష్ణుని వీపు మీద మోస్తూనే తన కాలిగోళ్ళతోను, రెక్కలతోను, చంచుపుటాలతోను శత్రుసేనలోని ఏనుగులను పీనుగులుగా చేశాడు. ఆ పక్షి రాజు రెక్కల గాలికి తాలలేక నరకుని సైనికులు పారిపోయి కకావికలైనారు. దానికి ఆగ్రహించిన నరకుడు శక్తి అనే ఆయుధాన్ని గరుత్మంతుడిపై ప్రయోగించాడు. అది వైనతేయుణ్ణి ఏమీ చేయలేదు సరికదా దాని దెబ్బ ఏనుగును ఓ పూలమాలతో కొట్టినట్లుగా ఉంది అతనికి.

నరకాసురుడు విజృంభించి ఒక శూలం చేత ధరించి కృష్ణుని పైకి ప్రయోగించబోయాడు. ఇంతలోనే శ్రీకృష్ణుడు సుదర్శన చక్రమును ప్రయోగించగా, ఆ నరకాసురుని తల తెగి నేలపై పడింది.

ఆకాశంలో ఎదురు చూస్తున్న దేవతాగణమంతా ఒక్కసారి ఆనందం పట్టలేక అబ్బా! ఎన్నాళ్ళకు నరకుని పీడ విరగడయింది అని పుష్పవృష్టిని కురిపించి శ్రీకృష్ణుని పొగిడారు.

అంతలోనే భూదేవి స్త్రీరూపంలో శ్రీకృష్ణుని చెంతకు వచ్చి నరకుడు అంతకుముందు అదితి నుండి హరించిన రత్నకుండలాలు, వైజయంతి అనే పూలమాలను, ఒక తెల్ల గొడుగునూ, ఒక అనర్ఘ రత్నాన్ని సమర్పించి అతనికి వందనం ఆచరించి స్తుతించింది.

ఇలా ప్రార్థించి ఓ లోకేశ్వరా! ఇదుగో వీడు నరకపుత్రుడైన భగదత్తుడు. బాలుడగుటచే నీకు భయపడుతున్నాడు. వీడు తండ్రి వలె దుర్మార్గుడు కాడు. కనుక వీడిని అనుగ్రహించు అని వేడుకుంది. ఆమె కోరిక మేరకు శ్రీకృష్ణుడు అతన్ని మన్నించి ఆదరించి రాజ్యానికి అతణ్ణి రాజుగా అభిషేకించి నరకుని రాజమందిరంలోకి వెళ్ళాడు.

అంతవరకు నరకుని చెరలో బందీలై ఉన్న పదహారువేల మంది రాజకుమార్తెలను విడిపించగా వారంతా శ్రీకృష్ణునే వరించారు. వారినందరినీ రక్షక బృందంతో పాటు ద్వారకకు పంపించాడు.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

## 330. రాసక్రీడా పరాయణాయ నమః

రాసక్రీడ అనగా శృంగార రసమయమైన కుండల నృత్యము చేయుచు ఆనందించుట.

**అవి శారద రాత్రులుజ్జ్వల లసత్తరతారకహారపంక్తులం**
**జారుతరంబులయ్యె వికసన్నవ కైరవగంధబంధురో**
**దార సమీరసౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క**
**ర్పూరపరాగ పాండురుచిపూరములంబర పూరితంబులై ॥**

కర్పూరపు పొడివలె ఆకాశమంతటా వ్యాపించి యున్న చంద్రుని వెన్నెలలతో మిక్కిలి సొగసుగా శరద్రాత్రులు ఉన్నాయి. ఆ శరద్రాత్రి పున్నమివేళ యమునా నదీ తీరములోని బృందావనములో జరిగిన గోపికా కృష్ణుల రాసక్రీడా వైభవము. విప్రనారాయణ చలన చిత్రములో చిత్రింపబడి ఉన్నది. దర్శించండి.

గోపికా కృష్ణుల రాసక్రీడా వైభవమును కీ.శే. సముద్రాల రాఘవాచార్యులు (మా తండ్రి, సముద్రాల అక్క చెల్లెళ్ళ కుమారులు) విప్రనారాయణ చలనచిత్రములో రసరామణీయకమైన అద్భుత దృశ్య కావ్యంగా రచించినారు. రాసక్రీడను వారివలె సులభ గ్రాహ్యమైన శైలిలో రసరమ్యంగా రచించినవారు లేరు. ఆ పాట పరిమళమును ఆస్వాదించండి.

పల్లవి॥ చూడుమదే చెలియా! కనులా
బృందావనిలో నందకిశోరుడు
అందముగా దీపించే లీలా ॥ చూడు ॥
మురళీకృష్ణుని మోహన గీతికి
పరవశమైనవి లోకము లే
విరబూసినవీ పొన్నలు పొగడలు
పరిమళము మెగసెను
మలయానిలముల సోలెను యమునా ॥ చూడు ॥
నారీ నారీ నడుమ మురారి
హరికీ హరికీ నడుమ వయారీ
తానొకడైనా తలకొక రూపై
మనసులో దోచే రాధా మాధవ కేళీ నటనా ॥ చూడు ॥

''నారీ నారీ నడుమ మురారీ హరికీ హరికీ నడుమ వయారీ'' అను భావమునకు లీలా శుకుడు రచించిన శ్రీకృష్ణ కర్ణామృతములోని

**"అంగనా అంగనా మంతరే మాధవో మాధవం మాధవం చాంతరేణాంగణా"**

అను శ్లోకము స్ఫూర్తిగా ఉంది.

కృష్ణుడు గోపికా వస్త్రాపహరణ సందర్భమున గోపకన్యలారా! మీ కాత్యాయనీ వ్రతము ఫలించింది. రానున్న శరద్రాత్రుల యందు నాతో విహరించెడు భాగ్యము నేను మీకు ప్రసాదించెదను అని చెప్పి యున్నాడు. శరద్రాత్రులు వచ్చినవి. అంత కృష్ణుడు అచింత్య మహాశక్తి యగు తన యోగమాయను ఆశ్రయించి, గోపికలను నిమిత్త మాత్రముగా జేసికొని రాసక్రీడలను నెరపుటకు సంకల్పించినాడు. అది శరత్ పున్నమి నాటి రాత్రి ఉదయించిన పూర్ణ చంద్ర బింబము యొక్క చల్లని కిరణముల స్పర్శతో వనమంతయు రాగ రంజితమై కలకలలాడు చుండెను. ఆ వెన్నెల శోభను వన రామణీయకమును, మనోహర వాతావరణమును చూచి కృష్ణుడు గోపకన్యల మనస్సులు పారవశ్యము పొందునట్లు మధురముగా వేణుగానము చేసినాడు. కృష్ణుని యందే లగ్న మనస్కులైన వారు కృష్ణుని మురళీ రవమును విన్నంతనే ఒడలు మరచి దేనిని లెక్కచేయక ఎవరికి వారే పరుగు పరుగున తోటి వారిని కూడ పిలువకయే అందరు కృష్ణుని చేరినారు.

అంత కృష్ణుడు గోపకన్యలపై ప్రేమ దృష్టిని ప్రసరించి వారికి ఆనందము కలిగించినాడు. పిమ్మట వారందరితో కూడి కృష్ణుడు వేణుగానము చేయుచు మధ్యలో నుండగా మండలాకారమున నున్న ఒకరి భుజములపై మరి యొకరు చేతులు వేసికొని తిరుగుచుండగా రాసోత్సవము కొనసాగింది. అప్పుడు కృష్ణుడు చిత్రమగు రీతిలో పెక్కుమంది కృష్ణులుగా మారి ప్రతి ఇద్దరి గోపికల మధ్య తానొకడై వారి భుజములపై తన చేతులు వేయుచు రాసలీలలను నెరవేర్చెను. ఆ రాసక్రీడలు గోపికా కృష్ణుల మధ్య పలువిధములైన ముఖ భంగిమలతో, కంఠా శ్లేషములతో, హస్తవిన్యాసములతో, పాద విక్షేపములతో వైభవోపేతముగా విరాజిల్లింది. ఆ సంతోష సమయమున ప్రతి గోపికయు కృష్ణుడు తనతోడనే కూడి యున్నాడని భావించుచు ఆనందముగ మునిగి తేలుచుండిరి. పిమ్మట ఆ రాసక్రీడా మండలమునందు గోపికలు అందరు తమకు ప్రియతముడైన కృష్ణునితో కూడి వివిధ రీతులలో నృత్యములు చేయసాగిరి. అప్పుడు వారి ముంజేతి కంకణముల గల గలలు, కాలి యందెల సవ్వడులు ఒడ్డాణముల యందలి చిరుగజ్జెల మోతలు ఒక్కుమ్మడిగా నినదించుచు వీనుల విందు చేయుచుండెను. గోపికలు కృష్ణునితో కూడి నెరపుచున్న రాసలీలలు అద్భుతములు దర్శనీయములు, హృదయంగమములుగా నుండెను.

రాసక్రీడ యందు ఆసక్తి గల్గి యున్న కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 331. పురుషోత్తమాయ నమః

పురుష + ఉత్ + తమః = పురుషోత్తమః

సామాన్య చేతనుల కంటె, ముక్తులకంటెను, నిత్యముక్తులైన అనంత గరుడాదుల కంటెను విలక్షణుడైన ఉత్తముడైన వాడు కృష్ణుడు. ఇతర పురుషులందరికంటె అత్యంత శ్రేష్ఠుడు అని అర్థము.

స్వాభావికముగ ఏ దోషములు అంటక పోవుట చేత, సర్వత్ర వ్యాపించుట చేత, సర్వమును ధరించుట చేత, స్వామిత్వము చేత భగవంతుడు (విష్ణువు) సర్వాధికుడని ఈ నామము తెలుపుచున్నది.


**యస్మాత్ క్షర మతీతోహం అక్షరాదపిచోత్తమ ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమ ॥ గీత 15–18**

–క్షరమైన శరీరమునకు, అక్షరమైన జీవునకు కూడ అతీతమైనవాడు పురుషోత్తముడు. లోకములందు కూడ అతీతమైనవాడు పురుషోత్తముడు. లోకములందు, వేదములందు ఈ పేరు ప్రసిద్ధమైంది, పురుషాన్నపరం కించిత్ అందుకే సర్వమూ భగవంతుడే.

పురుషేభ్యః ఉత్తమః అను విగ్రహ వాక్యము ననుసరించి ఇది పంచమీ తత్పురుష సమానమైనది. ఈ పురుషోత్తమ పదమును (సమాసమును) పురుషాణాం ఉత్తమః అని విగ్రహ వాక్యము చెప్పుట సరికాదు. భగవద్గీతలోని 15వ అధ్యాయమున ఈ పురుషోత్తమత్వము అత్యంత గుహ్యతమ శాస్త్ర విషయముగా నిరూపించబడింది.

పురుషోత్తముడైన విష్ణుదేవుని అర్చామూర్తియగు వేంకటేశునకు నమస్కారము.

ఈ పురుషోత్తమ నామము విష్ణు సహస్ర నామములలో 24 సంఖ్యతో వున్నది.





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

# దీపావళి దానధర్మాల పండుగ

– బి.వి.రామకృష్ణయ్య,
సిద్ధాంతి



**"ఓం దీపం జ్యోతి పరంబ్రహ్మ దీప సర్వ తమోపహం
దీపేన సాధ్యంతే సర్వం సంధ్యా దీప నమోస్తుతే"**

**దీపావళి పర్వంతో అనేక సంప్రదాయాలు, పురాణ గాథలు, చరిత్ర ముడిపడి ఉన్నాయి. దేశం యావత్తు మహాపర్వంగా ఆచరించే పవిత్ర వేడుకలో దాగిన కథలు నిరంతరం ధర్మసందేశాలను అందిస్తూనే ఉన్నాయి.**

లోక కంటకుడైన నరకాసురుని శ్రీకృష్ణుడు సంహరించిన ఘట్టం ఈ పర్వంతో అనుసంధానితమై ప్రసిద్ధి చెందింది.

నిజానికి నరకాసురునితో యుద్ధాన్ని నేటి పరిభాషలో ''అంతరిక్ష సమరం''గా అభివర్ణించవచ్చు. నరకుడు భూదేవికి పుత్రుడు. అంటే ఒక గ్రహశకలాన్ని ఆధారంగా చేసుకొని, భూవాసులను క్షోభ పెట్టిన అసురశక్తిగా భావించవచ్చు. అతని స్నేహితుడు, రక్షకుడు ''ముర'' అనే మరో రాక్షసుడు. ఆనాడు జరిగిన యుద్ధాన్ని పురాణాలు వర్ణించిన ప్రకారం చూస్తే – అది భూమికి చెందిన సామాన్య రణం కాదు.

అందుకే ఆ యుద్ధానికి శ్రీకృష్ణుడు గరుత్మంతుని వాహనంగా తీసుకొని వెళ్ళాడు. లోకాంతరమైన స్వర్గానికి కూడా పీడ కలిగించినవాడు నరకుడు. ''నరులను బాధించేవాడు'' అని ఆ పేరుకు అర్థం. అతడి కృత్యాలను బట్టి ఈ పేరు ప్రసిద్ధి చెందింది.

మానవుడిగా అవతరించినప్పటికీ, పరిపూర్ణ నారాయణ తత్త్వం కలిగిన భగవానుడు శ్రీకృష్ణుడు. కనుకనే విశ్వనియమ రక్షణ చేసే విష్ణు ధర్మ ప్రకారంగా ఈ అసుర శక్తుల్ని నియంత్రించడానికి సన్నద్ధుడయ్యాడు.

ప్రజాహితానికి ప్రమాదం కలిగించే రాక్షసుని సంహరించడానికి భూదేవి కూడా అనుమతించింది. పుత్రుడైనా సరే, విశ్వహితానికి విఘాత కారకుడైనందుకు ఆ తల్లి మాతృప్రేమను సైతం త్యజించి, నరక నాశనానికి ఆమోదించింది. ఆ ఆమోదానికి సూచనగానే భూదేవి అంశతో జనించిన సత్యభామాదేవి, వాసుదేవునితో పాటు రణరంగానికి వెళ్ళింది. పరమాత్మ చేసిన అసుర సంహారానికి తానే సాక్షిగా, సహకారంగా నిలబడింది.

భూమిపై ప్రాగ్జ్యోతిష పురాన్ని కేంద్రంగా చేసుకుని, దుష్కృత్యాలను సాగించాడు నరకుడు. ఎందరినో సంహరించాడు, బంధించాడు, మాన, ప్రాణ, ధన భంగాలను చేశాడు.

జగద్రక్షణకై అవతరించిన జగన్నాథుడు – ఆ విద్రోహ స్వరూపాన్ని విధ్వంసం చేశాడు. ముందుగా అడ్డుకొన్న మురాసురుని సంహరించి ''మురారి''గా కీర్తి పొందాడు.

దేవతలు, భూదేవిని – మాధవుని ప్రస్తుతించారు. నరకుడిచే బంధితులైన పదహారు వేల మంది రాచకన్యలను విడిపించి, వారికి క్షేమంకరమైన సుస్థితిని కల్పించదలిచాడు శ్రీకృష్ణుడు. వారంతా పరమాత్మునిదే తమకు రక్షణ స్థానమని ప్రార్థించారు. భూదేవి మాట మేరకు, మాధవుడు తన యోగశక్తితో వారందరికీ తానే దిక్కై

భద్రమైన వ్యవస్థను కల్పించి ఆదుకున్నాడని భాగవత కథ.

ఈ విశ్వరక్షణ లీల ఈ దీప పర్వంతో అనుబంధంగా ఉంది. మరొకవైపు శ్రీకృష్ణుడికి పూర్వం నుంచే ఈ పర్వం ఆచారంలో ఉన్నట్లుగా ధార్మిక గ్రంథాల ప్రమాణం ఉంది. మానవులకు మృత్యుబాధలు లేకుండా అనుగ్రహించే శుభవేళగానూ దీన్ని వ్యవహరిస్తారు. ధర్మాధర్మాలకు ఫలప్రదాత అయిన యముని ఈ సందర్భంలో తర్పణాల ద్వారా ప్రార్థనల ద్వారా తృప్తి పరచి బాధా నివారణ చేసుకునే పద్ధతులు దీనిలో ఉన్నాయి. తమ పూర్వీకులు సద్గతులు పొందాలని, జ్యోతిర్మయ లోకాలకు దారిచూపే దీపదానం ఆచారం.

ఇంకొక ఆనవాయితీగా – దీపజ్యోతిని, ధనలక్ష్మిని పూజిస్తారు. ధనాధిపతి అయిన కుబేరుని, అతడిని ఆ స్థానంలో ఉంచి అనుగ్రహించిన మహాలక్ష్మీ మాతను ఆరాధించడం ముఖ్యాచారం. "ధనలక్ష్మి" అనడంలోనే అద్భుత భావం ఇమిడి ఉంది. సుఖాన్నిచ్చే సాధనంగా మాత్రమేకాక, అనుగ్రహ స్వరూపంగా, పవిత్రరూపంగా ధనాన్ని చూడాలి అని పెద్దల ఉద్దేశం.

"పవిత్ర"త అనగానే – ధనాన్ని సంపాదించడంలోనూ, వినియోగించడంలోనూ కూడా ధర్మం, న్యాయం ఉండాలి... అనే అంతరార్థం ప్రస్ఫుటంగా ఉంది. అలా సంపాదించిన ధనమే "ధనలక్ష్మీదేవి"గా మనల్ని సుఖ శుభమయ జీవన మార్గంలో పయనింపచేస్తుంది. లేని పక్షంలో శిక్షా రూపంగా నరకానికి (బాధకు) గురి చేస్తుంది. ధర్మనిర్ణేత అయిన యమధర్మరాజు దక్షిణ దిక్పాలకుడు. ధన ప్రదాత అయిన కుబేరుడు ఉత్తర దిక్పాలకుడు. ఈ ఉత్తర దక్షిణ దిక్పాలకులకు జన్మ అనుబంధం – ధనానికి – ధర్మానికి ఉన్న సమన్వయం. ధర్మధనాన్ని నియంత్రించాలి – అర్చనలోనూ, వ్యయంలోనూ, వీరిరువురికీ ఆ శక్తినిచ్చిన పరాశక్తి నరకచతుర్దశినాడు మహాకాళీదేవిగా, అమావాస్యనాడు లక్ష్మీరూపంగా పూజలందుకుంటోంది. కాలశక్తి మన ధర్మాధర్మాలను గమనిస్తున్న దేవి. మన అవసరాలకు తగిన ఐశ్వర్యాన్ని ప్రసాదించే, ఆ తల్లి మరోరూపమే మహాలక్ష్మి. సరైన కాలంలో సరైన ఐశ్వర్యం, ధర్మమయంగా సంప్రాప్తించాలనే ఆకాంక్ష, సాధన... దీపావళి గాథల్లో వేడుకల్లో మానవజాతికి అందిస్తున్న సంకేతాలు.

నరకుడు చంపబడటం వల్ల ఆ పీడ వదిలినందుకు ఆ సమయంలో తలంటుకోవడం ముఖ్యమైంది. ఈ పండుగ సందర్భంగా కాల్చే టపాకాయలు మున్నగునవి, నరకాసురుడి మీద ఉపయోగించిన మారణాయుధాలకు చిహ్నాలు.

దీపం సకల శుభాలకు, సౌభాగ్యాలకు, జ్ఞానానికి, వెలుగుకు సంకేతం. దీపం వెలిగిన చోట శ్రీమహాలక్ష్మి కొలువై ఉంటుందంటారు. దీపారాధన చేయడమంటే శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించడమే.

**దీపము కలిగిన ఇంటన్**
**దాపున శ్రీలక్ష్మి చేరి ధనమును ఇచ్చున్**
**కాపాడుచుండు మనలను**
**పాపమ్ములు కడకు తొలగి భద్రములొసగున్!**

అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి వివేకవంతమైన జ్ఞానం ప్రసాదించే వరప్రదాయినిగా దీపాన్ని ఆరాధిస్తాం. దీపం నుండి వెలువడే లేత ఎరుపు, నీలి, పసుపు రంగులను ముగురమ్మలకు ప్రతీకలుగా భావిస్తారు. దీపం సర్వదేవతా స్వరూపిణి అని విశ్వసించడానికి గల తార్కాణం, హిమాచల్ ప్రదేశ్ లోని జ్వాలాదేవి ఆలయం. నూనె, వత్తులు లేకుండా వెలిగే అఖండ దీపం ఆ ఆలయంలో ఉంది. తంత్ర చూడామణిలో ఈ దేవి మహిమ వివరంగా ఉంది. వెలుగులో చేసే పనులన్నీ సత్కార్యాలుగా మహాత్ములు అభివర్ణిస్తారు. జాతిని జాగృతం చేసే చైతన్య కిరణాలు దీపకాంతి నుంచే ఆవిష్కృతమవుతాయి.

మానవ శరీరం మట్టితో చేసిన ప్రమిద అని, ప్రాణం ప్రకాశించే జ్యోతి అని, ఆధ్యాత్మిక సాధన, ఆ ప్రమిదలో పోసే తైలమని అందుకే భగవంతునికి భక్తుడు చేసే షోడశోపచారాల్లో దీప సమర్పణ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందని పౌరాణికులు చెబుతారు. దీపకాంతి లోకానికి క్రాంతి, శాంతి ప్రసాదించి, భ్రాంతిని తొలగిస్తుందని హైందవ సంప్రదాయ విశ్వాసం. జ్యోతి ప్రకాశనం దివ్యలోక సాయుజ్యానికి దారి చూపుతుందంటారు. దీపం ఎప్పుడూ పై దిశ వైపే చూస్తుంది. అలాగే మనిషి ఉన్నత స్థితికే వెళ్ళేందుకు ప్రయత్నించాలన్నది దీపం ఇస్తున్న సందేశం.

వేదాంత పరంగా, దీపావళి అనగా దీప + ఆవళి = దీపావళి. దీపముల సమూహమునకు దీపావళి యని పేరు. నరకచతుర్దశి ముగిసిన తర్వాత దీపావళి పండుగ యగుచున్నది. చతుర్దశి యనగా పదునాలుగు 14. జ్ఞానేంద్రియములు 5 + 5 = మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం కలిసి = 14. ఇవి అన్నియు 14. పదునాలుగవదియే అహంకారమే నరకాసురుడు. అహంకారమును నశింపచేయుటయే నరకాసుర మర్దనము. పిమ్మట యమ తర్పణము చేయవలెను. అనగా అహంకారము లేనివానికి నరకమే లేదు. నరకమెప్పుడు లేదో యముడు కూడా లేనట్లే. జ్ఞాన దీపముచే అజ్ఞానమనెడి చీకటిని తాను పోగొట్టుకుని, ఇతరులకు పోగొట్టుటయే జ్ఞాన దీపదానము. మానవుల అజ్ఞానమే చీకటి ( అవిద్య). జ్ఞానమే దీపము (విద్య). అజ్ఞానానికి జ్ఞానోపదేశము చేయుటయే దీపదానము. దీపావళి అంతరార్థము.

"హరికిన్ పట్టపుదేవి పున్నెముల ప్రోవర్థంబు పెన్నిక్క,
చందురుని తోబుట్టువు, భారతగిరి సుతల్, తోనాడు పూబోణి,
తామరలయందుండేది ముద్దరాలు, జగముల్ మన్నించు నిల్లాలు,
భాసురతన్ లేములు బాపుతల్లి, సిరి యిచ్చున్ నిత్య కళ్యాణముల్"

**"హరిః ఓం తత్ సత్"**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

- రాళ్ళబండి శ్రీనివాసన్

గత సంచిక తరువాయి

లంకాధిదేవత (లంకిణి)ని హనుమంతుడు చంపలేదు. కొట్టాడు అంతే. లంకిణి అన్న పేరు ప్రయోగించలేదు వాల్మీకి. అది పౌరాణికులు వాడిన పేరు.

పిల్లి రూపం ధరించాడు హనుమంతుడు. అంతకంటే చిన్నరూపం లేదా అంటే వుంటుంది. చీకట్లో చూడగలది పిల్లి. ఆ చూపు కావాలనుకున్నాడు. అందుకే అద్భుత దర్శనః అన్నాడు వాల్మీకి వాయుపుత్రుణ్ణి. భౌతిక సుఖ లాలసుడు జీవుడు. వాడిది బాహ్య దృష్టి. అది అంధకారమయం (అజ్ఞానం). అంతర్ దృష్టి కావాలి. అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు. ఆ స్వామి దర్శనం కోసం తపించాలి జీవుడు. అదే జీవుని స్వరూపం (స్వస్వరూపం). అలౌకిక ఆనందం కోసం ఆరాటపడాలి. విషయ వాసనల్ని అహంకారాది అసుర సంపత్తిని అణచివేయాలి సాధకుడు. అదే జీవుని కర్తవ్యం. అదే జ్యోతిర్మయం (జ్ఞానం). అపుడే భగవదనుగ్రహ ప్రాప్తి. అదే జీవుని లక్ష్యం. గమ్యం.

రావణుని లంకను వర్ణించాడు వాల్మీకి. అక్కడ భవన సౌందర్యాన్ని ఐశ్వర్యాన్ని అడుగడుగునా వర్ణించాడు. బాహ్య సౌందర్యం భోగ సంపత్తి. భస్మమైపోతుంది. అందుకు లంకాదహన కాండ నిదర్శనం. అయోధ్యా నగరాన్ని ఇంతగా వర్ణించలేదు. అయోధ్యా వాసుల గుణగణాల్ని సాత్విక ప్రవృత్తిని



వర్ణించాడు. నైతిక విలువలుండాలి. ధర్మబద్ధమైన కామం ఉండాలి. శీలసంపత్తి ఉండాలి. అవే మానవుణ్ణి మహోన్నత స్థాయికి చేరుస్తాయి. ఆ విషయం అంతర్వాహినిగా చెప్పాడు వాల్మీకి.

చైత్ర శుద్ధ పంచమినాడు రామ వనవాస ప్రారంభం. పధ్నాలుగో సంవత్సరం చైత్రమాసంలో రామ సుగ్రీవుల మైత్రి. వర్షాకాలం ముగిశాక అశ్వీయుజ శుద్ధ దశమి – విజయ దశమి నాడు వానర సీతాన్వేషణం ప్రారంభం. ఫాల్గుణ మాసం శుద్ధ పౌర్ణమి – హనుమంతుని సీతా దర్శనం. బహుళ పాడ్యమి లంకా దహనం – ఇది కొందరి వ్యాఖ్యాతల అభిప్రాయం.

## నగర ప్రవేశం

లంకాధి దేవతని జయించాడు హనుమంతుడు. సింహద్వారం నుంచి ప్రవేశించలేదు. ప్రాకారం మీదుగా పోయాడు. దూకాడు. ఎడమకాలు మోపాడు. శత్రు గ్రామానికి కాని, నగరానికి కాని ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించరాదు. అది నీతిశాస్త్ర వచనం. శత్రువు శిరస్సుమీద ఎడమకాలు పెట్టినట్లుగా చేశాడు వాయుపుత్రుడు. గృహప్రవేశ సమయంలో వివాహ సమయంలో ఇతర శుభకార్యాల్లో కుడికాలు పెట్టాలి. అది బృహస్పతి వచనం.

అది రాత్రి సమయం. ఏడు గంటలు కావచ్చు. నగర ప్రవేశం చేశాడు మారుతి. రాజవీధుల్లో నడిచాడు. ఎటు చూసినా నృత్త గీత వాద్య ధ్వనులు స్త్రీ పురుషుల నవ్వులు అందమైన భవనాలు. కొన్ని పద్మాకారంలో ఉన్నాయి. కొన్ని స్వస్తిక్ ఆకారంలో ఉన్నాయి. అదొక పెద్ద భవనం. ఆగాడు. చూశాడు. దాని పేరు వర్ధమానం. గృహాలన్నీ పూలదండలతో అలంకరింపబడ్డాయి. ఇంటిలోకి పోయాడు. సీతమ్మని వెదుకుతున్నాడు. కొన్ని ఇళ్ళలో మంత్ర జపాలు జరుగుతున్నాయి. కొన్నింటిలో వేదాధ్యయనం సాగుతోంది. కొన్నింటిలో రావణ స్తోత్ర పారాయణాలు జరుగుతున్నాయి. కొందరు మంత్రగాళ్ళు కనిపించారు. అభిచార హోమాలు చేస్తున్నారు.

నగరం నడిబొడ్డున అపారమైన సేన. అది రావణుని మూలబలం. వివిధ ఆయుధాలు ధరించి వున్నారు. శతఘ్నులు ప్రయోగించేవారున్నారు. కొందరి రాక్షసుల ముఖాలు వికృతంగా ఉన్నాయి. వంకరగా ఉన్నాయి. కొందరు పొట్టి. కొందరు పొడుగు. కొందరు లావు. కొందరు సన్నం. కొందరికి ఒక కన్ను. ఒక చెవి. చిత్ర విచిత్ర రూపాల్లో ఉన్నారు. చిత్ర విచిత్ర వేషధారులై ఉన్నారు.

ఆ భవనాల మధ్య మరో పెద్ద భవనం. అది రాక్షస రాజు రావణుని భవనం. అదొక కొండ కొన మీద ఉంది. చుట్టూ ప్రాకారాలు ద్వారాలు అగాధమైన అగడ్తలు అంతఃపురం మధ్య వేలాది సైనికులు. అందరూ సావధానులై ఉన్నారు. రథాలు, గుర్రాలు, నాల్గుదంతాల ఏనుగులు అంతఃపురం ఆవరణలో నిలిచి ఉన్నాయి.

అది రావణ అంతఃపురం. ముక్తామణిమయం. కృష్ణాగరు చందనాది ధూప పరిమళ శోభితం. చడీ చప్పుడు కాకుండా అడుగు పెట్టాడు హనుమ. పిండారబోసినట్లుంది వెన్నెల. ఆ భవనంలో రాక్షసులున్నారు. స్త్రీలున్నారు. మగవాళ్ళు ఒకరినొకరు ఆక్షేపించుకుంటున్నారు. ఒకరి భుజాలపై మరొకరు చేతులు వేసుకుంటున్నారు. తాగిన మత్తులో ఉన్నారు. ఏదో మాట్లాడుతున్నారు. పరస్పరం భయపెట్టుకుంటున్నారు. ఛాతీలు విరుచుకుంటున్నారు. ప్రియురాండ్రపై పడుతున్నారు. కొందరు స్త్రీలు అంగరాదులు అలంకరించుకుంటున్నారు. కొందరు నిద్రిస్తున్నారు. కొందరు నవ్వుతున్నారు. కొందరు కోపంతో ఉన్నారు. కొందరు నిట్టూరుస్తున్నారు. కొందరు సరసాలాడుతూ ఉన్నారు. అందగాళ్ళున్నారు వారిలో. కొందరు వికృతరూపులున్నారు.

కొందరు స్త్రీలు పరిశుద్ధ స్వభావులుగా ఉన్నారు. కొందరు శృంగార చేష్టలు చేస్తున్నారు. కొందరు ప్రియుల్ని మద్యపానానికి పురికొల్పుతున్నారు. కొందరు ప్రియుల కౌగిళ్ళలో ఒదిగిపోయారు. కొందరు సిగ్గుపడుతున్నారు. సోపానాల మీదున్నారు కొందరు. ప్రియుల ఒడిలో కూర్చున్నారు. కొందరు రతి సమయంలో దిగంబరులై ఉన్నారు. బంగారు తీగెల్లా మెరిసిపోతున్నారు కొందరు. ప్రియుల్ని వెదుక్కుంటున్నారు కొందరు.

ఆ రాక్షసాంగనల్లో మనుష్య స్త్రీ వుందా? లేదా? స్త్రీల ముఖాలు చూస్తున్నాడు హనుమంతుడు. వాళ్ళ నేత్రాలు చూస్తున్నాడు. వేసుకున్న సొమ్ముల్ని చూస్తున్నాడు. కొన్ని సొమ్ముల ఆనవాళ్ళు చెప్పాడు రాముడు. అవి కనపడతాయని పదే పదే చూస్తున్నాడు. నిరాశ పడలేదు. వెదుకుతున్నాడు మారుతి. విమాన గృహాలు వెదికాడు మళ్ళీ. ప్రయోజనం లేకపోయింది.

సీతమ్మ ఎలా వుంటుందో చూడలేదు వాయుసుతుడు. ఊహించుకుంటున్నాడు. రామ విరహంతో పరితపిస్తుంటుంది. కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటుంది. గద్గద కంఠియై వుంటుంది. కంఠాభరణాలు కలదై వుంటుంది. మధురమైన కంఠస్వరం కలదై ఉంటుంది. కానరాని చంద్రరేఖలా వుంటుంది. కృశించి వుంటుంది. ఆ అయోనిజ సౌందర్యవతియై ఉంటుంది. ధూళి ధూసరితమై వుంటుంది శరీరం. బంగారు రేఖలా వుంటుంది. గాయం మానినా బాణపు గుర్తున్న దానిలా వుంటుంది. గాలికి చెదరిన మేఘరేఖలా వుంటుంది.

మరికొంత ముందుకు పోయాడు. ఒక అద్భుత భవనం కనిపించింది. అది సూర్యకాంతులతో తేజరిల్లుతోంది. ప్రాకారాలన్నీ సువర్ణమయం. సంపూర్ణ రాక్షస రక్షణలో ఉంది. ముఖద్వారం సువర్ణ రజత తాపడాలతో ఉంది. లోపలికి వెళ్ళాడు. మహాయోధుల గృహాలున్నాయి. మహారథుల నివాసాలున్నాయి. వారి రథాలు కనిపించాయి. రకరకాల పెంపుడు జంతువులు కనిపించాయి. రకరకాల పిట్టలున్నాయి. మహా సౌందర్యవతులు

తిరుగుతున్నారు. మహావీరుల గృహాలున్నాయి. ఆ భవనాల మధ్య మహా రత్న ఖచిత భవనం కనిపించింది. అది అద్భుతంగా ఉంది. అదే రావణ భవనం.

## రాక్షస భవనాలు

ముందుగా మంత్రి ప్రహస్తుని ఇల్లు కనిపించింది. లోపలికి వెళ్ళాడు. వెదికాడు. పక్కనే మంత్రి మహా పార్శ్వుడి ఇల్లు. వెళ్ళాడు. వెదికాడు. గొప్ప మేఘంలా వుంది భవనం. అది కుంభకర్ణుని ఇల్లు. వెళ్ళాడు. వెదికాడు. విభీషణుని ఇల్లు. వెళ్ళాడు. వెదికాడు. అలా వరుసగా మహోదర విరూపాక్ష వజ్ర దంష్ట్ర శుక సారణుల గృహాలు వెదికాడు. వచ్చాడు. జంబుమాలి సుమాలీ ఈ రశ్మి కేతువు ధూమ్రాక్షుడు విద్యుద్రూపుడు – అందరి ఇళ్ళు వెదికాడు. వచ్చాడు. జనకాత్మజ కనిపించలేదు.

రాక్షసేంద్రుని భవనంలోకి వెళ్ళాడు. రాక్షసాంగనలున్నారు. వారి చేతుల్లో ఆయుధాలున్నాయి. వారి కళ్ళు వికృతంగా ఉన్నాయి. గొప్ప జాతి ఏనుగులు గొప్ప జాతి గుర్రాలు ఉన్నాయి. సైనికులు కనిపించారు. బంగారు కవచాలతో ఉన్నారు. లతా గృహాలు క్రీడా పర్వతాలు క్రీడా స్థలాలు కనిపించాయి. నెమళ్ళు, పక్షుల గూళ్ళు కనిపించాయి. అన్నీ చూస్తూ పోతున్నాడు హనుమంతుడు.

బంగారుమయమైన శయ్యలు, ఆసనాలు, బంగారు భోజన పాత్రలు, రత్నమయమైన పానపాత్రలు కనిపించాయి. ఆ పాత్రల్లో మద్యం ఉంది. మధువు వుంది. ఆ భవనం చాలా విశాలంగా ఉంది. దాని పేరు పుష్పకం. అది విశ్వకర్మ నిర్మితం. అందులో ఏ భాగం చూసినా ఆశ్చర్యమే. ఎక్కడికి పోవాలనుకుంటే అక్కడికి పోతుందా విమానం. అది మనోవేగంతో పోతుంది. కావాలంటే నెమ్మదిగా పోతుంది. అది పుష్పకం ఎక్కిన యజమాని ఇష్టం. అతని మనోభావాన్ని పట్టి పోతుంది. వసంత కాలపు పుష్ప సముదాయం కంటె అందంగా వుంటుందా విమానం. వసంత ఋతువు కంటే రమణీయంగా వుంటుంది. ఆ భవనం ఒక యోజనం పొడవు అర్థ యోజనం వెడల్పుగా ఉంటుంది. అనేక ప్రాసాద భవనాల సముదాయ మయం. అందులోనే రావణుని నివాసం.

విశ్వకర్మ నిర్మించాడు ఆ పుష్పకాన్ని. అది నవరత్నఖచితమయం. దాన్ని బ్రహ్మదేవునికి కానుకగా ఇచ్చాడు. కుబేరుడు తపస్సు చేశాడు. బ్రహ్మని మెప్పించాడు. ఆ పుష్పకాన్ని కోరాడు. ఇచ్చాడాయన. అతడు దాన్ని భూలోకానికి తెచ్చాడు. రావణుడు కుబేరుని తమ్ముడు. అన్నని జయించాడు తమ్ముడు. ఆ విమానాన్ని వశపరచుకున్నాడు.

అందమైన పుష్పక విమానాన్ని చూశాడు మారుతి. మెట్లు ఎక్కాడు. లోపలికి పోయాడు. ఆ భవన సౌందర్యం తిలకించాడు. ఆశ్చర్యపోయాడు. ఇది స్వర్గమా, దేవలోకమా, ఇంద్రుని అమరావతియా, బ్రహ్మలోకమా – అనుకున్నాడు.

లంకా నగర వర్ణన భవనాల వర్ణన మొత్తం 106 శ్లోకాల్లో వర్ణించాడు వాల్మీకి అద్భుతంగా. ఒక్క పుష్పక విమానం రావణ భవనం విశేషాలు మొత్తం కలిపి 180 శ్లోకాలు. అది వాల్మీకి రచనా వైచిత్రి.

మచ్చుకి ఒక వర్ణన. రావణ భవనంలో ఉంది. భూమండలం చిత్రించబడింది నేలమీద. అదంతా ఒక తివాచీమీద గీయబడింది. పర్వతాలు, సముద్రాలు, నదులు, రాష్ట్రాలు, పట్టణాలు, పల్లెలు, అడవులు, వృక్షాలు, నానావిధ పుష్పాలు, పుష్పాల్లోని కేసరాలు పత్రాలు – అద్భుత చిత్రణ. అద్భుత వర్ణన.

## శయన మందిరం

అది రావణుని శయన మందిరం. దీపాలు వెలుగుతున్నాయి. నిశ్చలంగా వున్నాయి. అవి ధ్యానంలో నిమగ్నమై ఉన్నట్లున్నాయి. దీపకాంతులు రావణుని మీద పడుతున్నాయి. ఆ వెలుగులు ఆభరణాల కాంతుల్లో కల్సిపోయాయి. ఆ విశాల శయన గృహం ఏకజ్వాలగా వెలుగుతున్నట్లుంది. ఇంద్ర కుబేర యమ వరుణ దేవుల ఐశ్వర్యం మించిన ఐశ్వర్యం అక్కడ వుందనుకున్నాడు హనుమంతుడు.

స్త్రీలు నిద్రిస్తున్నారు. రంగు రంగుల చీరలతో ఉన్నారు. బాగా తాగారు. రతిక్రీడలు సలిపారు. సొమ్మసిల్లారు. నిద్రలోకి జారుకున్నారు. పూలమాలలు హారాలు చిక్కుపడి పోయాయి. ఆ స్త్రీల మధ్య వున్నాడు రావణుడు. నక్షత్రాల మధ్య చంద్రునిలా ఉన్నాడు. కొందరి స్త్రీల బొట్టు చెదిరిపోయింది. కొందరి కాళ్ళ అందెలు జారిపోయాయి. హారాలు పక్కకి ఒదిగిపోయాయి. మొలనూళ్ళు సడలిపోయాయి. కుండలాలు మెరుస్తున్నాయి. వక్షోజాల మధ్య ముత్యాల హారాలు హంసలు పడుకున్నట్లుగా ఉన్నాయి. వారి జఘనాలు ఇసుక తిన్నెల్లా ఉన్నాయి. వారి నోటివెంట గాలి వస్తోంది. ముఖాల మీది పైటలు పైపైకి లేస్తున్నాయి. పడుతున్నాయి. ఒకరి ముఖాల్లో మరొకరి ముఖాలు పెట్టి ఉన్నారు. అది నిద్రమత్తులో రావణుని ముఖం అనుకున్నట్లున్నారు. ఒకతె గుండెలపై మరొకతె చేయి వేసింది. ఒకరి గుండెలపై మరొకతె తొడ వేసింది. ఒకరి తొడలు ఒకరిపై చేరి ఉన్నాయి. ఆభరణాలు అవయవాలు చీరలు పూలమాలలు ఎవరివి ఏవో తెలియనట్లున్నాయి.

అందరినీ చూశాడు హనుమంతుడు. రాక్షస భార్యలు ఎట్లున్నారో అట్లే రాముని భార్య ఉంటే రావణాసురుని జన్మ ధన్యమై ఉండేది అనుకున్నాడు. శివధనుస్సు ఎక్కుపెట్టి సీతాదేవిని పొందివుంటే రావణుని జన్మ ధన్యమైపోయేది – ఇదొక అన్వయం. మా సీతమ్మ రామయ్య పక్కన ఇలా పడుకుని



వుంటే రావణుని జన్మ ధన్యమై (బతికేవాడు) వుండేది – ఇదొక అన్వయం.

ఏదైనా అది దోషమనుకున్నాడు హనుమంతుడు. వెంటనే తన అభిప్రాయం మార్చుకున్నాడు. సీతామాతకు ఈ స్త్రీలతో పోలిక ఏమిటి? వీళ్ళకంటే జనకాత్మజ గుణాల్లో మిన్న. పాతివ్రత్య ధర్మంలో మిన్న – అనుకున్నాడు. తనకు పాడు ఆలోచన వచ్చినందుకు దుఃఖించాడు.

అక్కడున్న స్త్రీలందరూ అందాల భామలే. కొందరిని అపహరించాడు. వారి కోసం ఎవరైనా వస్తే తన యుద్ధ కాంక్ష తీరుతుందనుకున్నాడు. కొందరు స్త్రీలు అతణ్ణి కామించారు. కొందరు కోరి వచ్చారు. కొందరు అతని పరాక్రమాన్ని మెచ్చారు. వచ్చారు. అక్కడి వారంతా కన్యలే. ఎవరికీ అంతక్రితం పెళ్ళి కాలేదు. కులం తక్కువ వారెవరూ లేరు. అందరూ నేర్పరులే. అందరూ యోగ్యులే. ఒక మైథిలి మాత్రం అక్కడ లేదు.

## శయ్యామందిరం

రావణుని శయ్య చూశాడు హనుమంతుడు. అది స్ఫటిక మయం. రత్నభూషితం. ఆ మంచం దంతాలతో బంగారుతో చేయబడింది. దానికి మెట్లున్నాయి. అది వైడూర్య నిర్మితం. పడక మీద దుప్పట్లున్నాయి. అవి అమూల్యం. వాటిపై పొట్టేళ్ళ తోళ్ళు కప్పబడ్డాయి. మంచం పైభాగంలో – తెల్లని గొడుగు – చామరాలు వీస్తున్న స్త్రీలు. మందిరమంతా దివ్యసుగంధం గుబాళిస్తోంది. అగరు ధూపం వ్యాపించింది. నిద్రిస్తున్నాడు రావణుడు. నీలమేఘంలా ఉన్నాడు. చెవుల కుండలాలు ధగ ధగ లాడుతున్నాయి. కన్నులెర్రబారి ఉన్నాయి. బంగారు వస్త్రం కట్టాడు. ఎర్ర చందనం ఒంటినిండా పూయబడి వుంది. సంధ్యాకాలం రత్నకాంతులతో ఆకాశం ఉంటుంది. అక్కడ మెరిసే నల్లని మబ్బులా ఉన్నాడు రావణుడు. అతడు కామరూపుడు. సర్వాలంకార భూషితుడు. వివిధ క్రీడలు సలిపాడు. అలసిపోయాడు. నిద్రిస్తున్నాడు. అన్నీ నిశితంగా పరికించాడు. శయ్య దగ్గరికి వెళ్ళాడు. రాక్షసరాజుని చూశాడు. భయపడ్డవానిలా వెనక్కి జరిగాడు. మెట్లమీదికి పోయాడు. కూర్చున్నాడు. మళ్ళీ రావణుని చూశాడు.

రెండు చేతులు చాచి ఉన్నాడు రావణుడు. అవి ఇంద్ర ధ్వజాల్లా ఉన్నాయి. ఇనుప గుదియల్లా ఉన్నాయి. బలిష్ఠంగా ఉన్నాయి. పోరాటంలో ఐరావతం కుమ్మిన మచ్చలున్నాయి. వజ్రాయుధపు గాట్లున్నాయి. విష్ణుచక్రపు దెబ్బలున్నాయి. చేతివేళ్ళు అయిదు తలల పాముల్లా ఉన్నాయి. వేళ్ళకున్న వుంగరాలు మెరిసిపోతున్నాయి. మృష్టాన్న గంధం, మద్యం వాసనలు నోట్లోంచి వ్యాపిస్తున్నాయి. ముక్తిమణిమయ బంగారు కిరీటం చూశాడు హనుమ. అది రావణుని తలనుంచి పక్కకి ఒరిగింది. పాన్పు మీదున్న రావణుడు మినుముల రాశిలా కనిపించాడు. గంగా తీరాన ఇసుక దిబ్బలపై నిద్రించే ఏనుగులా ఉన్నాడు. మంచానికి నాలుగు ప్రక్కలా నాలుగు కాంచన దీపాలున్నాయి. వాటి కాంతిలో అతని సర్వావయవాలు ప్రకాశిస్తున్నాయి.

అది రావణుని నిద్రావస్థ. రాజస తామస ప్రవృత్తి అణిగి వుండొచ్చు. అవి నివురు గప్పిన నిప్పులా ఉంటాయి. ఆ దశలో వాటిని జయించవచ్చు. కాని మనసు పొరల్లోంచి భయం తొంగి చూస్తుంది. రావణుని చూసిన హనుమ వెనక్కి అడుగు వేశాడు.

నిద్రావస్థలో రెండు చేతులున్నాయి రావణునికి. ఒకే తల వుంది. పది తలలు ఇరవై చేతులు లేవు. రావణుడు కామరూపి. భయపెట్టేటపుడు, బయట తిరిగేటప్పుడు, యుద్ధంలో దశాననుడుగా వుంటాడు. ఇంట్లో భార్యలతో రమించేటప్పుడు నిద్రించేటప్పుడు రెండుంటాయతనికి.

మరో విశేష అన్వయం ఉంది – పది తలలు, పది ఇంద్రియాలు. మనసు ఒకటే. అది రావణుని మనసు. నిదురించేటప్పుడు మనసు మాత్రమే పని చేస్తూ ఉంటుంది. అందుకే పది తలలుండవు. ఇరవై చేతులుండవు. నిద్ర లేస్తే ఇంద్రియ వ్యాపారాలు షరా మామూలే. పది తలలు (పదిమంది) చేసే ఆలోచన్లు ఒక్క తలతో చేస్తాడు రావణుడు. ఇరవై చేతులతో చేసే పనులు రెండు చేతులతో చేయగలడు. ఇది ఒక అన్వయం.

రావణుని పాదాల దగ్గర కొందరు భార్యలు ఉన్నారు. రమించి అలసి సొలసి పోయారు. పడుకున్నారు. ఒకతె వీణని కౌగలించుకుంది. ఒకతె చంకలో గుమ్మెట పెట్టుకుంది. నిద్రిస్తోంది. ఒకతె తప్పెటని కౌగిలించుకుంది. ఒకతె వీణని – ఒకతె మృదంగాన్ని, ఒకతె డిండిమాన్ని, ఒకతె వేణువుని, ఒకరు మద్దెలని, ఒకరు పణవాన్ని, ఒకరు ఆడంబరాన్ని – అలా నానా విధ వాద్యాల్ని పట్టుకున్నారు. అవి తమ ప్రియులనుకున్నారు. గట్టిగా హత్తుకున్నారు. నిద్రిస్తున్నారు.

ఒకతె మాత్రం వాళ్ళున్న చోట లేదు. ఇంకో శయ్యపై ఉంది. చూశాడు హనుమంతుడు. ఆ సుందరాంగి మండోదరి. రావణుని ప్రియభార్య. ముత్యాల హారాలున్నాయి. రత్నాల హారాలున్నాయి. ఆమెది బంగారు దేహచ్ఛాయ. తన కాంతులతో ఆ ప్రదేశమంతా ప్రకాశింపచేస్తోంది. ఆ మనోహర రూపం చూశాడు మారుతి. ఆమెను సీతమ్మ అనుకున్నాడు. మండోదరి కూడా సీతలా సౌందర్యవతి. యవ్వనవతి. మహదానంద భరితుడైనాడు.

**ఆస్ఫోటయామాస చుచుంబి పుచ్ఛం।**
**ననంద చిక్రీడ జగౌ జగామ॥**
**స్తంభానరోహత్ నిపపాత భూమౌ।**
**నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్॥**

జబ్బలు చరుచుకున్నాడు. తోకను ముద్దెట్టుకున్నాడు. ఆడాడు. పాడాడు. అటు ఇటు తిరిగాడు. స్తంభాలెక్కాడు. కిందికి దూకాడు. కోతుల సహజ చాపల్యం ఏదో – ఆ చేష్టలన్నీ ప్రదర్శించాడు. అంతలో ఆలోచన.

## పానశాల

ఆమె సీతమ్మ కాదనుకున్నాడు మారుతి. రాముణ్ణి ఎడబాసింది జానకి. ఇలా సుఖంగా నిద్రిస్తుందా? ఇలా పరాయివాడి పంచన చేరుతుందా? ఆమె అన్నం తినదు. అలంకరించుకోదు. మద్యం తాగదు. హంసతూలికా తల్పంపై పడుకోదు. రాముణ్ణి తప్ప మరొకర్ని కోరదు. దేవేంద్రుణ్ణి సైతం దరి చేరనీయదు. కనుక ఈమె సీతాదేవి కాదు. నిశ్చయానికి వచ్చాడు.

మళ్ళీ అన్వేషించసాగాడు వాయుపుత్రుడు. నడుస్తున్నాడు. చూస్తున్నాడు. వెదుకుతున్నాడు. కొందరు స్త్రీలు రతిలో అలిసిపోయారు. కొందరు పాటలు పాడారు. అలసిపోయారు. కొందరు నృత్యం చేశారు. డస్సిపోయారు. బాగా తాగారు కొందరు. మైమరచారు. వాయిద్యాల మీద పడుకున్నారు, పీటల మీద పడుకున్నారు, ఆసనాల మీద పడుకున్నారు, మంచి నిద్రలో ఉన్నారు.

**(సశేషం)**

# సూర్య, ఆంజనేయుల అనుబంధం

**– కొౌతా నిర్మల**

హనుమంతుడు శ్రీరామునికి నమ్మినబంటు. సీతారాముల సేవలో ఆనందం అనుభవించే మారుతి, తన గుండెలో ఆ ఆదర్శ దంపతులను ప్రతిష్ఠించుకున్నాడు. శ్రీరాముడికి దాసుడిగా ఉన్న ఆంజనేయునికీ, సూర్యునికి మధ్య ఉన్న అనుబంధం ఎంతో విశిష్టమయినది. వాల్మీకి రామాయణం ఆ మార్తాండునికీ, హనుమకు ఉన్న అనుబంధం తెలుపబడింది. ఎర్రగా ఉన్న పండ్లను తినాలని తల్లి అంజనాదేవి చెప్పడంతో, బాల్యదశలో ఉన్న హనుమంతుడు ఉదయభానుని ఎరుపుదనాన్ని చూసి, పండుగా భావించి, దాన్ని తినాలని ఆకాశానికి ఎగిరాడు. సూర్యుని మింగబోయేంతలో కలవరపడిన ఇంద్రుడు తన వజ్రఘాతంతో హనుమను అడ్డుకున్నాడు. బాల్యంలోనే సూర్యబింబంతో హనుమంతునికి పరిచయం ఏర్పడింది.

విద్యాభ్యాసం చేసే వయస్సుకు చేరుకున్న హనుమంతుడు సూర్యుని గురువుగా నిర్ణయించుకున్నాడు. ఆయన వద్దకు వెళ్ళి నమస్కరించి, తనకు విద్య నేర్పవలసిందిగా వినయంగా కోరాడు. కానీ, సూర్యుడు అందుకు అంగీకరించలేదు. ఎందుకంటే తాను సుప్రభాత సమయం నుంచీ, సంధ్యా సమయం వరకూ సంచరిస్తూనే ఉంటాననీ, తన ప్రయాణం ఆగదనీ, తన వద్ద విద్యను అభ్యసించడం అతనికి అసాధ్యమని అతని కోరికను తిరస్కరించాడు. కానీ హనుమంతుడు సూర్యునివద్దే విద్యార్జన చేయాలని పట్టుపట్టి, తనూ గురువుగారి వెంటే ఉంటూ, ఆయన వెంటే సంచరిస్తూ విద్య నేర్చుకుంటానని ఎంతగానో అర్థించాడు. అతనిలోని చదువు తృష్ణను గుర్తించిన సూర్యుడు అతనిని శిష్యుడుగా అంగీకరించాడు. సూర్యునితో పాటుగా అతివేగంగా సంచరిస్తూ వేద వేదాంగాలు, ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలను అలవోకగా నేర్చుకున్నాడు హనుమంతుడు. సూర్యరథంతో సమానంగా సంచరిస్తూ ఏమాత్రం అలుపు లేకుండా విద్యపట్ల శ్రద్ధ, ఆసక్తి, ఏకాగ్రతతో సూర్యుని వద్ద తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశాడు అంజనీ పుత్రుడు.

ఆదిత్యుని శిష్యుడయిన ఆంజనేయుడు, సుగ్రీవుని వద్ద మంత్రి పదవిని పొందాడు. ఆయనకు తగిన సలహాలను ఇస్తూ, సుగ్రీవ మహారాజును మెప్పిస్తూ, ఆయనకు కుడిభుజమయ్యాడు. వానరులకు, నరులకు మధ్య మైత్రీబంధాన్ని ఏర్పరచినవాడు ఆంజనేయుడే. సూర్యవంశంలో జన్మించిన శ్రీరామునికీ, సుగ్రీవునికీ మధ్య ఏర్పడిన స్నేహానికి కారకుడు హనుమంతుడే. కొన్ని పురాణాలు హనుమంతుని తల్లి అయిన అంజనీదేవికి సుగ్రీవుడు సోదరుడని తెలిపాయి.

# ముకుందమాల

- డా॥ భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 24వ శ్లోకం

**వ్యామోహ ప్రశమౌషధం ముని మనోవృత్తి ప్రవృత్త్యౌషధం**
**దైత్యేంద్రార్తి కరౌషధం త్రిజగతాం సంజీవ నైకౌషధం ।**
**భక్తాత్యంత హితౌషధం భవభయ ప్రధ్వంస నైకౌషధం**
**శ్రేయః ప్రాప్తి కరౌషధం పిబ మనః శ్రీకృష్ణ దివ్యౌషధం ॥**

ఓ మనసా! వ్యామోహం అనే దానిని అణిచేటువంటి ఔషధం, మునుల యొక్క మనోవృత్తులను నారాయణుడి వైపుకు నడిపే ఔషధం, దైత్యేంద్రులకు దుఃఖాన్ని కలిగించే ఔషధం, మూడు లోకములు ఉజ్జీవించడానికి ముఖ్య ఔషధం, భక్తులకు హితమును కలిగించే ఔషధం, సంసార భయమును పోగొట్టే ముఖ్య ఔషధం, శ్రేయస్సును పొందింప చేసే శ్రీకృష్ణుడను దివ్య ఔషధమును పానము చేయుము.

వాక్కుని పొగిడితే మనస్సుకి కోపము కలిగెను. మనస్సు సరిగ్గా ఉండని పక్షంలో అనర్ధము సంభవిస్తుందని తలిచి కులశేఖరాళ్వార్లు ఈ శ్లోకంలో మనసును సంబోధిస్తున్నారు.

శ్రీమద్భాగవతంలో కనపడే ఒక ఐతిహ్యం అగ్నివరుణ ఇంద్రాదులకు స్వాహాయని గట్టిగ చెప్పి హవిస్సును అర్పిస్తారు, బ్రహ్మకు ఇచ్చేటప్పుడు మంత్రమును మనసున తలచి నిశ్శబ్దముగా ఇస్తారు. కారణమేమనగా, ఒకసారి వాక్కు గొప్ప, మనస్సు గొప్ప అని వాదన వచ్చి బ్రహ్మదేవుడిని ఆశ్రయించి తమ వివాదమును తీర్చమనగా ''మనసే రాజు, వాక్కు పరిచారకుడు. మనస్సు జ్ఞాపక శక్తి చేత నోటితో చెప్పించును'' అని బ్రహ్మ చెప్పగా వాక్కునకు కోపమొచ్చి నేను నీతోటి రాను అని పలుకగా ''బ్రహ్మ అప్పుడు నాకు కలిగే హవిస్సు మనసా తలచిన చాలు చెప్పనక్కర్లేదు'' అని చెప్పారు.

కులశేఖరాళ్వార్లు కూడా మనసును తెలివిగా వశపరుచుకుంటున్నారు. భార్యా పుత్రాది బంధువర్గములనెడి అనురాగములు దీర్ఘకాలప్రయాణ సమయమున వెంటరానివి వాటిపై వ్యామోహము తగదు. మోహాన్ని వదిలితేనే మనస్సు భగవన్నామ సంకీర్తనకు సిద్ధమవుతుంది. వసిష్ఠాది మునులందరూ తమ మనోఇంద్రియములను జయించినట్టివారు వారు సేవించునటు వంటి దివ్య ఔషధం శ్రీకృష్ణ ఔషధం.

భగవద్భక్తులకు విఘ్నములను కలిగించే శత్రువులకు ఈ ఔషధము దుఃఖాన్ని కలిగించేటటు వంటిది. వైద్యులు దేహస్వభావమును, దేశకాలాలను చూసి మందులను మార్చి ఇస్తుంటారు. ఈ ఔషధము దేహస్వభావములకు దేశకాలాదులకు సంబంధం లేకుండా మూడు లోకములకు దివ్య సంజీవని ఔషధం వంటిది.

భక్తులైనటువంటివారికి ఈ మందు అత్యంత మధురముగా ఉంటుంది. అభక్తులకు లేదా భగవద్వి రోధులకు చేదుగా ఉంటుంది. కామక్రోధాదులచేత నోటికి చేదుగా ఉంటుంది. తిరుమంగయాళ్వార్లు "వాడినేన్" అని గర్భ, జనన, యాతన, వార్ధక్య, మరణ, యమ అనే అవస్థలు దుఃఖమును కలుగ చేసేవే అని ఆనతిస్తారు. అటువంటి బాధలని పూర్తిగా పోగొట్టుకోవడానికి శ్రీకృష్ణ అనే దివ్యౌషధమును ఓ మనసా! నిరంతరం పానము చేయుము, అది మాత్రమే పరమహితాన్ని కలుగుచేసేది అంటూ ఆళ్వార్లు హితం బోధిస్తున్నారు.

ప్రపంచంలో ఎందరో పేరు పొందిన వైద్యులు ఉన్నారు. కానీ ఏమాత్రం ఖర్చులేక సులభంగా దొరికే ఔషధం, సర్వ రోగ నిర్మూలకం (శారీరక మానసిక రోగాలు) అయినది మాత్రం ఇదే. కులశేఖరులు స్వానుభవం రంగరించి తెలుసుకున్న



ప్రతిరోజూ ఆమె నిద్రలేచి కాలకృత్యాలు అన్నీ తీర్చుకోవడమే ఆలస్యం, అల్లం, ఇంగువ, మరికొన్ని దినుసులతో నెయ్యి, కలిపి చేసే కిచిడీ అనే వంటకాన్ని చేసి స్వామికి నివేదించి దానిని యధాతథంగా ఆలయానికి పంపేది. అక్కడకూడా నివేదనమయ్యాక అర్చకులిచ్చిన ప్రసాదాన్ని ఇంటికి తెచ్చుకుని తినేది.

దాన్ని మనందరికీ ఇస్తున్నారు. ఆ శ్రీకృష్ణామృతం రుచి తెలియచెబు తున్నారు. కానీ ఆ శ్రీ కృష్ణునికే అమృతాన్ని అందించిన అమృతమయి కర్మాబాయి. ఆ జగన్నాధస్వామికి ఆమె చేసిన పదార్థంతోనే భోగాలు మొదలవుతాయి. భగవంతుణ్ణే తనవెనుక వచ్చేలా చేసుకున్న గొప్ప భక్తురాలు కర్మాబాయి.

పూర్వం ఒకప్పుడు మార్వాడదేశంలో ఉన్న 'కర్మాబాయి' అనే మహిళ పూరీ జగన్నాథ స్వామికి మహాభక్తురాలు. ఆమె తన ఐహికమైన బరువు బాధ్యతలు అన్నీ తీరిన తర్వాత పూరీ జగన్నాథ స్వామి క్షేత్రానికి వచ్చి అక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకుని ఉండిపోయింది. నిత్యం స్వామివారి సేవలో నిమగ్నమయిపోయేది.

ప్రతిరోజూ ఆమె నిద్రలేచి కాలకృత్యాలు అన్నీ తీర్చుకోవడమే ఆలస్యం, అల్లం, ఇంగువ, మరికొన్ని దినుసులతో నెయ్యి, కలిపి చేసే కిచిడీ అనే వంటకాన్ని చేసి స్వామికి నివేదించి దానిని యధాతథంగా ఆలయానికి పంపేది. అక్కడకూడా నివేదనమయ్యాక అర్చకులిచ్చిన ప్రసాదాన్ని ఇంటికి తెచ్చుకుని తినేది. క్రమక్రమంగా ఆ జగన్నాథుడికి ఆ కిచిడి ఇష్టభోగమయిపోయింది. ముందస్తుగా కర్మాబాయి పంపిన కిచిడీ పూర్తికానిదే మిగిలిన భోగాలేవీ సక్రమంగా అమరేవి కావు. మెల్లమెల్లగా ఆ రహస్యాన్ని గమనించిన ఆచార్యులు, అర్చకులు స్వామి ఇష్టప్రకారమే నివేదనను కొనసాగించేవారు. అనతికాలంలోనే ఈ కర్మాబాయి భక్తి గురించి అందరూ గుర్తించసాగారు.

ఆ రోజుల్లో జగన్నాథుడికి ఒక బైరాగి గొప్ప భక్తి కలవాడు ఉండేవాడు. ఈ బైరాగి పిలిచిన వెంటనే స్వామి పలుకుతాడు అని ప్రతీతి. అటువంటి భక్తుడైన ఆ బైరాగి కర్మాబాయి గురించి విని, ఆమెను కలవాలని తన పూరీ యాత్ర సందర్భముగా అనుకున్నాడు. ఆమెను దర్శించడానికి వెళ్ళాడు. ఆమె కిచిడీ చేసే పద్ధతి ఆ బైరాగికి నచ్చలేదు. ఒక మడీ, ఆచారం ఏమీ లేకుండా వండేస్తున్న పద్ధతి నచ్చలేదు. ఆ ఇంట్లోనే వండి, అక్కడే స్వామికి నివేదన చేసి, అదే పదార్థాన్ని జగన్నాథ స్వామి ఆలయానికి పంపడం అతనికి నచ్చలేదు.

ఆ బైరాగి కర్మాబాయికి ఆచార వ్యవహారాలు బోధించాడు. ఇంట్లో నివేదించిన పదార్థాన్ని అలా గుడికి పంపొద్దు అని చెప్పాడు. మడి కట్టుకుని వంట చేయాలని చెప్పాడు. అమాయకురాలైన కర్మాబాయి అవన్నీ విని కలవరపడింది. తాను ఇన్నాళ్లూ తప్పు చేసాను అని అనుకుంది. ఆ బైరాగి చెప్పినట్టే పాటిస్తాను అని అనుకుంది.

మరునాడు నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, శుచిగా స్నానం చేసి కొంచెం కిచిడీ చేసి ఇంట్లో స్వామికి నివేదన చేసింది. గుడికి పంపడానికి మడి కట్టుకుని వేరేగా ప్రత్యేక వంటకం చేయడానికి సిద్ధపడుతుంది. సరిగ్గా అప్పుడే ఒక సాధువు ఆమె ఇంటి ముందర నిలబడి, ఆకలికి తాళలేక పోతున్నాను అని, ఏముంటే అది, ఇంత ఆహారం పెట్టమని వేడుకుంటున్నాడు. ఏదో ఒకటి తినక పోతే అక్కడే ప్రాణాలు వదిలేస్తాడేమో అన్నంత దీనంగా ఉన్నాడు ఆ సాధువు.

కర్మాబాయికి ఏమీ తోచలేదు. గుడికి పంపే వంటకం ఇంకా తయారు కాలేదు. అది గుడికి పంపి అర్చకులు నివేదన

చేసి తనకు ప్రసాదంగా పంపితే తప్ప తన ఇంట్లో వంటకూడా చేసుకోని అలవాటున్న ఆ తల్లికి ఏమీ తోచలేదు. ఆలోచిస్తే ఒకటి తట్టింది. తాను ఇంట్లో చేసిన కిచిడీ, ఇంట్లో స్వామికి నివేదన చేసి అలాగే ఉంచింది. అదెలాగూ గుడికి పంపొద్దు. తాను గుడికి నివేదన పంపి అర్చకులు నివేదన చేసిన తరాౌత వచ్చే ప్రసాదం తప్ప ఏమీ ఇప్పుడు తినదు. కనుక, ఆ కిచిడీ ఆ సాధువుకి పెట్టేస్తే అని అనుకుంది. అలా చేస్తే అతని ఆకలీ తీరుతుంది, ఆ ప్రాణాలూ నిలబడతాయి అని అనుకుంది.



ఆ సాధువుకి ఇంట్లో స్వామికి నివేదన చేసిన కిచిడీ వడ్డించింది. అతనెంతో ఆత్రంగా, ఆప్యాయంగా ఆ కిచిడీ తిని, ఆమెకు కృతజ్ఞతలు చెప్పి, ఆశీర్వదించి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మడి కట్టుకుని, గబగబా జగన్నాథస్వామి ఆలయంలో ఇవ్వాల్సిన వంటను చేసి తానె తీసుకుని ఆలయానికి వెళ్ళింది. అర్చకులు, నిన్న తనకు ఆచారవ్యవహారాలు చెప్పిన బైరాగి తన గురించే ఎదురుచూస్తున్నారు. ఇంత ఆలస్యం ఏమిటమ్మా అని కించిత్ విసుక్కుని ఆ వంటను తీసుకుని స్వామికి అడ్డంగా ఉన్న తెర ముందర పెట్టి, తెర తొలిగించారు. ఒక్కసారి అందరూ ఉలిక్కిపడ్డారు. స్వామి నోటికంతా కిచిడీ అంటుకుని ఉంది. మూతి సరిగ్గా కడుక్కోని చిన్ని పిల్లవాడి ముఖం ఎంత అందంగా ఉంటుందో స్వామి ముఖం అంత అందంగా ఉంది. ఆ మహిమకు అందరూ ఆశ్చర్యపోయినా, అలా స్వామి నోటికి ఆహారపదార్థం అలా అంటుకుని ఉండడం అరిష్టం అని భావించారు అర్చకులు. ఆ బైరాగిని అడిగారు. స్వామి నీవు అడిగితే పలుకుతారు కదా, అసలేమయ్యిందో కనుక్కోండి అని అడిగారు. సరే అని ఆ బైరాగి స్వామిని అడిగారు. అప్పుడు స్వామి వైపునుండి అదృశ్యవాణి వినిపించసాగింది.



బైరాగీ! నీకు ఒక్కడికే కాదు, ఇక్కడ ఉన్న వారందరికీ చెప్తున్నాను, శ్రద్ధగా వినండి. కేవలం భక్తి శ్రద్ధలతో పరిశుద్ధాంతరంగయైన కర్మాబాయి ప్రేమగా పంపే కిచిడీ భోగమంటే నాకు ఇష్టమని మీకు అందరికీ తెలుసు. కానీ, నిన్న నా ఇంకో భక్తుడైన ఈ బైరాగి ఆమె దగ్గరకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో బాటు ఆచారాలు, వ్యవహారాలూ ఇవీ అంటూ నూరిపోశాడు. అంతటితో ఆమె ఇంతవరకు తాను పాటించినవన్నీ అపచారాలు అని అభిప్రాయపడ్డది. భయపడ్డది. దుఃఖించింది. తన ఇంట్లో ఉన్న నా మూర్తికి ఎప్పటిలాగే నివేదన చేసి, ఆలయ నిమిత్తం మడి కట్టుకుని మరోసారి వంటకు ఉపక్రమించింది. దానివల్ల నిత్యం నాకు జరిపే భోగానికి అయిదు ఘడియలు ఆలస్యం అయింది. నేనా ఆలస్యంతో ఆకలికి తాళలేకపోయాను. ఆమె పంపలేదు కనుక మీరు నివేదన జరపలేదు. నాకు భోగం అందలేదు. ఆమె తన ఇంట్లో నా గురించి చేసుకున్న కిచిడీ భోగం ఉండడం వల్ల, అది అంటే నాకు ఎంతో ఇష్టం కావడం వల్ల, ఆమె ఇంటికే వెళ్ళి నాకు నివేదించిన భోగాన్నే తిని వచ్చేసాను. మళ్ళీ ఇక్కడ ఆమె తెచ్చే వంటకం నివేదన ఉన్నందువల్ల తొందరలో నా నోరు కడుక్కోవడం మరిచి పోయాను. ఇక మీ ఆచారాల ప్రకారం భోగ నివేదన కానివ్వండి అని వినిపించింది. ఆ విధంగా వినిపించిన స్వామి వారి అదృశ్యవాణి విని అందరూ ఆశ్చర్యపోయారు. అర్చకులు స్వామి ఆదేశాల ప్రకారం మంత్రపూర్వకంగా భోగ నివేదన జరిపించారు. కర్మాబాయి మాత్రం స్వామి వారు తనపై చూపిన కరుణకు ఆనందంతో సుడులు తిరిగిపోయింది. అంతటి పరిశుద్ధాత్మురాలికి ఆచారవ్యవహారాలు నేర్పబోయిన తన అవివేకానికి ఆ బైరాగి సిగ్గుపడి పోయాడు. అయితే, తాను పాటిస్తున్న అచారాలన్నీ వృధానా అని అనుకున్నాడు.

వెంటనే జగన్నాథుడు జవాబు ఇచ్చాడు ఆ బైరాగికి. అమాయకుడా! మనసు నాయందు లగ్నం కావడం కోసమే ఆ ఆచారాలన్నీ అవసరమే. కానీ, ఎవరి మనసు సర్వం జగన్నాథం అని నాకే అర్పితమయ్యిందో, వాళ్లకు ఆచారవ్యవహారాలతో నిమిత్తం లేదు. నాకామె జరిపే భోగాన్ని నేను అమృతప్రాయంగా స్వీకరిస్తుంటే మా ఇద్దరి మధ్యలో మడి బట్టలు ఎందుకయ్యా అని. అంతే కాదు, ఆచారవ్యవహారాలు తెలిసిన వారు, ఆ ప్రకారమే చేయాలి, అప్పుడు కూడా భక్తి శ్రద్ధ విశ్వాసాలే ముఖ్యం. నాకు నివేదించేవి నేను ఆరగించాలనే కోరిక కలిగి ఉండాలి. ఆచార వ్యవహారాలు తెలియని వారైనా సరే భక్తి శ్రద్ధ విశ్వాసాలతో నేను ఆరగించాలనే కోరికతో నివేదించే వాటిని నేను తప్పక స్వీకరిస్తాను.

బైరాగి సిగ్గుపడ్డాడు. కర్మాబాయికి క్షమాపణ చెప్పుకున్నాడు. స్వామి అతనిని క్షమించాడు. భగవంతుని ఆజ్ఞ ప్రకారం

కర్మాబాయి తన జీవితాంతం స్వామి నివేదనకు భోగం పంపించేది.

ఒకరోజు కర్మాబాయి తన దేహాన్ని విడిచిపెట్టింది. ఆరోజు పూజారి గుడితలుపులు తెరిచినప్పుడు భగవంతుని కళ్లలో నీళ్లు తిరిగాయి. పూజారి ఈ కన్నీళ్లకు కారణాన్ని స్వామిని అడిగాడు. భగవంతుడు చెప్పాడు, "ఓ పండితుడా! ఈ రోజు నా తల్లి కర్మాబాయి ఈ లోకాన్ని విడిచిపెట్టి, నా లోకాన్ని కూడా విడిచిపెట్టింది. ఇప్పుడు నాకు ఖిచ్డీ చేసి తినిపించేదెవరు?". అప్పుడు పూజారి ఇలా అన్నాడు, "ప్రభూ, నేను నిన్ను తల్లి కర్మాబాయిని కోల్పోనివ్వను. ఈరోజు నుండి భగవంతుడికి ప్రతిరోజూ మొదటగా ఖిచ్డీ నైవేద్యంగా పెడతారు". ఈ విధంగా జగన్నాథునికి ఈ రోజు వరకు ప్రతిరోజూ ఖిచ్డీని సమర్పిస్తారు.

ఆనాడే కాదు, ఈనాడు కూడా, ఇప్పటికీ కూడా, కర్మాబాయి జ్ఞాపకార్థం జగన్నాథుని గుడిలో స్వామి భోగాలలో కిచిడీ భోగం బంగారు పళ్లెంలో ఉంచి భోగం జరుపుతారు. మనం త్రికరణశుద్ధిగా భగవంతుడిని మనసులో నిలుపుకొని స్వామికి రోజూ ఇంత వంటకాన్ని నివేదన చేస్తే, స్వామి స్వీకరిస్తాడు.

కర్మాబాయి (1615 – 1634): భక్త శిరోమణి కర్మాబాయి 1615 ఆగస్టు 20న రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఉన్న రాజ్‌సథాన్‌లోని కాల్వా గ్రామంలో జివాన్‌జీ దుడి కుటుంబంలో జన్మించింది. ఇది జిల్లాలోని పురాతన మరియు చారిత్రక ప్రదేశం. ఈ గ్రామం కాలూజీ దూడి పేరుతో స్థాపించబడింది. ఆమెను మీరా ఆఫ్ మార్వార్ అని కూడా పిలుస్తారు.

కర్మాబాయికి అంకితం చేయబడిన స్థానిక పద్యం:

**థాలీ భర్ లయా ఖీచాడో ఊపర్ ఘీ కి బత్కీ!**
**జీమో మ్హర శ్యామ్ ధని జీమావై బేటీ జాట్ కీ!!**
**భక్త్ ఔర్ భగవాన్ కీ జై!**
**మా కర్మాబాయి కీ జై!**
**మోర్ ముకుట్ బన్సీ వాలే కి జై!**
**గౌరీ మహాదేవ కీ జై!**
**జై జై శ్రీ గౌరీ శివ!**

సందేశం: కర్మాబాయిజీ మనకు చాలా మంచి పాఠం నేర్పుతుంది, ఆమె నియమాలు మరియు నిబంధనలను అనుసరించినప్పుడు కృష్ణజీ కనిపించలేదు కానీ ఆమె స్వచ్ఛమైన ప్రేమను అందించినప్పుడు కృష్ణజీ కనిపించింది, ప్రేమ వేదాలను కూడా అధిగమించగలదని సందేశాన్ని ఇస్తుంది, ఇసీలియే తో కెహతే హై, భక్త్ కే పీచే భగవాన్.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. కామక్రోధములు అరిషడ్వర్గములలో అతి ముఖ్యమైనవి. వాటి గురించి మరియు వాటిని ఎటుల జయించవలెనో లేదా వాటిని పూర్తిగా అదుపులో ఉంచుకోవడం ఎలాగో తెలియజేయండి – సాయిరాజు, హబ్సీగూడ**

జవాబు – మీరన్నది నిజమే. ఇదే ప్రశ్న అర్జునుడు కూడా శ్రీకృష్ణ పరమాత్మని అడిగాడు భగవద్గీతలో. కామము రజోగుణం నుండి పుడుతుంది. అది తృప్తి చెందడం అసంభవం. మహాపాపములకు కూడా కారణం. ఇహలోకంలో ఇదే మన శత్రువు. ప్రతిరోజూ మనం దినపత్రికల్లో చూస్తున్న 'హత్యాచారాలు' దీని వికృతపరిణామమే. ధర్మబద్ధమైన కామం చతుర్విధ ఫల పురుషార్థములలో చోటు సంపాదించుకున్నది. ఇది తప్పు కాదు. పొగచేత అగ్ని, ధూళిచేత అద్దము, మావి చేత శిశువు వలెనే కామము చేత జ్ఞానము కప్పబడి ఉంటుంది. దానికి ఆశ్రయములు ఇంద్రియాలు, మనసు, బుద్ధి. కామము జ్ఞానాన్ని కప్పి మనిషిని మోహానికి గురి చేస్తుంది. ముందు మనం ఇంద్రియాలను వశపరచుకొని, అనగా వాటిని సదాలోచన, సత్సంగ, సద్గ్రంథ పఠన, సద్గురు సమాశ్రయంలో నిమగ్నమవడమే కామ క్రోధములను వశపరచుకొని, ఆపై వాటిని జయించుటకు మార్గం.

**2. వేదమాత మనకు ప్రధానంగా ఏమి బోధిస్తున్నది? – గిరిధరన్, సికింద్రాబాద్**

జవాబు – ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః – అనే వేదమంత్రం వేదమాత హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తుంది. మన చెవుల ద్వారా మనకు శ్రేయస్సు కలిగించే వాటినే వినాలి. కళ్ళతో హితం కలిగించే వాటినే చూడాలి. స్థిరమైన అవయవాలతో, సుస్థిరతను కలిగించే వాటిని పొందడానికే ప్రయత్నం చేసి, మన ఆయుః ప్రమాణాన్ని సార్థకం చేసుకోవాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

### గత సంచిక తరువాయి

సంసార సాగరము నుండి తరింపజేయువాడు, నడుముపై చేతి నుంచుకొనిన వాడు, స్వర్ణమయమైన పీతాంబరమును ధరించినవాడు, రత్నమయమైన వజ్ర కిరీటమును, కుండలములను ధరించినవాడు, నాభి వరకు వ్రేలాడుచున్న యజ్ఞోపవీతము కలవాడు, సాలిగ్రామాదులచే కూర్చబడి, పాదములవరకు వ్రేలాడుచున్న వనమాలాదులచే అలంకరింప బడినవాడవు, వేంకటాచలపతివి అయిన నీకు నేను నమస్కరిస్తున్నాను. స్వర్ణాభరణాలతో ప్రకాశించేవాడు, వక్షస్థలం మీద శ్రీవత్సమనే పుట్టు మచ్చగలవాడు, కాంతివంతమైన దివ్యసౌందర్యం కలవాడు, సకల సద్గుణ వరేణ్యుడు అయిన వేంకటాధీశుని నేను శరణు వేడుతున్నాను.

దివ్యవిమానంలో వేంచేసి బ్రహ్మాది దేవతలచే ఛత్రచామరాదులతో సేవించబడేవాడు, శరత్కాల చంద్రబింబమువంటి ముఖము కలవాడు అయిన శ్రీనివాసుని సేవిస్తున్నాను. ప్రభూ! నీవు భక్తులయందు దయకలవాడవు, గరుడధ్వజుడవు, గరుత్మంతుని వీపుపైనెక్కి, కిరీటము, కుండలములు ధరించి, పీతాంబరధారివై, సుందరమందహాస వదనారవిందుడవై, శ్రీదేవితోను, కౌస్తుభమణితోను, శంఖ, చక్ర, వరద అభయ ముద్రలతోను శోభిస్తున్నావు.

నీవు పూర్ణజయశీలుడవు, విజయలక్ష్మీ సమేతుడవు, భక్తులకు, జ్ఞానులకు దృష్టి గోచరుడవు. చక్షురాదీంద్రియములకు అగోచరుడవు. వేదాదులచే వినబడువాడవు. ఇతరత్ర (శాస్త్రాదులలో) వినబడనివాడవు. అవతారములు ధరించినపుడు సంభాషణ చేస్తావు. పరమపదంలో మాట్లాడవు. వేదాదులచే వర్ణింపబడువాడవు. సాధారణముగ వర్ణింప వీలుకాని వాడవు. ధర్మస్వరూపుడవు అయినా దానికి కూడ అతీతుడవు.

వేంకటేశా! బ్రహ్మాదిదేవతలు ముఖ్యశ్రేయస్సునిచ్చే నీ దివ్యానుగ్రహముపై ఆసక్తికలవారై, ఐహిక (ఇహపర) పారమార్థిక సంగమును వీడి, నిశ్చలభక్తితో నీ పాదారవింద ద్వంద్వమును ఉపాసిస్తున్నారు. లక్ష్మీదేవితో క్రీడించే నీ మహిమను ఎవరు తెలుసుకోగలరు? నీవు మాయాస్వరూపుడవు. మాయనతిక్రమించినవాడవు. శుభప్రదమైన నీ దివ్యమంగళ విగ్రహమును, నీ మహిమలను కొంతమాత్రమైనా దర్శింపగోరుచున్నాను.

సర్వప్రాణుల హృదయములలో నివసించువాడు, వాసుదేవుడు, సర్వావ్యాపకుడు, జగత్తుకు హితము, శ్రేయస్సు చేకూర్చువాడు, రక్షకులలో అగ్రగణ్యుడు, శ్రేష్ఠుడు, దేవదేవుడు, పురుషోత్తముడు, ప్రధానపురుషుడు, జగత్తుకు మూలపురుషుడైన శ్రీనివాసుని సేవిస్తున్నాను.

చక్షురాదీంద్రియములకు కనబడనివాడు, సూక్ష్మస్వరూపుడు, సర్వోత్తముడు, పరాత్పరుడు, జగత్తు సృష్టికి మూలకారకుడు, సర్వసాక్షి నాశరహితుడు అయిన పరమాత్మకు నమస్కరిస్తున్నాను.

**నమస్తే వాసుదేవాయ నమః సంకర్షణాయచ ।**
**ప్రద్యుమ్నాయానిరుద్ధాయ యోగిహృత్పద్మవాసినే ॥**

**ఆ.పు.అ.4.శ్లో.20.**

వాసుదేవునికి, సంకర్షణునికి, ప్రద్యుమ్నునికి, అనిరుద్ధునికి, యోగుల హృదయ కమలములందు నివసించువానికి నమస్కరిస్తున్నాను. పృథివ్యాది పంచభూతములను విశేషంగా సృష్టించినవాడు, శబ్దస్పర్శ రూపరసగంధాది పంచతన్మాత్ర స్వరూపుడు, చక్షురాది పంచజ్ఞానేంద్రియములకు, వాగాది పంచకర్మేంద్రియములకు అధిపతి, హృషీకేశుడైన శ్రీనివాసునకు నమస్కారము.

సర్వవ్యాపకుడవైన విష్ణుమూర్తివి, విష్ణుభక్తులకు ప్రభువవు, జయశీలుడవు, విజయ ప్రదాతవు, భక్తులకు సర్వాభీష్టములనిచ్చువాడవు, అందరికి ప్రియమైనవాడవు, జగత్సృష్టి మొదలైన మహాకార్యములు చేయువాడవు, దుష్టరాక్షస సంహార రూపమైన మహోత్కృష్ట కర్మలనాచరించే శ్రీకృష్ణునకు నమస్కరిస్తున్నాను.

క్షరాక్షరులకంటె ఉత్తముడవు, శోభనాక్షరములుగల వేదములకు అధిపతివి, నాశరహితుడవు, ఉదరములో సర్వజీవసమూహములు కలవాడవు, జగత్తును క్షయము, అక్షయము చేసే నీకు నమస్కారము. భక్తుల పాపములను హరించువాడవు, పుణ్యమును అభివృద్ధి చేసే నీకు నమస్కారం.

సంకల్ప మాత్రం చేతనే అవతరించువాడవు, సకల ప్రపంచమునకు కారణభూతుడవు, ధీరుడవు, (దృఢమైన సంకల్పం కలవాడవు) పరమేష్ఠివి, సర్వోత్కృష్టుడవు, వీరుడవు, మహాకార్యములను సాధించే పరాక్రమముగల శరీరము కలవాడవు, కపిలుడు-వేదవ్యాసుడు మొదలగు మహర్షుల రూపము ధరించినవాడవు, పరబ్రహ్మస్వరూపివియైన నీకు నమస్కారం.

శ్రీమన్నారాయణుడవు, భూమిని పాతాళమునుండి ఉద్ధరించి ధరించినవాడవు, బ్రహ్మాదులకు కూడా విశేషంగా పూజింపదగినవాడవు, భూమిని తన కోరలపై ధరించిన వరాహరూపుడవు, వేంకట పర్వతరూపుడవు అయిన వేంకటాచలపతికి నమస్కరిస్తున్నాను.

పూజ్యులైన బ్రహ్మాదులకు కూడ పూజనీయుడవు, అచ్యుతుడవు, నమస్కరింపదగిన దేవతలచే నమస్కరింపదగిన పాదపద్మములు కలవాడవు, హిరణ్యగర్భుడైన బ్రహ్మనాభికమలములో కలవాడవు, మంగళప్రదమైన వాటికి మాంగళ్యమును (శుభమును) ప్రసాదించే పరమమంగళ స్వరూపుడవైన ఓ శ్రీనివాసా! నీకు నమస్కారం. స్కంధుడవు, మోక్షప్రదాతవు, సూర్యకిరణములలోని కాంతిస్వరూపుడవు, సచ్చిదానందమూర్తివి, కర్మజ్ఞానమార్గములద్వారా నిరూపించబడువాడు, శ్రుతులకు, స్మృతులకు ఆశ్రయుడవు అయిన ఓ వేంకటేశా! నీకు నమస్కారం.

సర్వజగన్నియామకుడవు, నియమములు కలవాడవు, దానములు, వ్రతములు చేయువాడవు, చేయించువాడవు, బదరికాశ్రమములో తపస్సు చేయువాడవు, తపస్సుచేత పొందదగినవాడవు, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధి దైవికములనే మూడువిధములైన తాపములను పరిహరించువాడవు యజ్ఞస్వరూపుడవు, విశ్వరూపుడవు, పరమమంగళమూర్తివి, గంగాది పవిత్ర తీర్థములు పాదములయందు కలవాడవు, భక్తులను, జ్ఞానులను సంసార సాగరమునుండి బాగుగా తరింపజేయువాడవు, ప్రపన్నులైన భక్తలోకమునననుసరించువాడవు, సుఖప్రదాతవు, పరిశుద్ధుడవు, శాశ్వతములైన జ్ఞానానందాది సద్గుణ పరిపూర్ణుడవు అయిన నీకు నమస్కారం.

జగత్సృష్ట్యాది కర్మల నాచరించువాడవు, కర్మసంగం లేనివాడవు, జ్ఞానస్వరూపుడవు, జ్ఞానప్రదుడవు, (అపరోక్షజ్ఞాన ప్రదాతవు), నిత్యముక్తుడవు, భక్తుల పాపములను హరించువాడవు, నిత్యముక్తి ప్రదాతవు అయిన నీకు నమస్కరిస్తున్నాను.

**శుద్ధం వపుః పరమయోగ మతుల్య సౌఖ్యం**
**భూమింం ద్యులోక మిత తత్త్వమతిం సుభక్తిమ్ ।**
**వైరాగ్యమన్యసుగుణాన్ భజతాం దదానం**
**శ్రీశం దయోదధి మహం శరణం ప్రపద్యే ॥ ఆ.పు.అ.4.శ్లో.31.**

తనను సేవించువారికి సాధనానుష్ఠాన యోగ్యమైన, పరిశుద్ధమైన, ఆరోగ్యవంతమైన శరీరమును, పరమయోగవిద్యను, సమాధినిష్ఠను, సాటిలేని సుఖాన్ని, భూలోకాధిపత్యాన్ని, స్వర్గలోకసుఖాలను, తత్త్వజ్ఞానమును, నిశ్చయబుద్ధిని, సుదృఢభక్తిని, వైరాగ్యాన్ని, అనేక ఇతర సద్గుణములన్నింటిని ప్రసాదించువాడు, దయాసముద్రుడు, లక్ష్మీపతి అయిన శ్రీనివాసుని నేను శరణు వేడుచున్నాను.

శ్రీనివాసా! నీవు భక్తియోగ సులభుడవు. ఇతరత్ర దుర్లభుడవు. షడ్గుణైశ్వర్య సంపన్నుడవు, సనాతనుడవు. సజ్జనులు, దుర్జనులు అందరియందు ఉండువాడవు. సర్వవ్యాపివి పృథివీజల తేజస్సులనే మూర్తములందు, వాయువు అంతరిక్షము మనస్సులనే అమూర్తములందు వ్యాపించి ఉన్నవాడవు, సాకారుడవు, నిరాకారుడవు, శుభాశుభ ఫలప్రదాతవు. నీవు గోవిందుడవు. భూమిని ఉద్ధరించినవాడవు. గోవులను

సంరక్షించినవాడవు. సర్వవేద ప్రతిపాద్యుడవు. వేదాతీతుడవు. వాక్కుల కందనివాడవు. భక్తుల పాపములను పోగొట్టువాడవు, నిష్కల్మషుడవు, విశుద్ధుడవు. ప్రతికల్పమునందును భక్తులకు సర్వాభీష్టములను యిచ్చే కల్పవృక్షము వంటివాడవు అయిన నిన్ను శరణుపొందుచున్నాను.

లోకంలో దుష్టభావాలు కలవాడైనను, ఉన్మత్తుడైనను నీ నామ గుణక్రియాదులను వర్ణిస్తే అతడాచరించిన బ్రహ్మహత్యాది మహాపాతకాలు, ఉపపాతకాలన్నీ నశిస్తాయి. వేరే మార్గంలేదు. నీ నామస్మరణ చేయని వానికి పాప పరిహారమే లేదు. నీ నామమహిమ తెలియకపోయినను, డాంబికంగానైనా సరే పుణ్యశ్లోకుడవు, సచ్చరిత్రుడవైన నీ పవిత్ర నామములనుచ్చరించినచో వాని పాపాలన్నీ అగ్నిచేత దూదిరాశి (కుప్ప) దహింపబడినట్లు నశిస్తాయి.

ఆకలిగొన్నవాడు, దుఃఖంతో ఉన్నవాడు, శ్రమచేత డస్సినవాడు, ఎవ్వరైనా నీ పవిత్రనామాలను భక్తితో స్మరిస్తే వారి దుఃఖాలన్నీ క్షణంలో నశిస్తాయి. అజ్ఞానంతో, మదంతో నీ నామస్మరణ చేయకుండ, నిన్ను మరచువాడు అన్ని విధములైన కష్టములను, అశుభములను, పాపములను పొందుతాడు.

**నతీర్థయాత్రా నచ దానయజ్ఞాః వ్రతం తపో నార్చన మన్యదైవమ్ ।**
**యచ్ఛ్రీనివాసస్య చ నామకీర్తనం త దేవ సర్వార్థ సువృష్టి కారణమ్ ॥**
**ఆదిత్య.పు.అ.4.శ్లో.38.**

తీర్థయాత్రలు కాని, దానాలు కాని, యజ్ఞాలు కాని, వ్రతాలు, తపస్సు, ఇతర దేవతారాధనలు కాని భక్తుల సర్వాభీష్టాలను తీర్చజాలవు. ఒక్క శ్రీనివాసుని దివ్యనామ సంకీర్తనం మాత్రమే సర్వార్థములను వర్షిస్తుంది. యాత్రలు, యజ్ఞాలు, వ్రతాలు, ధర్మాలు, దానాలు మొదలైన ఇతర సత్కర్మలనేకములు భక్తితో చేసే నీ నామస్మరణవలన కలిగే ఫలితంలో పదునారవ భాగంతో కూడ సమానంకావు. ఆహా! హరినామ సంకీర్తనం చేసేవారి భాగ్యాన్ని ఏమని చెప్పాలి! వారికి యమలోకం చాలాదూరం. స్వర్గం, మోక్షం వారికి తప్పక లభిస్తాయి.

హరినామ సంకీర్తనా మాహాత్మ్యాన్ని వర్ణించడానికి ఎవరికి సాధ్యం? అజామీళుడు హరినామస్మరణవలన మృత్యుపాశమును విడిపించుకొని వైకుంఠానికి వెళ్ళాడు. భగవన్నామస్మరణయే మానవులనుద్ధరించే మహాధర్మంగా చెప్పబడింది. భగవంతునియందు సదా భక్తికలిగి, ఆయనను స్మరించుటవలన మానవుడు సంసారసాగరమునుండి తరిస్తున్నాడు. ఒక్క అజామీళుడేకాదు. నీ నామస్మరణవలన ప్రహ్లాదుడు, గజేంద్రుడు మొదలైన వారెందరో పాపసాగరాన్ని దాటి, దుఃఖ సముద్రంనుండి ఉద్ధరించబడ్డారు. గౌరీనాథుడైన పరమశివుడు ఇప్పటికీ రామనామామృతసాగరంలో మునిగి ఉన్నాడు. శ్రీహరి ధ్యానం వలన బ్రహ్మాదిదేవతలు మహావైభవంగల పదవులను పొందారు.

నీ నామస్మరణ నిఖిలజగత్తులోని భయంకరమైన దుష్కర్మలనే అనేక పర్వతాలను ఛేదిస్తుంది. నీవంతటి శక్తికలవాడవు. నీవు విశ్వరూపుడవు. ఎవరిచేతను నిరోధించుటకు వీలుగాని అప్రతిహత శక్తి సంపన్నుడవైన ఓ శ్రీనివాసా! నీవు నా యందు ప్రసన్నుడవై నన్ననుగ్రహించు స్వామీ! నీవు ప్రాకృతమైన నామరూపగుణ క్రియాదులు లేనివాడవు, పుట్టుకలేనివాడవు అయినప్పటికీ, నీ పాదపద్మములను సేవించే భక్తులను అనుగ్రహించుటకై అనేక నామములను, రూపములను, గుణములను, క్రియలను, జన్మలను (అవతారములను) స్వీకరిస్తున్నావు. అటువంటి కరుణామూర్తివైన నీవు నాయందు ప్రసన్నుడవు కమ్ము.

ప్రభూ! నీవు అనేక అవతారములు ధరించి జనులకు వారివారి అర్హతను బట్టి మోహమును, అనుగ్రహమును కలిగిస్తున్నావు. ఇప్పుడు నా యందు నీ అనుగ్రహాన్నే ప్రసరింపజేయి. నీ దయాదృష్టి లేశమువలననే ఇహపరాల్లో సర్వాభీష్టములు నెరవేరుతాయి. నీ అనుగ్రహం లేనిచో ఏవీ లభించవు. ఇది నా నిశ్చితాభిప్రాయం. ఇందుకు సందేహం లేదు.

**ఓం నమో వేంకటేశాయ పురుషాయ పరమాత్మనే । (మహాత్మనే)**
**మహానుభావాయ మహామాయినే-మేయ కర్మణే ॥**
**ఆదిత్య.పు.అ.4.శ్లో.48.**

ఓ వేంకటేశా! పరమపురుషుడవు, పురుషోత్తముడవు, అనంత ప్రభావము కలవాడవు, పరబ్రహ్మవు, మహానుభావుడవు, మహిమాన్వితుడవు, అత్యద్భుతమైన మాయాశక్తి కలవాడవు, (మహామాయావివి), అప్రమేయములైన, ఎవరికి తెలిసికొనుటకు వీలుగాని, లెక్కించుటకు వీలుగాని కార్యములు చేయువాడవైన నీకు నమస్కరిస్తున్నాను.

అన్నిచోట్ల, దుర్గమ ప్రదేశాల్లోను, నీటిలోను, ఆకాశంలోను, గర్భంలోను, అరణ్యంలోను, ఎటువంటి ఆపదల్లోనైనా, మహామాయావివి, ప్రపంచమే కుటుంబముగాగల నీ నామస్మరణవలననే జనులు అన్నివిధాలా రక్షణపొందుతున్నారు. కదా! గొప్ప ఆపదలు సంభవించినపుడు నీ నామమును స్మరిస్తే ఆ ఆపదలు తొలగిపోతాయి. అలాగే సకలసంపదలు సమకూరినపుడు నీ నామాన్ని విస్మరిస్తే, నీ నామస్మరణ చేయడం మరిస్తే ఆ సంపదలు నశిస్తాయి. కావున నేను నీ అనుగ్రహం వలన ఎల్లప్పుడు నీ నామస్మరణ చేయుటలోనే ఆసక్తి కలిగి ఉన్నాను. నేను నీ వాడనగుటవలన నీ చే ప్రేరేపించబడి, నీ కృపావిశేషంచేత నీ సన్నిధికి వచ్చాను. ఇది నా పుణ్యం, భాగ్యం.

నేను నీ దివ్య నామస్మరణలో మనస్సులగ్నం చేయడం వలన నా కెప్పుడు భయంలేదు. అయినప్పటికీ నీ కృపాకటాక్ష వీక్షణములవలేశ మాత్రమైనా నాయందెల్లప్పుడు

ప్రసరించుగాక! అదే నాకు మహాభాగ్యం. ఓ లక్ష్మీనాథా! అనేక దుష్కర్మలు చేసిన నేను చిత్రవిచిత్రాలైన నీ దివ్యచరిత్రలను తెలుసుకోలేకపోతున్నాను. ఓ సర్వజ్ఞ శిఖామణీ! అన్నీ తెలిసిన నీకు నేనేమని చెప్పాలి? నిన్ను ఎప్పుడూ ఏమని వర్ణించగలను? కావున దయతో నన్ను రక్షించు.

ఓ విష్ణుమూర్తీ! నీ నామస్మరణ వలన మహాపరాశులు నశిస్తాయి. దాని వలన మనస్సు, శరీరాలు పరిశుద్ధములౌతాయి. అటువంటి పవిత్రుని చూసి నీవు సంతోషిస్తావు. ఆ తరువాత నీ అనుగ్రహంతో అతడు సత్కర్మలాచరించి నీ కృపకు పాత్రుడౌతాడు. సత్కర్మానుష్ఠానము వలన యదార్థ జ్ఞానం కలుగుతుంది. దానివలన ఆత్మయందు అద్భుతమైన ప్రీతి కలుగుతుంది. ఆపై అపరోక్షానుభవం (ఆత్మసాక్షాత్కారం) కలుగుతుంది. దాని వలన పునర్జన్మ ఉండదు. గర్భావాసాది క్లేశాలుండవు. ఆ పైన నిరతిశయానంద రూపమైన ముక్తి లభిస్తుంది. అదే ఆత్మానుభూతి.

భూమిమీద ఉన్న ఇసుక రేణువులన్ని గోదానములు, కన్యాదానములు చేసినప్పటికీ, కరువుకాటకాదులలో గంగాతీరంలో ప్రతిరోజు కోటి మందికి భోజనం పెట్టినప్పటికీ, (అన్నదానం చేసినప్పటికీ) అవన్నీ నీ నామస్మరణ చేయడంతో సమానమే. నీ నామస్మరణ అంతటి మహత్తరమైనది. కావున నీ నామస్మరణ సులభసాధ్యమైనది. పవిత్రమైనది. పురుషార్థప్రదమైనది. ఈ భక్తిమార్గము లోకోత్తరమైనది. దీనివలన జనులు భయరహితులౌతారు. భగవన్నామస్మరణ చేయువారికి దేనివలనను భయములేదు. అందువల్ల అందరూ భక్తితో నిరంతరం భగవంతుని స్మరిస్తూ ఆయన నామాన్ని జపించాలి.

ఓ శ్రీనివాసా! ఎవడైతే ఒక్కసారి నీ దివ్యపాదపద్మముల యందు, ఇతర చింతలు లేకుండా తన మనస్సును సమర్పిస్తాడో, లగ్నం చేస్తాడో, అటువంటివాడు పాపియైనను యముడుగాని, యమపాశములు పట్టుకొన్న యమదూతలుగాని వాని వద్దకురారు. వానిని చూడరు. ఆహా! ఎంత ఆశ్చర్యం! నీ నామస్మరణ చేసేవారికి నరకభయంలేదు కదా!

## శ్రీనివాసుని వరప్రదానం

శ్రీనివాసా! సర్వలోకమాత అయిన లక్ష్మీదేవి అన్ని కాలాలలోను, అన్నిప్రదేశాలలోను నీతోనే ఉంటుంది. అవిశెపువ్వు వంటి కాంతి గల లక్ష్మీదేవి నీ హృదయ కమలంలోను, నీ ఒడిలోను ఎల్లప్పుడు నిత్యానపాయినియై నీకు సన్నిహితంగా ఉంటుంది. ఆమె బ్రహ్మరుద్రేంద్రాదులకు వారివారి పదవులను ఇప్పించుటలో సమర్థురాలు. ఆమె సర్వలోకాలకు శుభాన్ని కలుగజేస్తుంది. దయార్ద్రహృదయ. బ్రహ్మ రుద్రేంద్రాదులు ఆమె కటాక్ష వీక్షణము వలన తమ తమ పదవులను పొంది, ఆమెను ప్రార్థిస్తుంటారు.

ఆ లక్ష్మీదేవి సరస్వతీదేవి, పార్వతీదేవులకంటె సౌందర్యవతి. మందహాస వదనారవిందయైన ఆమెను పద్మముల వంటి నాలుగు చేతులతో విలాసంగా ఆలింగనం చేసుకుంటున్నావు. ఆమె నిత్యముక్తురాలు. దోషరహితమైనది. నీతో సమానమైన సత్ గుణములు కలది. నిత్యం నీ పాదార విందాలను ఆరాధించుటలో బద్ధకంకణురాలై శోభిల్లుతున్నది. ఆమె భక్తులకు అభీష్టములను యిచ్చుటలో కల్పవృక్షము, చింతామణి, కామధేనువు, కరుణా సముద్రము వంటిది.

లక్ష్మీదేవి నీకు ముందు, వెనుక కుడి, ఎడమల, పైన, క్రింద అన్నివైపుల నీతో కూడివుండి లోకాలను సృష్టిస్తూ రక్షిస్తున్నది. ఆమె జ్ఞానానందాది గుణములతో కూడి ఉన్నది. తల్లి వలె శ్రేష్ఠమైన వాత్సల్యాది గుణాలతో విరాజిల్లుతున్నది. మిక్కిలి కాంతివంతమైన శరీరము కలది. అందరిచేత ధ్యానింపతగినది. ఆమె అందరి బుద్ధిని ప్రేరేపింపచేస్తుంది. ఆమె తినకూడని పదార్థములను తినుట వలనను తీసుకోకూడని దానములను స్వీకరించుట వలనను వచ్చేటటువంటి పాతకములనుండి, మహాపాతకములు, ఉపపాత కములనుండి జనులను రక్షిస్తుంది. తనను కీర్తించే వారిని రక్షించుటలో సమర్థురాలు కావున ఆమెను 'గాయత్రి' అని కీర్తిస్తారు.

సూర్యుని కూడా ప్రకాశింపచేయుట వలనను, భక్తుల కోరికలను తీర్చుటలో ఆసక్తి కలదగుట వలనను, చరాచర జగత్తును సృష్టించుట వలనను లక్ష్మీదేవి 'సావిత్రి' అని పిలువబడుతున్నది. వాక్కులకు అధిదేవత యగుట వలనను, వాక్కులను ప్రసాదించుట వలనను ఆమెయే 'సరస్వతి'గా కీర్తించబడుతున్నది. ఆమెయే కాంతి, ప్రీతి, మొదలగు వాటిని యిచ్చుట వలన 'భారతి' మొదలగు పేర్లతో పిలువబడుతున్నది. ఆమె సర్వసద్గుణ పరిపూర్ణురాలై పరబ్రహ్మమైన నీ అధీనంలో ఉన్నది. ఆమె బ్రహ్మాండమంతా లోపల బయట వ్యాపించియున్నది. ఆమె స్థూల రూపంలోను, సూక్ష్మ రూపంలోను, మధ్యమరూపంలోను ఉన్నది.

ఆమె మహోత్కృష్టమైన సర్వ కర్మలకు, గుణములకు, నియామకురాలు. ఆమె కృపాకటాక్ష వీక్షణము వలన మానవులకు సర్వ సంపదలు సిద్ధిస్తాయి. ఇంకను స్వర్గలోకము, వైరాగ్యము, భగవంతునియందు భక్తి, జ్ఞానము, ముక్తి కూడా పొందుతారు. ఆమె సర్వ లోకాతీతురాలు, సర్వలోక పూజ్యురాలు. నీకు అత్యంత ప్రియతమురాలు. ఆమె సర్వశక్తులూ కలది. సర్వ సుఖములు కలది. సర్వ శుభలక్షణములతో కూడినది. సకల సద్గుణములతో నిండినది. పూర్ణకాముురాలు (ఏకోరిక లేనిది).

**సర్వశక్తా సర్వసుఖా సర్వలక్షణ సంయుతా ।**

అనేకగుణసంపూర్ణా పూర్ణకామా చ సర్వదా ॥

**ఆదిత్య పు. అ. 5. శ్లో. 14.**

ఆ లక్ష్మీదేవి యొక్క జ్ఞానము, శక్తి మహిమలు యింతవని కొలవడానికి సాధ్యం కాదు. ఆమె సకల పురుషార్థములను ప్రసాదిస్తుంది. మహైశ్వర్య సౌభాగ్యం కలది. అయినప్పటికి ఆమె ఎల్లప్పుడు నిన్ను అనుసరించే వుంటుంది. నిన్నే స్మరిస్తుంది, ధ్యానిస్తుంది, స్తుతిస్తుంది, నమస్కరిస్తుంది, పూజిస్తుంది, దర్శిస్తుంది, జపిస్తుంది. నీకోసమే తపిస్తుంది, నిరీక్షిస్తుంది. నిన్నే సేవిస్తుంది.

ఆమె నిత్యం నిన్ను వదలకుండా నీతోనే ఉంటుంది. ఎంతో నమ్రతతో ఎల్లప్పుడు ప్రార్థిస్తుంది. ఆ లక్ష్మీదేవియే ఈ విధంగా నిన్ను సేవిస్తుంటే ఇక మాబోటి నిరాధారులమైన అల్పజీవుల విషయమేమని చెప్పాలి? ముల్లోకాలలోను దరిద్రులు, బంధురహితులు, అనాథలు, బ్రతుకు తెరువు కోరుకునేవారు, నిన్ను ప్రార్థిస్తారనుటలో ఆశ్చర్యమేముంది?

శ్రీ వేంకటేశ! మత్స్వామిన్ జ్ఞానానంద దయానిధీ ।
శరణాగత సంత్రాణ కారణాభీష్టవార్షుక॥

**ఆదిత్య. పు. అ. 5. శ్లో. 19.**

ఓ వేంకటేశా! ప్రభూ! జ్ఞానానందస్వరూపా! దయానిధీ! శరణాగతరక్షకా! సర్వజగత్కారణా! భక్తాభీష్ట ప్రదా! లక్ష్మీపతీ! నీ రూపాలు, కర్మలు, బ్రహ్మదేవుడు, శివుడు, ఆదిశేషుడు మొదలైనవారు కూడా తెలుసుకో లెరు, లెక్కించలేరు. అవి ఊహింపనలవి కానివి, అత్యద్భుతమైనవి. నీవింత పూర్ణమహిమ కలవాడవు. కావున నిన్ను వర్ణించుటకు నేను అశక్తుడను. నేనెంతటి వాడను? నా శక్తి ఎంతటిది? మందబుద్ధినైన నేను నిన్నేమని స్తుతించేది? నేను సోమరిని. అహంకారిని, అజ్ఞానిని. మూర్ఖుడను, మొండివాడను, దుష్టుడను, జ్ఞానము, భక్తి మొదలగు సద్గుణాలు లేనివాడను, కామ క్రోధాదులతో నిండినవాడను, మనోనిగ్రహం లేనివాడను, ఎల్లప్పుడు విషయలోలుడను, ఇక నా దోషాలు ఇసుకరేణువులు, వర్షబిందువులవలె లెక్కలేనన్ని. నీవు ఎలా సకల సద్గుణ పరిపూర్ణుడవో, నేను ఆ విధంగా సకల దోషభూయిష్ఠుడను. నేను అలసత్వం వలన, అహంకారం వలన, అజ్ఞానం, లోభం, దంభం, అజాగ్రత్త, ప్రలోభం, స్వభావసిద్ధంగా సాంగత్యదోషం వల్ల చేసిన అసంఖ్యాకాలైన అపరాధాలను లెక్కపెట్టకుండా నన్ను క్షమించు స్వామి!

నాకు తల్లి, తండ్రి, గురువు, సోదరుడు, స్నేహితుడు, బంధువు నీవే, విద్య, సత్కర్మ, సంపద, ముందు వెనక, ఇరు ప్రక్కల నా సర్వమూ నీవే. నా శిరస్సులోను, హృదయ కమలమునందు, లోపల బయట కూడా నీవే ఉండి కాపాడుతున్నావు. అనేక జన్మ జన్మలుగా మాతండ్రి తాతలు నిన్ను కులదైవంగా, యిష్టదైవంగా ఆరాధిస్తున్నారు. కాబట్టి ఓ లక్ష్మీనాథా! నా సర్వస్వం నీవే నీవు తప్ప నాకెవరూ దిక్కు లేరు. నా దుర్బుద్ధిని దూరంగా పోగొట్టి నీ విస్మరణమును పోగొట్టు. నాకిప్పుడు నీ జ్ఞానాన్ని కలిగించు. నాకు నీ కంటె ప్రియుడు ఎవరూ లేరు. నా మనస్సు, ప్రాణములను నీ యందే ఉంచి నీ పాద పద్మములను ఆశ్రయించాను.

నేను నీ భక్తుడను, దాసుడను, శిష్యుడను, పుత్రుడను. కేవలం నీ సేవకుడను. నీవు ఈ జగత్తుకు ప్రభువువు. కావున రాత్రి, పగలు నిన్నే స్మరిస్తున్నాను. ఓ శ్రీహరీ! నీవు నా హృదయ కమల పీఠములో అతిసుందరుడవై పద్మాసనాసీనుడవై ఇంద్రనీలమణి వంటి కాంతి కలవాడవై ఉన్నావు. పద్మదళాలవలె సుకుమారములైన నీ పాద పద్మములు కుంకుమ కంటె కూడా ఎర్రగా ఉన్నాయి. వజ్రము-అంకుశం-ధ్వజ-కమల చిహ్నాలతో కూడి ఎర్రని గోళ్ళు కలిగి ఉన్నాయి.

నీ కాలి అందెలోని- చిరుమువ్వలు సవ్వడి- చేస్తున్నాయి. అవిశెపూల వంటి కాంతితో రంజిల్లుతున్నాయి. నీవు నడుముకి పీతాంబరాన్ని ధరించావు. బంగారు మొలనూలు ధరించావు. బ్రహ్మదేవునికి ఆధారమైన గంభీరమైన స్వర్ణకమలము వలె నీ నాభి శోభిస్తున్నది. ఓ అచ్యుతా! నీ ఉదరం బ్రహ్మాండాన్నంతటినీ లోపల దాచుకొని పైన మూడు సన్నని ముడతలు కలిగి ఉంది. నీవు-ధర్మమే వక్షఃస్థలంగా కలవాడవు అధర్మం వీపున కలవాడవు. సన్నని మెత్తటి అందమైన రోమములు కలవాడవు.

శ్రీవత్సమనే పుట్టుమచ్చతోను, కౌస్తుభమణితోను, వక్షఃస్థలంలో వైజయంతీమాలతోను విరాజిల్లుతున్నావు. ఆజానుబాహుడవు, ఉన్నత భుజములు కలవాడవు. అభయాన్నిచ్చువాడు, వరప్రదుడవు. కుంకుమ వలె ఎర్రగానున్న చేతులలో శుభలక్షణములు గల శంఖ చక్రములను ధరించావు. ధ్వనిస్తున్న చేతి కంకణములు, కడియములు, భుజకీర్తులు మొదలగు ఆభరణాలతో శోభిస్తున్నావు.

నీ మెడ శంఖంవలె ఉన్నది. నీ అధరోష్ఠము దొండపండువలె ఉన్నది. నీ దంతపంక్తి మల్లెమొగ్గల వలె ఉన్నది. నీ చెక్కిళ్ళు అద్దమువలె శోభిల్లుతున్నాయి. ఓ శ్రీనివాసా! నీవు సుందరమైన నాసిక కలవాడవు. రెప్పపాటు లేనివాడవు. చక్కని కనుబొమలు కలవాడవు. కరుణాపూర్ణములైన నేత్రములు కలవాడవు. శరత్కాలచంద్రుని వలె ఆహ్లాదకరమైన ముఖము కలవాడవు. వంపులు తిరిగిన నీలిముంగురులు కలవాడవు.

అసదృశమైన తిలకముతో (కస్తూరీ తిలకముతో) విరాజిల్లుతున్న వాడవు, రత్నఖచితములైన కుండలములతో శోభిల్లుతున్నవాడవు, ప్రకాశిస్తున్న రత్న కిరీటమును ధరించినవాడవు, సర్వ శుభలక్షణ సంపన్నుడవు. లోకోత్తర పురుషుడవు, సకలైశ్వర్య సంపన్నుడవు, బింబరూపివి, శుద్ధాత్మస్వరూపుడవు, నిత్యం చిదానంద స్వరూపుడవు, కోటిసూర్యసమాన ప్రకాశం కలవాడవు, కోటి చంద్రులవలె

చల్లనివాడవు. అనంతములైన వేదములచేతగాని, బ్రహ్మాదులచే గాని తెలియబడిన వాడవు, ప్రాకృతగుణరహితుడవు, శ్రీదేవి, భూదేవులతో కూడియున్నవాడవు, బ్రహ్మ రుద్రేంద్రాదులచే సేవించబడు వాడవు.

ఓ శ్రీహరీ! నీవు పరిపూర్ణమైన ఆనందము, జ్ఞానము, దయ మూర్తీ భవించినవాడవు. పరమ మంగళ స్వరూపుడవు. దివ్య మంగళ విగ్రహుడవు, శుభప్రదమైన శ్రీవత్సమనే లాంఛనము కలవాడవు, భక్తులకు సర్వ మంగళములను ఇచ్చువాడవు, నీవు దయామృతముతో నిండిన నేత్రాలతో నన్ను చూస్తున్నావు. ఇంక నాకు ఇహపరాలలో చింత ఏముంది? నీవు నా సర్వారిష్టాలను పోగొడతావు. నీ పాద పద్మములయందలి విశ్వాసము సర్వాభీష్టాలను వర్షిస్తుందని రాత్రింబవళ్ళు నిన్నే స్మరిస్తూ నేను నిన్ను శరణుజొచ్చాను.

ఓ స్వామి! నీవు పూర్ణకాముడవు, సంపూర్ణైశ్వర్యము కలవాడవు. నీకు ప్రయోజనమేమి లేకున్నప్పటికి నీ మాయచే అనేక రూపాలను ధరిస్తున్నావు. లోకాలనుద్ధరించడానికి ఇతరులకసాధ్యమైన అనేక కార్యాలను చేశావు. గోవర్ధన పర్వతాన్ని ఎత్తావు. అలాగే సునాయాసంగ కొండలను పైకెత్తుతూ సేతువును నిర్మించావు. అత్యద్భుతమైన ఈ స్థూలరూపంలో కనబడే బ్రహ్మాండమంతా క్షణంలో సృష్టించావు. దాన్ని అతి మృదువు, సూక్ష్మము అయిన నీ ఉదరంలో ఉపాయంతో ధరించావు.

ఈ విధంగా మహా భారమును మోస్తున్నవాడవు, విశ్వకుటుంబివి, కరుణాసముద్రుడవు అయిన ఓ వేంకటేశ నీ భక్తుడను, నీ వాడను, అత్యల్పుడను, సూక్ష్మాతిసూక్ష్మడను, పరమాణువులాంటి వాడనైన నన్ను ఉద్ధరించుట నీకెంత పని? ఓ వేంకటేశా! ప్రభూ! జ్ఞానానికి, ఆనందానికి, దయకు నిధివంటి ఓ శ్రీనివాసా! దుఃఖ సముద్రంలో మునిగిన నీవాడనైన నన్ను ఉద్ధరించవేమి?

**(సశేషం)**



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా**

## గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 70వ కళ్యాణం

తేది 29-09-2024 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి కమ్యూనిటీ హాల్ శ్రీ కోదండ రామాలయం, వీధి నెం.8, హబ్సీగూడ, హైదరాబాదులో అత్యంత వైభవంగా జరిగింది. దీనిని శ్రీమాన్ పుల్లగూర్ల వేదాంత్ రెడ్డి, పూజ దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.

### 71 వ కళ్యాణం

తేది 23-10-2024 బుధవారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. వి.ఎస్.ఆర్ హైట్స్, వాటర్ ట్యాంకు దగ్గర, గాయత్రీనగర్, బోరబండ, హైదరాబాదులో శ్రీమాన్ కటకం అనంత కుమార్, జానకి దంపతులు నిర్వహించగా, వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్య జరిగింది.

## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

ఈలోగా ఒకానొక చోట పాదముద్రలు కనిపించాయి. ఆ పాదముద్రలు మన నందనందనుడైన కృష్ణదేవునివే అనుకున్నారు.ఎందుకంటే ఆ రకమైన పాదముద్రల్లో ధ్వజం వజ్రాయుధం పద్మం, అంకుశం, యవలు, నాగలి ఇత్యాదిగా రేఖలన్నీ సుస్పష్టముగా కనిపిస్తున్నాయి. కృష్ణునితో ఒక యువతి నడిచినట్లుగా నాలుగు కాలి గుర్తులు వున్నాయి. ఎవరబ్బా ఆ భాగ్యశాలి అనుకుంటూ– దేవా! స్వామీ! ఎక్కడ వున్నావు నీవు అని తమ వివేకాన్ని కోల్పోయారు. ఉన్మత్తలై పాడినారు. అవే గోపికా గీతాలు–19 శ్లోకాలు. కనకమంజరీ వృత్తంలో వున్నాయి. కనకం అనగా ఉమ్మెత్తయని అర్థం. అది బాగా మత్తెక్కించేది. అందుకని వాళ్లంతా ఉన్మత్తలైపోయారని అంతరార్థం.

**జయతి తేధికం జన్మనా వ్రజః శ్రయత ఇందిరా శశ్వదత్ర హి ।**
**దయిత దృశ్యతాం దిక్షు తావకాః త్వయి ధృతాసవస్త్వాం విచిన్వతే ॥**

కృష్ణా! నాథా! నీవు అవతరించడము వలన ఈ వ్రజభూమి– వైకుంఠానికంటే అధికమైన మహావైభవంతో వెలుగొందుతోంది. లక్ష్మీనాథా! పగటి పూట అడవిలో నీవు తిరుగుతుంటావు. ముంగురులతో ముద్దుగారె నీ ముఖాన్ని చూడలేకపోగా క్షణాలు యుగాలైపోతున్నాయి. పోనీ రాత్రి పూట చూద్దామంటే క్రూరుడైన బ్రహ్మదేవుడు కండ్లకు రెప్పల్ని అడ్డుగా సృష్టించాడు.

**వనౌకసాం వ్యక్తిరంగ తే వృజినహన్త్ర్యలం విశ్వమంగళమ్ ।**
**త్యజ మనాక్ చ నస్త్వత్ స్పృహాత్మనాం స్వజనహృద్రుజాం యన్నిషూదనమ్ ॥**

కృష్ణా! నీ ఈ అవతారం గోకులవాసుల దుఃఖాలను ఆపదలను పోగొడుతూనే లోకకళ్యాణదాయకమైనది. అందుకే నీమీద మాకు ఎనలేని ప్రేమ. నీవాళ్లమైన మా హృదయతాపాన్ని తీర్చే దివ్యౌషధాన్ని ఇవ్వవా! నీ దర్శనాన్ని ప్రసాదించి మా హృద్రోగాన్ని పోగొట్టి–నీ సన్నిధికి చేర్చుకోవయ్యా!

కృష్ణ భగవానుని దర్శనం కోసమై పరితప్తూ ఇంకా ఇలా విలపిస్తున్నారు గోపికలు–కృష్ణా! ఆవుల వెంట నీవు తిరుగుతుంటే– సుతిమెత్తని పాదాలకు రాళ్లుగుచ్చుకుని ఎంత బాధపడ్డావో–మా వక్షఃస్థలంపై నీ సుకుమారమైన పాదాల వుంచితే–అవి ఎంతగా కందిపోయాయో అని మా చింత. బెంగ స్వామి!– అంటున్న సమయంలో–



అపుడు

**తాసామ్ ఆవిరభూత్ శౌరి స్మయమానముఖాంబుజః!**

కరుణారస సముద్రుడైన కృష్ణ భగవానుని దివ్యమైన మంగళకర ముఖారవిందం మీద దరహాసకాంతులు ప్రసరించగా–వ్రజగోపికల మధ్యలో ప్రత్యక్షమయ్యాడు స్వామి.

సౌకుమార్య లావణ్యవంతుడునూ– సౌందర్య కళ్యాణాద్భుతగాత్రుడునూ– నిత్యవనమాలాభూషితుడునూ– నిత్యనూతన పీతాంబరధారుడునూ– మన్మధునికి సహితం మోహాన్ని పుట్టించేవాడైన కృష్ణ భగవానుని దర్శించుకున్నారు గోపవనితలు. ఎక్కడికో ఎటోపోయిన తమ తమ ప్రాణాలు తిరిగి మళ్లీ వచ్చేసినట్లుగా అందరూ చైతన్యవంతులై– ఒక్కసారిగా అసంకల్పితంగా నిలుచున్నారు. అపుడు వాళ్లందరి కన్నులల్లో మెరుపులు– మనసులలో ప్రేమానురాగాలు–ఇక భాషకు అందని ఆనందానుభూతిలో మునిగిపోయారు.

వ్రజగోపికల్లో ఒక గోపిక కృష్ణుని చేతులను పట్టుకుంది. మరొక గోపిక శ్రీ చందన పరిమళాలను వెదజల్లేటి శరీరాన్ని కౌగిలించుకుంది. ఆ స్వామి నములుతున్న తాంబూలాన్ని తన దోసిట్లోకి ప్రేమతో తీసుకుంది ఒకతె. ఒకతె తన గుండెలమీద కృష్ణుని పాదాలను వుంచుకుంది. వేరొక గోపిక తన చూపులతో

కృష్ణదేవుని కాల్చేటట్లు చూస్తోంది.

వ్రజగోపికల విరహవేదనను అద్భుతమైనట్టి మధురభక్తిగా వర్ణించారు ఆలంకారికులు. అట్లాగే శ్రీవైష్ణవ సంప్రదాయంలోనూ- గౌడీయ భక్తిరస భావనలోను గోపికల మధురమైన ప్రేమని-దివ్యకామంగా నిరూపించారు. ఇక అద్వైతభక్తులు మధుసూదన సరస్వతిస్వామి కూడా గోపికల కామాన్ని భక్తిరసాయనంగా పేర్కొన్నారు. మరి ఆళ్వారులు సైతం గోపికల కృష్ణ ప్రేమను దివ్యకామంగా ఆవిష్కరించారు.

కామం అంటే అమితమైనటువంటి కోరిక. ఫలానా వ్యక్తి లేకపోతే నేను బతకలేను అనే తీవ్రమైనట్టి ఇచ్ఛను కామం అనే చెప్పవచ్చు. ఆ కామం లౌకికపరమైతే (రజోగుణప్రభావమైతే) అది మహా అనర్థదాయకమవుతుంది. అది పతనహేతువు కూడా. ఆ కామం పరమాత్మ దివ్యమంగళకర కళ్యాణ గుణాలపై ప్రసరిస్తే- భగవత్ కృపతో జన్మసాఫల్యమైనట్లే. వ్రజగోపికలు అందరినీ యమునానదీ తీరానికి తీసుకెళ్లినాడు కృష్ణుడు.

ఉత్తరీయః కుచకుంకుమాంకితైః అచీక్లుపన్నాసనమాత్మ బంధవే - ఆత్మ బంధువైన కృష్ణునికి గోపికలు తమ స్తనాలకు కుంకుమ అంటిన పమిటల్ని ఒక ఆసనంగా పరిచారు. తరువాత ఆ స్వామిని పూజించారు. పాదసేవ చేసారు. గోపికలు కుంకుమ తమ అంటుకున్న పమిటలమీద కృష్ణదేవుని కూర్చోమని అన్నారంటే- అనురాగభరితమైన తమ హృదయముల్లోనికి ఆహ్వానం పలుకుతున్నారన్నట్లుగా భావం. కూర్చుండ నా హృదయాంకమే సిద్ధపరచనుంటి-అన్నాడు ఒక కవి.

తరువాత ఆ గోపభామలు ప్రేమమీద కృష్ణుణ్ణి కొన్ని ప్రశ్నలడిగారు.1-కొందరు తమని ప్రేమించేవారినే ప్రేమిస్తారు.2-ప్రేమించనీ- ప్రేమించకపోనీ- వాళ్లనే ప్రేమిస్తారు కొందరు.3-కొందరు ఎవ్వరినీ ప్రేమించరు.ఈ ముగ్గురిలో నీకు ఎవరు ఇష్టం? అందుకు జవాబు ఇస్తున్నాడు కృష్ణభగవానుడు.

నేను ఎవ్వరినీ ఇష్టపడను. అయితే ప్రేమిస్తూ- సేవిస్తున్న వారి-ప్రేమను- సేవను దృఢతరమం అయ్యేట్లుగా చేస్తాను. నా సన్నిధికి వచ్చే మార్గాన్ని సుగమంచేస్తాను. ఇకపోతే మీ విషయానికి వస్తే- మీరందరూ-అటు అయినవాళ్లని-ఇటు లోకమర్యాదను తిరస్కరించినారు. అంతటితో ఆగకుండా నా సమీపానికి వచ్చేసారు. అయితే మీ మీ అనన్యమైన భక్తికి ప్రేమకు ముగ్ధుడనయ్యాను. మీ మీ భక్తి పండిన ప్రేమకు వెలకట్టలేను.సకల దేవతల ఆయుర్దాయానికి-మీ మీ భక్తిప్రపత్తులు ఏమాత్రమూ సమానం కావు. నా కోసం మీరు సర్వస్వం త్యజించారు. అది సుఖం.

**అంగనామంగనాం అంతరేమాధవో- మాధవం చ అంతరేమాధవం - (లీలాశుకుని కృష్ణ కర్ణామృతం)**

ఒక్కొక్క గోపిక భామ మధ్యలో ఒక్కొక్క కృష్ణుడు- ఒక్కొక్క కృష్ణుని మధ్యలో ఒక్కొక్క గోపిక వుండే విధముగా- వలయాకారంగా తీర్చిదిద్దాడు కృష్ణుడు. వారిలో తానొకడై- వేణుగానం గావిస్తూ రాసలీలను సాగించాడు.

వ్రజగోపికల ముఖభంగిమల్లో-హస్తపాద కదలికల్లో- అనేకాద్భుతాల్నీ సృష్టించాడు. గొల్లపడుచులు ఎవరికి వారు కృష్ణస్వామి తమతో వున్నాడని మురిసిపోతున్నారు. రాసక్రీడలోని ఆ విధమైన నృత్యనైపుణ్యం దర్శనీయం. అత్యంతమనోజ్ఞం. గోపికల పాదకదలికలు-సన్ననైన నడుముల వయ్యారాలు- చక్కనైన చూపుల సోయగాలు- చెవులకున్న కుండలాల కాంతులు- ముఖాలమీద మెరుస్తున్న మంచుచుక్కల్లాగా స్వేదబిందువులు- విడిపోతున్న కొప్పుల ముడులు- మెరుపుతీగల్లా కదిలిపోతున్న గోపకాంతలు- కృష్ణుని వేణుగానానికి తగినట్లుగా వెండి అందెల సవ్వడి.

ఈ చరాచర సమస్త ప్రాణికోటిలోని ప్రకృతి జీవులతో భగవానుడు కలిసి వుంటాడు.దానినే వేదాంత పరిభాషలో తత్వత్రయమని అంటారు. అయితే భగవానునికి మరి అంతరంగశక్తి అమ్మవారు.ప్రకృతి జీవ శక్తులు విడదీయరానివై పరమాత్మకు శరీరంగా ఎల్లవేళల్లోను వుంటాయి.

ఎలాగంటే- నామ రూప లింగ అభేద ఉపాధిరహితమైన సూక్ష్మస్థితి-అదే ప్రళయకాల దశలోని భగవానుని రూపం. అదే సృష్టి స్థితిలో- నామ రూప లింగ భేద ఉపాధిసహిత వ్యక్త స్థూలస్థితిలో వుంటాడు. ఈ స్థితిలోనే కృష్ణభగవానుడు వ్రజగోపికలతో పరివేష్టితుడై రాసలీలను సలిపాడు. అది కామ లీల కాదని-అది భగవత్ లీలయని" వెన్నుడు ఇంద్రియ స్ఖలనంబు చేయక" రమించినాడు అన్నాడు పరీక్షిత్తుతో శుకయోగీంద్రుడు. కనుకనే దేవ ఋషి నారదుని పిలుపుతో-తమ సతులతో విచ్చేసి తిలకించినారు దేవతలు. పరవశులైనారు.

విచిత్రం ఏమిటంటే మనిషికి (మనకు) ప్రపంచంలోని వార్తలు- ఎక్కడెక్కడి విశేషాలు తెలుసుకోవాలంటూ ఆత్రుత వుంటుంది. అయితే తన గురించి తాను తెలుసుకోవడం లేదు. ఎంతసేపూ తను తన భార్యాబిడ్డలు ఇల్లు ఆస్తిపాస్తులు అంతులేని కోరికలు-అదే పరమార్థమని భావిస్తాడు. మన ఇంటికి యజమానిగా కాదు కాపలాదారునిగా వుండాలి. నీళ్లలో నావ వుండాలి. నావలోనికి నీళ్లు రాకూడదు. ఆవిధంగా మనం సంసారంలో వుండాలి. సంసారం మనలో వుండరాదని రామకృష్ణ పరమహంస అన్నారు.

అయినవాళ్లనందరినీ ఇల్లు వాకిలి సర్వవిధ బంధాలను తెంచుకుంటూ వ్రజగోపికలందరూ ఒక్క ఉదుటున కృష్ణభగవానుని సమీపానికి చేరుకున్నారు. న కర్మణా న ప్రజాయ న ధనేన త్యాగేనైక అమృతత్వమానశు- యజ్ఞ యాగాదుల వలన కానీ- సంతానం వలన కానీ- ధన సంపాదన వలన గానీ- ముక్తి రాదు. త్యాగం వలన మాత్రమే మోక్షం లభిస్తుంది. **(సశేషం)**

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## శ్రీవేంకటేశ్వరుని సేవలో దాస భక్తులు

శ్రీమహావిష్ణువు కలియుగ అవతారమైన శ్రీవేంకటేశ్వరుని ప్రాభవాన్ని, మహిమలను, ఆశ్రిత పక్షపాతాన్ని ఎందరెందరో కవులు, భక్తులు, వాగ్గేయకారులు రసరమ్య భరితంగా వర్ణించారు. అటువంటి వారిలో శ్రీనివాసుణ్ణి తమ అమూల్యమైన పదబంధాలతో కీర్తించి తరించిన 'కర్ణాటక హరిదాసులు' అగ్రగాములుగా నిలిచారు. వారు రచించి, ఆశువుగా కీర్తించిన వేలాది కృతులను 'దాస సాహిత్యం'గా పేర్కొంటారు. ఈ దాస పరంపరకు చెందినవారు శ్రీవేంకటాచలాధీశుణ్ణి కన్నడ భాషలో వర్ణించినందువల్ల, ఆ సాహితీ సంపదను అత్యధిక సంఖ్యలో ఉన్న శ్రీవారి తెలుగు భక్తులకు సులభంగా అర్థమయ్యే అచ్చతెలుగు భాషలోకి అనువదించి ప్రచారం చేసే బృహత్తర కార్యక్రమాన్ని 'దాస సాహిత్య ప్రాజెక్టు' పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టింది. 'అన్నమాచార్య ప్రాజెక్టు' ద్వారా అన్నమయ్య కీర్తనలను అందరికీ అర్థమయ్యే సాధారణ తెలుగులోకి ఎలా తర్జుమా చేసి జనబాహుళ్యం లోకి తెచ్చారో, అదేవిధంగా 'దాస సాహిత్య ప్రాజెక్టు' ద్వారా కన్నడ భాషలో ఉన్న కీర్తనలను కూడా తెనిగీకరించుతారన్న మాట.

### దాస సాహిత్యం ప్రాముఖ్యత

కొన్ని శతాబ్దాల క్రితం వరకు వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలు సామాన్య మానవులకు అంతగా ప్రవేశం లేని సంస్కృత భాషలో నిక్షిప్తమై ఉండేవి. కర్ణాటక ప్రాంతానికి చెందిన కొందరు మహాపండితులు దేవనాగరి లిపిలో ఉన్న సాహిత్యాన్ని సాధారణ జన స్రవంతి లోకి తీసుకువెళ్ళే ఉద్దేశ్యంతో ఆ సాహిత్య నిక్షేపాలన్నిటినీ విస్తృతంగా వాడుకలో ఉన్న సాధారణ కన్నడ భాషలోకి అనువదించి; కుల, వర్ణ, లింగ వివక్షత లేకుండా ప్రజలలో ప్రచారం చేయాలని సంకల్పించారు. దానితో పాటుగా ఎందరో హరిదాసులు శ్రీవేంకటేశుని మహిమలను వీనులవిందుగా వర్ణించి తరించారు. తమని తాము భగవంతునికి దాసులుగా భావించుకుని, శ్రీవారి సేవకే తమ జీవితాలను సమర్పించుకున్న ధన్యజీవులను 'హరిదాసులు' లేదా 'దాసభక్తులు'గా అభివర్ణిస్తారు. హరికథలు, కీర్తనలు, దేవర నామాలు, భజనలు వంటి కళారూపాల్లో ప్రత్యక్షంగా లేదా దృశ్య శ్రవణ మాధ్యమాల సాయంతో విస్తృతంగా శ్రీవేంకటేశ్వర తత్త్వాన్ని ప్రచారం చేయటం ద్వారా; పండితులకే పరిమితమైన 'వ్యాస సాహిత్యం' అందరికీ అందుబాటులో ఉండే 'దాససాహిత్యం'గా రూపు దిద్దుకుంది. తద్వారా గడిచిన కొద్ది శతాబ్దాలలో వేదాల, ఉపనిషత్తుల, ఆధ్యాత్మికతత్వ సారం కర్ణాటక ప్రాంతంలో నలుదెసలా విస్తారంగా వ్యాప్తి చెందింది. తరువాతి కాలంలో విజయనగర సామ్రాజ్య పతనం మరియు పురందరదాసు,

కనకదాసు వంటి ప్రఖ్యాత దాసభక్తుల నిర్యాణంతో; ప్రోత్సాహం కరువై ఈ ఉద్యమం మరింత ముందుకు సాగలేదు.

పై నేపథ్యంలో అప్పటికే విస్తృత ప్రచారంలో ఉన్న దాస సాహిత్యాన్ని తెలుగు భక్తుల చెంతకు తీసుకురావడం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టిన దాస సాహిత్య ప్రాజెక్టు యొక్క పూర్వాపరాలు తెలుసుకునే ముందు, కొందరు ప్రముఖ దాసభక్తులను స్మరించుకోవాలి.

## దాస భక్తులు

దాస సాహిత్య వ్యాప్తిని తమ భుజస్తంధాలపై వేసుకుని కర్ణాటక దేశమంతా విస్తృతంగా పర్యటించిన కర్ణాటక హరిదాసులను తలచుకునేటప్పుడు మొట్టమొదటగా శ్రీపాదరాయలు వారిని, తరువాత వ్యాసరాయల వారిని ముఖ్యంగా పేర్కొనాలి. ఆ తరువాత కర్ణాటక సంగీత పితామహులుగా పేరుగాంచిన ఆనాటి పురందరదాసు, కనకదాసు, విజయదాసు, గోపాలదాసు, జగన్నాథదాసులతో పాటుగా ఈమధ్యకాలం నాటి శ్యామసుందరదాసు కూడా స్మరణకు తెచ్చుకోదగ్గవారు. వీరిలో కొందరు అతిముఖ్యులైన దాసభక్తుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.


## శ్రీపాదరాయలవారు

కర్ణాటక దాసులను మననం చేసుకునేటప్పుడు –

**'నమః శ్రీపాదరాజయ నమస్తే వ్యాసయోగినే!**

**నమః పురంధరార్యాయ విజయార్యతే నమః!'**

అంటూ మొట్టమొదటగా దాస సాహిత్యానికి ఆద్యుడయినటువంటి శ్రీపాదరాయలు వారిని ప్రస్తావించడం అనూచానంగా వస్తున్న సాంప్రదాయం. భౌతికమైన ఈ మాయా ప్రపంచం నుంచి తనను రక్షించువాడు, ఇహలోకంలోని క్లేశాలను దూరం చేయువాడు ఆ వేంకటాచలాధీశుడే అని శ్రీపాదరాయలు వారు నమ్మారు. శ్రీవారి మూలరూపం మరియు శ్రీమహావిష్ణువు యొక్క అవతార రూపాలకు భేదం లేదని



ప్రతిపాదించి, శ్రీమహావిష్ణువును ఉపాసన చేసి, తన జీవితాన్ని పండించుకున్నారు.

శ్రీకృష్ణదేవరాయలుతో పాటుగా ముగ్గురు విజయనగర సామ్రాట్ లకు రాజగురువుగా సేవలందించి, శ్రీవేంకటేశ్వర భక్తితత్త్వాన్ని దక్షిణ భారతదేశమంతా చాటి చెప్పిన శ్రీ వ్యాసరాయల వారి గురించి మనం ఇంతకుముందే తెలుసుకున్నాం. స్వామిపుష్కరిణీ తటాన, వారు పెక్కు సంవత్సరాల పాటు త్రికాల సంధ్యావందనాదులొనర్చిన 'వ్యాసరాజ ఆహ్నిక మండపాన్ని', ఈనాడు కూడా తిరుమలలో ప్రధానాలయపు ఉత్తర మాడవీధిలో ఆదివరాహస్వామి ఆలయానికి ఎదురుగా చూడవచ్చు.

## పురందరదాసు

'దాసరెందరె పురందర దాసయ్య' అనగా, దాసుడంటే పురందరదాసే అని తన గురువులైన శ్రీ వ్యాసరాయలవారిచే గౌరవంగా పిలిపించుకున్న పురందరదాసు వారు నారదాంశ సంభూతులు. తల్లిదండ్రులు పెట్టిన పేరు 'శ్రీనివాసనాయక్'. వంశ పారంపర్యంగా పాండురంగని భక్తులైన వారి పూర్వీకులందరూ రత్నాల వ్యాపారంలో స్థిరపడ్డారు. కాని తాత, తండ్రులకు భిన్నంగా పరమలోభిగా మారిన శ్రీనివాసనాయక్ అనువంశిక వ్యాపారాన్ని కొనసాగిస్తూ, ధనసంపాదనలో ఆసాంతం మునిగి తేలుతూ, దానధర్మాలకు, ధార్మిక కార్యక్రమాలకు తిలోదకాలిచ్చాడు. అయితే తన పూర్వజన్మ సుకృతం వల్ల సరస్వతీబాయి అనే సౌశీల్యవతితో అతని వివాహమయింది.

## పురందరదాసుగా మారిన శ్రీనివాస నాయక్

నిరంతరం రత్నాల వ్యాపారంలో వ్యస్తుడై ఉన్న శ్రీనివాస నాయక్ చెంతకు, ఒకనాడు ఓ బడుగుబాపడు కార్యార్థియై వచ్చాడు. తన ఏకైక కుమారుని ఉపనయనార్థం ధనసహాయాన్ని అందించవలసిందిగా అర్థించాడు. స్వతహాగా పిల్లికి సైతం బిచ్చం పెట్టని శ్రీనివాస నాయక్ కు ఆ విప్రునికి సాయం చేయడానికి మనసొప్పక తాత్సారం చేయసాగాడు. ఆర్థిక సహాయం కోసం పెక్కుమార్లు యాచించి వేసారిన విప్రుడు శ్రీనివాస నాయక్ గృహానికేతెంచి అతని భార్యకు మొర పెట్టుకున్నాడు. కరుణాంతరంగురాలైన సరస్వతీబాయి, వేరే ఆలోచన లేకుండా ఆభరణాల పెట్టెలో ఉన్న తన ముక్కుపుడకను తీసి విప్రునికి దానమిచ్చింది. విధివశాత్తు ఆ విప్రుడు ఆ బంగారు ఆభరణాన్ని విక్రయించడం కోసం శ్రీనివాస నాయక్ రత్నాల అంగడికే వెళ్ళాడు. తన భార్య ఆభరణాన్ని గుర్తించిన శ్రీనివాస నాయక్ ముక్కుపుడకను భద్రంగా భోషాణంలో దాచి తాళం



వేసి హుటాహుటిన స్వగృహానికి వెళ్ళి ముక్కుపుడకకై భార్యను నిలదీశాడు. దాంతో భర్త యొక్క లోభత్వాన్ని, క్రోధాన్ని ఎరిగిన సరస్వతీబాయి ఆత్మసమర్పణే మార్గాంతరమని తలంచి విషం సేవించబోయింది. దైవకృప వల్ల ఆ విషపాత్రలో ఆమెకు తన ముక్కుపుడక గోచరించడంతో, ఏమీ ఎరుగని దానిలా ఆ పుడకను తెచ్చి భర్తకు చూపించింది. అచ్చెరువొందిన శ్రీనివాస నాయక్ వెనువెంటనే దుకాణానికి వెళ్ళి చూడగా భోషాణం మూసిన తలుపులు మూసినట్లే ఉన్నాయి గాని అందులో ముక్కుపుడక మాయమయింది. సునిశితంగా ఆలోచించిన శ్రీనివాస నాయక్ కు సర్వం తేటతెల్లమైంది. ఇంతటి విచిత్రం ఘటనా ఘటన సమర్థుడైన ఆ సర్వాంతర్యామికే సాధ్యమవుతుంది. పరమాత్ముని మరచి, పారమార్థిక చింతన విడిచి, ధనమే సర్వస్వంగా భావించి, దానధర్మాలకు నీళ్ళొదిలి, భౌతిక వ్యాసంగంలో మునిగిన తనకు ఆ పాండురంగడే తన భార్య రూపంలో కనువిప్పు కలిగించాడని ఎరిగి, సరస్వతీబాయి పాదాలపై పడి శరణు వేడాడు. ఆరోజే తన సర్వసంపదలను పేదసాదలకు పంచి; కట్టుబట్టలతో, కేవలం తుంబుర – తాళాలను చేతపట్టి, భార్యాసమేతంగా పండరీపురాన్ని చేరుకున్నాడు. పాండురంగడి శరణులో, ఆ దేవదేవుణ్ణి కీర్తించుకుంటూ కొంతకాలం గడిపి, హంపీ పట్టణాన్ని చేరుకుని వ్యాసరాయలు వద్ద దీక్ష తీసుకుని భక్త 'పురందరదాసు'గా మారాడు.

తరువాతి కాలంలో 'కర్ణాటక సంగీత పితామహుడు', 'కర్ణాటక సంగీత గంగోత్రి'గా ప్రఖ్యాతి గాంచిన పురందరదాసు వారు కన్నడ, సంస్కృత భాషల్లో లక్షలాది కీర్తనలను రచించి, భక్తజనులకు అందించి, హరినామ సంకీర్తనలో ఓలలాడారు. పండిత, పామరులందరూ పురందరదాసు యొక్క హరినామ కీర్తనలలోని పదలాలిత్యానికి, భావనాపటిమకు ముగ్ధులయ్యారు. ఆ రోజుల్లో కన్నడదేశంలోని ఇంటింటా పురందరదాసు కీర్తనలు మారుమ్రోగేవి. వారి కీర్తనల ద్వారా 'విఠలుడు' వాడ వాడలకు వేంచేశాడు. పురందరదాసు యొక్క భక్తి తత్పరతను తెలియజేసే ఆసక్తికరమైన మరొక ఇతివృత్తం ప్రాచుర్యంలో ఉంది.

## అన్నసంతర్పణ

వ్యాసరాయలు వారి వద్ద దీక్ష తీసుకున్న భక్త పురందరదాసు, శ్రీనివాసుణ్ణి తన గానామృతంతో కీర్తించుకోవడం కోసం తిరుమలకుచేరుకున్నాడు.స్వామిపుష్కరిణిలోస్నానమాచరించిన అనంతరం గర్భాలయంలో శ్రీనివాసుడి దర్శనంతో భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు. కౌస్తుభమణిహారంతో, శంఖుచక్రధారుడై, చతుర్భుజుడై, శ్రీలక్ష్మీసమేతంగా విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శనంతో అప్పటివరకు పురందరదాసును ఆవరించి యున్న అజ్ఞానపు చీకట్లు చెల్లాచెదురయ్యాయి. ఆ ఆనందనిలయుణ్ణి తన అంతరంగంలోనే ఆవిష్కరించుకొని, తన్మయత్వంలో మునిగి ఆలయంలో నుండి వెలుపలికి వస్తున్న భక్త పురందరదాసును శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఒక శ్రీమంతుడు గమనించాడు. ఆ ధనవంతునికి పురందరదాసు ముఖారవిందంలో సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్కరించాడు. అతడు దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న పురందరదాసు పాదాలకు నమస్కరించుకుని, నిరుపేద వలె కానవస్తున్న ఆ భాగవతోత్తముని ఉదర పోషణార్థం కొంత పైకం సమర్పించుకోబోయాడు. అంతట, సర్వసంగ పరిత్యాగి అయిన పురందరదాసు హరియే తన సర్వస్వమని, భౌతిక సంపదలకు తాను దూరమని, తనకు ఈ జన్మలో ధనంతో నిమిత్తం లేదని చెప్పి వినమ్రంగా ఆ కానుకను తిరస్కరించాడు. అంతేకాకుండా ఆ ధనవంతునికి ఐహిక వాంఛలపై మోహాన్ని విడనాడి, భగవన్నామ సంకీర్తనతో తరించవలసిందిగా సందేశమిచ్చాడు. ఆ అమృతవాక్కులు విన్న ధనికునికి పురందరదాసు దైవాంశ సంభూతునిగా గోచరించాడు. పురందరదాసులోని దివ్యమైన సమ్మోహనశక్తికి లోనైన ఆ ధనిక భక్తుడు, వారితో ధనం స్వీకరించకపోయినప్పటికీ, కనీసం ఆ ధనంతో వారి చేతులమీదుగా, ఆకొన్న భక్తులకు అన్నసంతర్పణ చేసి, తన సొమ్ముకు సార్థకత చేకూర్చవలసిందిగా వేడుకొన్నాడు. అతని కోరిక మేరకు ఆ శ్రీమంతుడిచ్చిన కోరిక మేరకు పురందరదాసు అన్నదానానికి పూనుకొన్నాడు.

## అప్పన్న రూపంలో ఆపద మ్రొక్కులవాడు

ఆ సమయంలో 'అప్పన్న' అనే భక్తుడు పురందరదాసుకు ధార్మిక కార్యకలాపాలలో సహకరిస్తుండేవాడు. పురందరదాసు పేదలు, సాధువులు, అన్నార్తులు అందరినీ పేరు పేరునా ఆ ప్యాయంగా పలకరిస్తూ, అందరిలోనూ శ్రీనివాసుణ్ణి దర్శించుకుంటూ, షడ్రసోపేతమైన భోజనాన్ని కొసరి కొసరి వడ్డించసాగాడు. విస్తరాకులపై నేతిని వడ్డించమని తన అనుచరుడైన అప్పన్నను ఆదేశించాడు. వెంటనే అప్పన్న వచ్చి నేతిని వడ్డించగా భక్తులందరూ తృప్తిగా ఆరగించి ఆనందించారు. అన్నసత్రంలో సంతర్పణ కార్యక్రమాన్ని ముగించుకున్న పురందరదాసు సంతృప్తాంతరంగుడై స్వగృహానికి వెళుతుండగా, అప్పుడే స్వామి పుష్కరిణిలో స్నానం చేసి వస్తున్న అప్పన్న తారసపడ్డాడు. గురువుగారైన పురందరదాసుకు నమస్కరించి అప్పుడే తాను స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి వస్తున్నానని పలికాడు. దానికి కోపోద్రిక్తుడైన పురందరదాసు స్నానం చేయకుండా భోజనం ఎలా వడ్డించావని ప్రశ్నించి పరుషవాక్కులు పలికాడు. దానికి అచ్చెరువొందిన అప్పన్న తాను గంట క్రితమే పుష్కరిణికి వెళ్ళానని, ఇప్పుడే స్నానం ముగించుకొన్నానని, వడ్డన ప్రారంభమవుతుందేమోనన్న ఆత్రుతతో వడివడిగా వస్తున్నానని వివరించాడు. ఆశ్చర్యచకితుడైన పురందరుడు వెనుకకు వెళ్ళి అన్నసత్రంలో చూడగా, అప్పటివరకు అక్కడే ఉన్న అప్పన్న జాడ కానరాలేదు. జరిగిన ఉదంతమంతా చూసిన పురందరునికి అసలు విషయం బోధపడింది. తన భక్తుడు అత్యంత నిష్ఠతో, అన్నార్తులందరిలో తననే దర్శించుకుంటూ చేస్తున్న అన్న సంతర్పణలో కాలాతీతమవ్వడం సహించలేని ఆ శ్రీనివాసుడే అప్పన్న రూపంలో వచ్చి నేతిని వడ్డించాడన్నమాట! ఎంతటి శరణాగతవత్సలుడీ వేంకటేశ్వరుడు!! పురందరదాసు ఆ శ్రీనివాసుణ్ణి ప్రత్యక్షంగా దర్శించుకున్న మధురానుభూతితో తృప్తిగా ఆనందాశ్రువులు రాల్చి, అన్నసంతర్పణలో స్వయంగా వచ్చి వడ్డించిన వైకుంఠవాసుణ్ణి పదే పదే కీర్తించి, పరమానంద భరితుడై; తన హరినామ సంకీర్తనా వ్యాసంగాన్ని మరింత జోరుగా కొనసాగించాడు.

## సంగీత, సాహిత్య సాధన

పరంధాముని ప్రత్యక్షదర్శనంతో పునీతుడైన పురందరదాసుల వారు పెక్కుమార్లు తిరుమల క్షేత్రాన్ని దర్శించుకొని, శ్రీవేంకటేశ్వరుని స్తుతిస్తూ లక్షలాది కీర్తనలను అక్షరబద్ధం చేశారు. తన కీర్తనలలో తిరుమల క్షేత్ర మాహాత్మ్యాన్ని, శ్రీనివాసుని లీలలను, కొండపైనున్న ప్రకృతిని, వృక్ష – జంతు జాతులను, పుష్కరిణి మహత్యాన్ని, శ్రీవారి సేవల వైభవాన్ని, తత్కాలీన సామాజిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు



వీనులకింపుగా వర్ణించాడు.

కనులు మూసినా, తెరచినా ఆ సర్వాంతర్యామినే తన భౌతిక – మనో నేత్రాలతో గోచరింప చేసుకున్న ధన్యజీవి పురందరదాసుకు సర్వమూ శ్రీనివాసుడే. ఏనాడైనా, ఏ కారణం చేతనైనా శ్రీవేంకటేశ్వరుని దర్శనం క్షణకాలం ఆలస్యమైతే విరహ వేదనతో విరక్తి చెందేవాడు.

శ్రీవారి సేవలో, సాహిత్య సాధనలో ఎనుబది సంవత్సరాలు తరించిన ఆ కన్నడ వాగ్గేయకారుడు 1564 వ సంవత్సరంలో భౌతికంగా జీవితం చాలించినప్పటికీ, వారి సమ్మోహన పూరితమైన సంకీర్తనా గానంతో శ్రీవారి భక్తులు, సంగీత ప్రియుల హృదయాలలో అమరుడయ్యాడు. శ్రీవేంకటేశ్వరుని భక్తితత్వాన్ని దక్షిణభారతదేశమంతటా ప్రచారం చేసిన పురందరదాసుల వారి సంగీత సాధనకు గుర్తుగా, అలిపిరిలో శ్రీవారి పాదాల వద్ద వారి విగ్రహం ప్రతిష్ఠించబడింది.

వారు రచించిన, ఆశువుగా కీర్తించిన నాలుగు లక్షల ఇరవై అయిదు కీర్తనలలో కేవలం వెయ్యి మాత్రమే నేడు లభ్యమయ్యాయి. సింహభాగం కోల్పోయినప్పటికీ వారి మిగిలిన కీర్తనలనైనా తెలుగువారి ముంగిటకు తీసుకువచ్చే ఉద్దేశ్యంతో చేపట్టబడ్డ బృహత్తరమైన కార్యక్రమమే 'దాససాహిత్య' ప్రాజెక్టు. పురందరదాసు వారి కీర్తనలతో పాటుగా, ఇంకెందరో దాసభక్తుల కీర్తనలు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా వెలుగులోకి వచ్చాయి.

**(ఇంకా ఉంది)**

# విష్ణు సహస్రనామ మహిమ

# సనాతన ధర్మం

పూర్వం పూరీ నగరంలోని జగన్నాథ పురంలో ఒక మహాపండితుడు భార్యతో సహా ఒక పూరిగుడిసెలో నివాసముండెడివాడు. ఇతను శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడు. పూట గడవని దారిద్ర్యస్థితి అతనిది. ప్రతి నిత్యమూ విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణ చేసి ఈతడు ఆ ఊరిలో మూడిళ్ళ వద్ద భిక్షాటనకు వెళ్ళేవాడు. ఆ వచ్చినదానితో కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య మాత్రం పరమ గయ్యాళి. దైవం పట్ల నమ్మకం లేనిది. ఎటువంటి నియమాలనూ పాటించనిది. ఇంటిలో భార్య పోరు ఎంత ఇబ్బందిగా ఉన్నా ఈతడు హరినామ స్మరణను విడువలేదు.

ప్రతి నిత్యమూ చేయుచున్న విధముగా ఆరోజు కూడా విష్ణు సహస్ర పారాయణము చేయుచుండగా భార్య వచ్చి భర్తతో "ఏమిటి చేస్తున్నావు?" అని గద్దించి అడిగింది. దానికి ఆ భర్త "విష్ణు సహస్ర నామస్తోత్రం పారాయణ చేస్తున్నానన్నాడు. అందుకు భార్య "ప్రతిరోజూ స్తోత్రం చేస్తూనే ఉన్నావు కదా. ఏమిచ్చేడు ఆ శ్రీమహావిష్ణువు అడుక్కోవడానికి భిక్షాపాత్ర తప్ప" అంది. అక్కడితో ఆగక "ఏదీ! నువ్వు చదువుతున్నది ఏమిటో చెప్పు" అన్నది. అందుకు ఆ భర్త "వెయ్యి నామాలే! ఏమిటి చెప్పేది? నీకేమిటి అర్థమౌతుంది? ఎప్పుడూ పాడు మాటలే మాట్లాడే నీకు విష్ణు సహస్రనామాలేమి అర్థమౌతాయి?" అన్నాడు. ఆ భార్య మాట్లాడుతూ "వెయ్యి నామాలక్కర్లేదు. మొట్టమొదటిది చెప్పు చాలు" అన్నది. అందుకు ఆ భర్త "విశ్వం విష్ణుః" అని ఇంకా చెప్పబోతూ ఉంటే భార్య "ఆపు అక్కడ! దీనర్థమేమిటో చెప్పు" అన్నది. అందుకు ఆ భర్త "విశ్వమే విష్ణువు, ఈ ప్రపంచమంతా విష్ణుమయమే" అని వివరించగా "ప్రపంచమంతా విష్ణువే అంటున్నావు. అందులో నువ్వూ నేనూ ఉన్నామా? ఉంటే యాచిస్తే గాని తిండి దొరకని కటిక పేదరికాన్ని అనుభవిస్తూ పూరిగుడిసెలో జీవితాంతం దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఉండి కూడా ప్రతిరోజూ నువ్వు ఆ శ్రీమహావిష్ణువుని గానం చేస్తున్నావే? అయినా నీ విష్ణువు నిన్నేమైనా కరుణించాడా? కనుక నువ్వు చెప్పిన మంత్రానికి అర్థం లేదయ్యా!" అంది. భార్య మాటలకు సందేహంలో పడిన భక్తుడు "నా భార్య మాటలు కూడా నిజమేనేమో! విశ్వమంతా విష్ణువే అయితే మా పరిస్థితి ఇలాగ ఎందుకు ఉండాలి? కనుక "ఈ మంత్రంలో విశ్వం" అనే పదాన్ని చెరిపేస్తానని నిశ్చయించుకుని ఒక బొగ్గు ముక్కతో "విశ్వం" అనే పదాన్ని కనబడకుండా మసిపూసి (తాటాకు ప్రతి ఉండేదట. ఈ భక్తుడి ఇంట్లో). ఎప్పటిలాగే యాచనకై బయలుదేరి వెళ్ళిపోయాడట.

ఆ తరువాత వైకుంఠంలో ఒక విచిత్రం జరిగింది. ప్రతి నిత్యమూ పాల సముద్రంలో శ్రీమహావిష్ణువును శ్రీమహాలక్ష్మి సేవిస్తున్నట్లుగనే ఆ రోజు కూడా స్వామిని సేవిస్తూ ఒకసారి స్వామి ముఖాన్ని చూసి అమ్మవారు ఫక్కున నవ్విందట. అందుకు శ్రీమహావిష్ణువు "ఏమిటి దేవీ? ఈరోజు నన్ను చూసి ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగితే అమ్మవారు "నాథా! మిమ్ములను నల్లని వాడని, నీలమేఘశ్యాముడని అందరూ స్తుతించడం విన్నాను. కానీ అంతమాత్రం చేత ఆ నల్లటిరంగును ముఖానికి కూడా పూసుకోవాలా?" అని పరిహాసమాడగా శ్రీమహావిష్ణువు తన ముఖాన్ని పాలసముద్రంలో ప్రతిబింబం చూసుకుంటే తన ముఖానికి పూసిన నల్లరంగు కనబడిందట. వెంటనే శ్రీమహావిష్ణువు జరిగినదంతా దివ్యదృష్టితో గమనించాడట. లక్ష్మీదేవి "ఏమిటి స్వామీ ఆలోచిస్తున్నారు? మీ ముఖముపై ఆ నల్లనిరంగుకు గల కారణమేమిటో తెలిసిందా?" అని అడుగగా స్వామి "దేవీ! ఇది నా పరమభక్తుడు చేసిన పని" యని పలికాడుట. లక్ష్మీదేవి "అదేమిటి స్వామీ! పరమభక్తుడంటున్నారు. అతడెందుకిలా చేస్తాడ'ని యడుగగా స్వామి తన భక్తుని జీవిత దీనస్థితిని వివరించగా లక్ష్మీదేవి "అంతటి పరమభక్తుని దీనస్థితికి కారణమేమి? మీరాతనిని ఉద్ధరింపలేరా? స్వామీ!" అని అడుగగా "దేవీ! గత జన్మలో ఈ భక్తుడు గొప్ప ధనవంతుడే. ఐనప్పటికీ ఎన్నడూ ఎవరికీ దానమిచ్చి ఎరుగడు. కనుకనే ఈ జన్మలో భక్తుడైననూ దరిద్రం అనుభవించుట తప్పలేదు. అయిననూ నీవు కోరితివి కనుక నేటితో ఈతనికి కష్టములు తొలగించెదన"ని పలికి మానవరూప



ధారియై ముఖానికి వస్త్రము చుట్టుకొని విష్ణుమూర్తి కొంతమంది పరివారం తో సరాసరి భక్తుడి ఇంటికి వచ్చి తలుపు తట్టగా అప్పటికే ఆ భక్తుడు యాచనకై ఇల్లు వదిలిపోయాడు. ఇంటి ఇల్లాలు వచ్చి తలుపు తీయగా ఎదురుగా మారువేషములో నున్న శ్రీమహావిష్ణువు ఆ ఇల్లాలితో ''అమ్మా! నీ భర్త వద్ద నేను అప్పుగా తీసుకున్న సొమ్మును తిరిగి తీర్చుటకు వచ్చితిని. సొమ్ము తీసుకొనవలసినద''ని చెప్పగా ఆ ఇల్లాలు ''నీవెవరివో నాకు తెలియదు. కానీ మేమే కటిక దారిద్ర్యంలో ఉన్నాము. నా భర్త ఒకరికి అప్పు ఇచ్చేంత ధనవంతుడు కాదు. ఎవరనుకుని మా ఇంటికి వచ్చారో వెళ్ళిపొమ్మ''ని తలుపు వేయబోతూ ఉండగా స్వామి ''లేదమ్మా! నేను పొరబాటు పడలేదు. అసత్యమసలే కాదు. నీ భర్త వద్ద అప్పుగా తీసుకున్న సొమ్ము ఇదిగో నువ్వు స్వీకరించు. నీ భర్తకు నేను తరువాత వివరిస్తాను'' అని ఆమెకు అశేష ధన, కనక, వస్తు వాహనాలు, మణి మాణిక్యాలు, సేవక జనం, తరాలు తిన్నా తరగని ఆహార ధాన్యాలు కానుకగా ఇచ్చి వెళ్లిపోతూ ఉండగా ఆ ఇల్లాలు ''ఓయీ! నీ ముఖం మీద కప్పియున్న వస్త్రాన్ని తొలగించి నీ ముఖాన్ని నాకు ఒకసారి చూపించు. నా భర్తకు చెప్పాలి కదా! నువ్వు ఎలా ఉంటావో?'' అని పలుకగా స్వామి ''అమ్మా! నా ముఖాన్ని నీకు చూపలేను. నా ముఖం మీద ఎవరో నల్లరంగు పూసేరమ్మా! నేనెవరో నీ భర్తకు తెలుసులే'' అని పలికి విష్ణుమూర్తి వెనుదిరిగి వెళ్ళి కొంతదూరం పోయాక అంతర్ధానమయ్యాడు.

ఇంతలో ఊరిలో యాచనకు వెళ్ళిన భక్తుడు ఇంటికి తిరిగి వచ్చి చూడగా అతని పూరిగుడిసె ఉండాల్సిన ప్రదేశంలో కళ్ళు మిరుమిట్లు గొలిపే అద్భుతమైన భవంతి దర్శనమిచ్చింది. అనేకమంది సేవకులూ, ఉద్యానవనాలతో కళకళలాడిపోతోంది ఆ భవనం. ఇంతలో ఆతని భార్య లోపలినుండి వచ్చి ''లోపలికి రమ్మ''ని భర్తనిఆహ్వానించగాతనభార్యనిగుర్తుపట్టలేకపోయాడు. ''అసలు ఆ సంపదని ఎందుకు స్వీకరించావు? మనము ఎవరికో అప్పివ్వడమేమిటి? అది తిరిగి వారు తీర్చడమేమిటి? మన దీనస్థితి నీకు తెలియదా?'' అంటూ భార్యపై ప్రశ్నల వర్షం కురిపించాడు. అనంతరంగా జరిగినదంతా భార్య నోటివెంట విన్న తరువాత తన చెవులను తానే నమ్మలేకపోయాడు. అయితే వచ్చినవాడు ఎలా ఉన్నాడు? అతడి ముఖము ఎలాగ ఉన్నది? అని భార్యని ప్రశ్నించగా ''నేను అతడి ముఖాన్ని చూడలేదు. అతడి ముఖముపై ఎవరో నల్లరంగు పులిమారట. ముఖము చూపించలేనంటూ వస్త్రంతో ముఖాన్ని కప్పుకున్నాడు. అయినా అతడు వెళుతూ వెళుతూ ''నా గురించి నీ భర్తకు పూర్తిగా తెలుసమ్మా'' అని చెప్పి వెళ్ళిపోయాడన్న''ది. అది వినిన భక్తుడు హతాశుడై భార్యతో ''వచ్చినవాడు మరెవరో కాదు. మారువేషంలో వచ్చిన సాక్షాత్తు శ్రీమహావిష్ణువే. ప్రతి నిత్యమూ నేను విష్ణువును స్తుతిస్తున్నా ఆ స్వామిని దర్శించుకోలేకపోయాను. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో నీకు స్వామి దర్శనభాగ్యం కలిగింది'' అని పలికి ఇంటి లోపలికి వెళ్ళి ఉదయం విష్ణు సహస్రనామాలలో మొట్టమొదటి ''విశ్వం'' అనే నామంపై పులిమిన నల్లరంగును తొలగించాడు. తరువాత భార్యతో ''నీతో మాట్లాడిన తరువాత ఆ వ్యక్తి ఏ దిక్కుగా పోయినాడన''గా భార్య చెప్పిన తూర్పుదిక్కుగా భక్తుడు బయలుదేరిపోగా సముద్రము ఒడ్డుకు చేరుకున్నాడు. అక్కడ సముద్రం వైపుకు తిరిగి ఊర్ధ్వ దిక్కుగా చేతులు జోడించి శ్రీమహావిష్ణువును ఉద్దేశించి స్తోత్రగానం చేశాడు. అప్పుడు అశరీరవాణి ''భక్తా! పూర్వజన్మ కర్మఫలముల కారణంగా ఈ జన్మలో నీకు భగవద్దర్శనము కలుగదు. మరణానంతరం నీవు వైకుంఠానికి చేరి జన్మరాహిత్యాన్ని పొందెదవు'' అని పలికింది.

విష్ణు సహస్ర నామ నిత్య పారాయణ వలన కలుగు ఫలితమిదియని అందరూ గ్రహించండి. ప్రతి నిత్యమూ పఠించండి. అవసరార్థులకు సహాయం చెయ్యండి.



భారతీయ సంస్కృతిలో ప్రదక్షిణ, నమస్కారము, జపము, ఉపవాసము, వ్రతము, పసుపు, కుంకుమ, ధూపము, దీపము, నైవేద్యము, శంఖనాదము, ఘంటానాదము, మడి ఇలా అనేక విషయాలకు ఎంతో విలువ, గౌరవము, ప్రాధాన్యత ఉన్నాయి. మన సంస్కృతిలో ఉన్న ప్రతి విషయానికి, ఆచారానికి, అలవాట్లకి గొప్ప అర్థం ఉంది. వాటిలో గొప్ప వైజ్ఞానికత, ఆరోగ్యపరమైన సూచనలు నేటి సైన్సుకు అందని అనేక రహస్యాలు, వాటి నిరూపణలు ఇలా ఎన్నెన్నో ఉన్నాయి. వాటిలో దాగి ఉన్న సత్యాన్ని, రహస్యాల్ని తెలుసుకుని ఆచరించే ప్రయత్నం చేయడానికే ఈ వ్యాసం.

# ప్రదక్షిణ

– డా|| మునిపల్లె బాలసుబ్రహ్మణ్య శర్మ

ప్రదక్షిణ : మనం పూజలు చేసుకున్న తరువాత గాని, పారాయణలు, నోములు, వ్రతాలు వంటివి చేసుకున్న తరువాత గాని, దేవాలయాలకు వెళ్ళినప్పుడు గాని ఆత్మ ప్రదక్షిణలు, ప్రదక్షిణలు చేస్తూ ఉంటాము. ఈ ప్రదక్షిణలు ఎందుకు చేయాలో అగస్త్య మహర్షి ఋషులతో ఇలా చెప్తున్నాడు.

**శ్లో || "సర్వపాపహరం చైవ సర్వదాన ఫలప్రదమ్ |**
**సర్వరోగ ప్రశమనం చరేత్త స్మాత్ ప్రదక్షిణమ్ ||**

అంటే ప్రదక్షిణము అన్ని పాపాలను నశింపచేస్తుంది. సర్వదానాలు చేసిన ఫలము కలుగుతుంది. సర్వరోగములు నివారించబడుతాయి. కాబట్టి ప్రదక్షిణములను చేయాలి. ప్రదక్షిణమనేది కొన్ని సంకేతముల సమూహము. ఎలాగంటే –

**శ్లో || ప్ర ఛ్ఛినత్తి భయం సర్వం, దకారో మోక్ష సిద్ధి దః |**
**క్షి కారాత్ క్షీయతే రోగో, ణకారః శ్రీ ప్రదాయకః |**

**ప్రదక్షిణార్థం సంయోగాన్ ప్రదక్షిణమితి స్మృతమ్ ॥**

ప్ర – అనే అక్షరం – భయములనన్నింటిని తొలగిస్తుంది.

ద – కారము – మోక్ష సిద్ధిని కలిగిస్తుంది.

క్షి – కారము – సర్వ రోగాలను క్షీణింప చేస్తుంది.

ణ – కారము – శ్రీని అనగా సంపదలను కలిగిస్తుంది.

పైన చెప్పబడిన అన్ని ప్రయోజనాలు కలగడానికి కూర్చబడినదే ప్రదక్షిణ. ప్రదక్షిణ ఎటునుండి ఎటు తిరగాలి అంటే –

ప్రదక్షిణ లోని 'దక్షిణ' అనేది 'కుడి' వైపును సూచిస్తుంది. ఎలాగంటే దక్షిణ హస్తం అంటే కుడి చేయి అని అర్థం. మనం భగవంతునికి ఎదురుగా నిలబడినప్పుడు భగవంతుని కుడిచేయి ఎటు ఉంటుందో అటువైపునుంచి మనం ప్రదక్షిణ చేయాలని గ్రహించాలి. (ఇప్పటి కాలానికి అర్థమవాలంటే క్లాక్ వైజ్ గా చేయాలి)

ఈ ప్రదక్షిణమును ఆచరించడానికి మనం పాటించాల్సిన నియమాలను నాలుగు అంగాలుగా తెలియజేశారు.

**శ్లో ॥ పదాత్ పదాన్తరం గచ్ఛేత్, కరౌ చలన వర్జితే ।**
**స్తుతిర్వాచి, హృది ధ్యానం, చతురంగ ప్రదక్షిణమ్ ॥**

అంటే –

1. ప్రదక్షిణను మొదలు పెట్టినప్పటినుండి కాలితో నడుచుటకు అడుగు వేసిన తరువాత దాని వెనుకనే ఇంకొక అడుగు, దాని వెనుకనే ఇంకొక అడుగు అట్లా అడుగు వెనక అడుగు వేసుకుంటూ నడవటం.

2. చేతులు కదల్చకుండా ఉంచటం – ఎలా అంటే నమస్కార ముద్రలో ఉంచి అడుగులు వేయటం.

3. భగవంతుని మనకు తెలిసిన, మనకు వచ్చిన స్తుతులు, స్తోత్రాలు లాంటివి గానం చేస్తూ వెళ్ళటం.

4. మనస్సులో భగవంతుని ధ్యానించుకోవటం

అనేవి చేస్తూ ప్రదక్షిణలు చేయాలి. ఇవే ప్రదక్షిణకు ఉన్న నాలుగు అంగాలు.

ఇంకా మనకు ప్రదక్షిణము చేసే విధానాన్ని తేలికగా తెలుసుకోవడానికి ఇలా చెప్పారు.

**శ్లో ॥ ఆసన్న ప్రసవా నారీ, తైలపూర్ణం యథా ఘటమ్ ।**
**వహన్తి శనకై ర్యాతి తథా కుర్యాత్ ప్రదక్షిణమ్ ॥**

నెలలు నిండిన గర్భిణీ స్త్రీ నూనెతో నింపిన పాత్రను (కుండను) పట్టుకుని దానిలో నూనె ఎక్కడ తొణికిపోతుందో అని ఎంత మెల్లగా నడుస్తుందో అట్లాగ ప్రదక్షిణము కూడా అంత మెల్లగా అడుగులు వేస్తూ చేయాలి. పైన చెప్పిన శ్లోకాల సారాంశం – ప్రదక్షిణం చేసేటప్పుడు భక్తి, శ్రద్ధలతో చేయాలి కాని, మాట్లాడుతూ పరధ్యానంగా చేయకూడదు అని తెలుసుకోవాలి.

దేవాలయాలలో చేసే ప్రదక్షిణములకు ఎంత గొప్ప ఫలితం



ఉందో స్కాంద పురాణంలో –

**శ్లో ॥ దేవాలయేతు రాజేంద్ర యశ్చ కుర్యాత్ ప్రదక్షిణాం ।**
**ప్రదక్షిణీకృతా తేన స సాగరధరా ధరా ॥**

దేవాలయాలలో ప్రదక్షిణములు చేసినట్లయితే సముద్రములు, పర్వతాలతో కూడిన భూమి అంతా ప్రదక్షిణము చేసినట్లే అని చెప్పబడింది.

ఈ ప్రదక్షిణములు ముఖ్యముగా మూడు రకాలుగా గుర్తించవచ్చు. ఆత్మ ప్రదక్షిణ, దేవాలయ ప్రదక్షిణ, అంగ ప్రదక్షిణ. అంగ ప్రదక్షిణ కూడా దేవాలయ ప్రదక్షిణే. ఈ ప్రదక్షిణలలో దాగి వున్న రహస్యాన్ని గమనిస్తే ఆత్మ ప్రదక్షిణ – భూభ్రమణానికి అంటే భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ఉండటం. అంగప్రదక్షిణమంటే తన చుట్టూ తాను తిరుగుతూ దేవాలయములో దేవుని ప్రాంగణములో ప్రధాన ఆలయం చుట్టూ తిరగడం. అంటే పరిభ్రమణం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ ఉండటం వల్ల పగలు – రాత్రి ఏర్పడతాయని, సూర్యుని చుట్టూ తిరగడం వల్ల ఋతువులు, అయనములు, సంవత్సరాలు ఏర్పడతాయని ఇలా కాలచక్రాన్ని సూచించే విజ్ఞానాన్ని ప్రదక్షిణ రూపంలో నిక్షిప్తం చేసి మన ప్రాచీనులు మనకు అందించారు.

ప్రత్యక్ష దైవాలైన తల్లితండ్రుల చుట్టూ తిరగటం – అంటే ప్రదక్షిణం చేయటం వల్ల భూ ప్రదక్షిణం చేసినట్లేనని విఘ్నేశ్వరుని గణాధిపత్య విషయంలో మనం తెలుసుకున్నాం. గో ప్రదక్షిణ కూడా భూప్రదక్షిణతో సమానం. అందునా దూడను కనేటప్పుడు చేసే గోప్రదక్షిణ మరింత పుణ్యప్రదం. మూడు లోకాలు ప్రదక్షిణ చేసినంత ఫలితమని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి. గౌతమ మహర్షి అలా గో ప్రదక్షిణ చేసే కదా బ్రహ్మదేవునిచే అహల్యను పొంది ఇతర మహర్షులకు దక్కని అదృష్టాన్ని పొందాడు.

ప్రదక్షిణ యొక్క ప్రయోజనం తెలుసుకున్నారు కదా! కాబట్టి మన పెద్దలు చెప్పిన ఆచారాలు ఆచరిద్దాం. సుఖంగా ఉందాం.

# శ్రీవేంకటేశ్వర తత్వం

**- మందరపు వి.జి.శంకరాచారి**

వైకుంఠవాసి... స్థితికర్త... లోకపాలకుడు... భక్తజన రక్షకుడు... దీనజన బాంధవుడు అయిన శ్రీమన్నారాయణుడు... ఈ పుడమిని పునీతం చేయడానికి... దుష్టులను శిక్షించడానికి... శిష్టులను రక్షించడానికి వివిధ రకములైన అవతారములతో ఈ భువిపై అవతరిస్తూనే ఉన్నాడు. అలా నారాయణుడు దివినుండి భువికి దిగి వచ్చిన అవతారములలో ముఖ్యమైనవి దశావతారములని పురాణములు ఉటంకిస్తున్నా... మరెన్నో అవతారములతో ఈ భువిపైన... నడయాడి... అవనిని అమృతమయం చేస్తూనే ఉన్నాడు.



ఆ విధంగా శ్రీమన్నారాయణుడు నేరుగా వైకుంఠం నుండి దిగి వచ్చిన అద్భుత అవతారమే శ్రీవేంకటేశ్వర అవతారం.

భవ్యమైన, దివ్యమైన శ్రీవేంకటేశుని దివ్యమంగళ విగ్రహాన్ని ఎన్నిసార్లు చూసినా ఇంకా ఇంకా చూడాలనే ఉంటుంది తప్ప మన మనసులలో తృప్తి కానరాదు. అటువంటి తేజోమయ రూపం శ్రీవేంకటేశునిది. సప్త జన్మలుగా ఎదుర్కొంటున్న తన భక్తుల పాపాలను హరించడానికి సప్తగిరీశుడై వేంకటాద్రిపై శిలారూపధారియై వెలిశాడు. ఇందులోని పరమార్థం...

భక్తులు కొండపైకి ఎక్కుతున్న కొలదీ క్రిందనున్న దుకాణాలు, వస్తువులు, వాహనాలు, జంతువులు, మనుషులు అన్నీ సూక్ష్మమైపోతూ గోచరిస్తూ ఉంటాయి. చివరకు స్వామి దగ్గరకు చేరుకుని క్రిందకు చూస్తే అన్నీ సూక్ష్మాతి సూక్ష్మమై పిపీలికాలుగా దర్శనమిస్తాయి. అంటే భక్తుల హృదయాలలో నిండిన ప్రాపంచిక విషయాలు, అనుభవాలు, అనుభూతులు, కోర్కెలు ఇవన్నీ అల్పమని, సూక్ష్మాతి సూక్ష్మమని గ్రహించి చివరకు తాము నిమిత్త మాత్రులమని పరమాత్మ దగ్గరకు చేరుకునేసరికి భక్తుల మనసులన్నీ బంధాలనుండి విడివడి ఆలోచనారహితుడై కోర్కెలన్నీ శూన్యపోయి తన పాదాల దగ్గరకు చేరుకోవాలన్నది స్వామివారి అంతరార్థం.

స్వామివారికి పెట్టిన మూడు నామాలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఏకత్వమే నేను అని మనకు చెప్పకనే చెబుతుంది.

ఆ కరుణాపూరిత నయనాలు ఎప్పుడూ భక్తులపట్ల ప్రేమామృత దృక్కులతో చూస్తూ ఉంటాయి. ఆ నయన కాంతుల వెలుగు మనందరికీ ముక్తి దారిని చూపిస్తున్నాయి.

పాపాలను హరించి తన భక్తులను రక్షించడానికి శంఖనినాదంతో వస్తున్నానంటూ పాంచజన్యం... ఏడేడు జన్మల నుండి వెంటాడుతున్న పాపాలను ఖండించడానికి సుదర్శన చక్రాన్ని కలిగియున్నానని శ్రీవేంకటేశుడు మనందరికీ తెలియపరుచుతున్నాడు.

తన భక్తులైనవారికి తనలో కొలువైయున్న శ్రీదేవీ, భూదేవి కూడా తనతోపాటుగా వచ్చి ముక్తుల ముంగిట నిలబడి వారిని తన సన్నిధిలోకి తీసుకుని తామే వారి జీవితాలకు సోపానాలను కడతామని శ్రీవేంకటేశుని వక్షస్థలం చెబుతోంది.

నిష్కల్మష భక్తులను శ్రీవేంకటేశుడు తన వామహస్తంతో కటిభాగం వరకు పట్టుకుని రక్షణ కల్పిస్తానని, మరి మరుజన్మల కుండా మోక్షాన్ని ప్రసాదిస్తానని, అందుకొరకు శరణాగతుడవై తన చరణాలను నమ్మమని తెలియజేస్తూ కుడిచేయి అభయముద్రతో చరణాలను చూపిస్తూ ఉంటుంది.

భక్తులను రక్షించడానికి తను నిలబడి వెలిసానని... అలా కాకుండా మరియొక భంగిమలో (కూర్చుని గాని, శయనిస్తూ గాని) అవతరించిన యెడల తన భక్తులను రక్షించడానికి లిప్తపాటు కాలమైనా ఆలస్యమవుతుందని, అలా కాకుండా ఉండాలనే తన యొక్క శిలావిగ్రహం నిలబడి ఉందని, భక్తులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు పరుగిడి భక్తుని రక్షించడానికి వీలవుతుందని చెప్పకనే చెబుతున్న శ్రీవేంకటేశ్వరుని తత్వం అమోఘమైనది.

నఖ శిఖ పర్యంతం స్వామివారిని గమనిస్తే శ్రీవేంకటేశ్వరుని తత్వమేమిటో అర్థమవుతుంది. ప్రేమస్వరూపి అయిన శ్రీవేంకటేశ్వరుని కరుణాపూరిత దృక్కులే మనందరికీ రక్ష... రక్ష... రక్ష. అందుకే స్వామివారి తత్వమును అర్థం చేసుకుని శరణార్థులమై పాహిమాం... పాహిమాం... రక్షమాం... రక్షమాం అంటూ ఆ దివ్య చరణముల ముందు బ్రహ్మ కడిగిన పాదములపై మన తలను ఆనించి మోకరిల్లుదాం. సాష్టాంగపడదాం.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు. ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు కుటుంబంలో ప్రేమను పెంచుకొని ఇంట గెలిచి రచ్చ గెలవటం. చాకచక్యంగా అందరితో ద్వేషపూరితమైన సమస్యలు వచ్చినా మీ ఓర్పు మిమ్ములను కాపాడుతుంది. నూతన వ్యక్తుల పరిచయాలు అనుకూలంగా ఉండగలవు. మహన్యాస రుద్రాభిషేకం చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు పై అధికారుల వలన ఒత్తిడి. ఆకస్మిక కలహములు. జాయింటు వ్యాపారులకు మాట పట్టింపులు. కొన్ని సందర్భములలో నిర్ణయం చేయుట చాలా కష్టంగా ఉంటుంది. మీ మాటకు విలువ ఇవ్వకపోవుట, ఆకస్మిక తగాదాలు. నవగ్రహ ప్రదక్షిణలు దానాలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ప్రయాణాలు లాభించగలవు. ఆకస్మిక ధనము వచ్చును. బంధుమిత్రుల కలయిక ఉంటుంది. సరస్వతి కవచము, లక్ష్మీ కవచము, కనకధార స్తోత్రం చేయండి. ఆర్థికంగా సంతృప్తి ఉంటుంది. నమ్మకంగా భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే ఆనందంగా ఉంటారు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రయాణములలో ఆకస్మిక ప్రమాదములు పొంచి ఉన్నవి. శకునం చూసి బయలుదేరగలరు. తొందరపాటు వలన అనేక విధములుగా ఇబ్బందులు పడవలసి ఉన్నది. ఆగి ఆలోచన చేయండి. ఏమి జరుగుతుందో అర్థంకాదు. ఆదాయ వనరులు బాగుండగలవు. అమ్మవారి ఆరాధన చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగును. వ్యాపార లాభములు అధిక ఖర్చులు శత్రువులను అలా ఉంచండి. వారు మీదారికి రాగలరు. అసలు ఏమి అర్థం కాదు. బ్యాంకు అప్పులు చేయవలసి వస్తుంది. చాలా జాగ్రత్తగా ఉండండి. నవగ్రహ ఆరాధన చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు చాలా విషయములలో అనుకూలత కలిగి ఉండగలరు. ఆయుధముల వలన ప్రమాదములు కలిగి ఉన్నారు. చాలా జాగ్రత్తగా ఉండండి. మానసిక సమస్యలు కలిగి ఉన్నారు. తక్కువగా మాట్లాడగలరు. నవగ్రహ ప్రదక్షిణలు దానాలు చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నిరంతరం దుర్గాదేవి స్మరణ, ఈశ్వర ఆరాధ న, కార్తీకమాస దీపారాధన విజయమునకు శుభసూచకం. బం ధుమిత్రుల అభినందనలు. ప్రతి విషయంలో అనుకూలత. వివాహ ప్రయత్నములలో సంతృప్తి ఉంటుంది. సత్యదేవుని వ్రతమాచరించండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. గృహం, ఫ్లాట్ ఏదో ఒకటి కావాలని పట్టుదలతో ఉంటారు. అనుకొన్న పనుల్లో ఆటంకములు తొలగును. ప్రతి విషయంలో ప్రేమగా ముందుకు రాగలరు. శ్రీ వేంకటేశ్వర స్వామి అలంకరణ చేసి చక్కెర పొంగళి ప్రసాదం పెట్టండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా నిబ్బరంగా ధైర్యంగా ముందుకు సాగండి. అనుకూలమైన రోజులు. మీరు తలపెట్టిన పనులు విజయవంతంగా జరుగుతాయి. వస్తువాహన గృహనిర్మాణం అలంకరణ విషయంలో సమకూర్చుకొనగలరు. వినాయక, సరస్వతి, చిత్రగుప్తుని ఆరాధించండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు గత మాసములు కన్నా కొంత వెసులుబాటు ఉంటుంది. చాలా జాగ్రత్తగా ఆలోచన చేసి నిర్ణయములు చేయండి. ఎవరికి ఏ విధమైన హామీలు ఉండరాదు. జాగ్రత్తలు తీసుకొన్నన్ని రోజులు అనుకూలంగా ఉంటుంది. సుబ్రహ్మణ్యేశ్వర పూజలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఎన్నో విధములుగా పట్టుదలతో ఉండి కార్యదీక్షాపరులుగా ప్రయత్నములు చేయండి. ఏదో దోషం వలన పని అనుకూలత లేదు. కత్తిమీద సాములాగా ఉన్నది. అనుకోని నిరాశ చెందరాదు. వినాయక కుమారస్వామి పార్వతి పరమేశ్వరులను పూజించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. దూర ప్రయాణములలో సంతృప్తి. ఎన్నో నెలల నుండి పెండింగ్లో ఉన్న పనులు నెరవేరుటకు మీ ప్రయత్న లోపం లేకుండా చూసుకొనగలరు. ఆధ్యాత్మికంగా ధ్యానం, యోగ వలన ఆనందం. ఈశ్వర ఆరాధన శక్తిని నింపగలదు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. స్వామి ఆవిర్భవించిన రోజు ఏది?
2. "నమో వేంకటేశాయ" పత్రిక ఎప్పుడు ప్రారంభమయింది?
3. త్రిపురాసురుల పేర్లు ఏమి?
4. బలి పాడ్యమి ఎప్పుడు?
5. పరీక్షిత్తుని శపించిందెవరు?
6. త్రిపురాసుర వధకి శివుని సారథి ఎవరు?
7. "శక్" అంటే ఏమిటి?
8. మూడు సంవత్సరాల బాలికను ఏమని పూజిస్తారు?
9. శుంభ నిశుంభులను చంపిందెవరు?
10. రెక్కలు పోగొట్టుకున్న పక్షి ఎవరు?
11. లంకానగరం ఏ పర్వతం మీద ఉంది?
12. ఏ భక్తుడి కోసం జగన్నాథుడు జ్వరం తెచ్చుకున్నాడు?
13. 8 వ రోజు బతుకమ్మ పేరేంటి?
14. ఆంజనేయుని అడ్డుకున్న రాక్షసి ఎవరు?
15. దేవీ నవరాత్రులలో ఏ వృక్షాన్ని పూజిస్తారు?

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________
6. ______________________
7. ______________________
8. ______________________
9. ______________________
10. ______________________
11. ______________________
12. ______________________
13. ______________________
14. ______________________
15. ______________________

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. భాద్రపద శుక్ల ద్వాదశి నాడు, 2. వైకుంఠ ఏకాదశినాడు, 3. విశ్వజిత్తు, 4. జరత్కారుడు, జరత్కారువు, 5. తక్షకునితో, 6. ధర్మరాజుకి శ్రీకృష్ణుడు, 7. దంతంతో, 8. ఉపాసనా కాండ, 9. మహేంద్ర పర్వతం, 10. వాయుదేవుడు, 11. నారదుడు, 12. పురందర దాసుగా, 13. యమధర్మరాజు, 14. వాయుదేవుని, 15. వినాయకుడు

### సరైన సమాధానాలు రాసినవారు

**ఎవరూ సరైన సమాధానాలు రాయలేదు**

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________



Postel Registration No:
HSE/879/2022-2024

Published on 28th and Licenced to
Post On 29th & 30th of Every Month

RNI No.:
APTEL/2008/23122



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq